www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

తెలుగు జవాను వీరమరణం



పాక్‌తో పోరాడుతూ అమరుడైన ఏపీకి చెందిన అగ్నివీర్ మురళీనాయక్

ఆపరేషన్ సిందూర్ కోసం జమ్మూ సరిహద్దులకు

అంతకుముందే తల్లిదండ్రులతో ఫోన్‌లో కబుర్లు 2

తర్వాత గంటల వ్యవధిలోనే అమరుడైన మురళి

జవాను కుటుంబానికి సీఎం చంద్రబాబు పరామర్శ.. 5 లక్షల సాయం

నేడు శ్రీ సత్యసాయి జిల్లా కళ్లితండాకు మురళి భౌతికకాయం

మురళీనాయక్

శనివారం | 10-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) :23 సంచిక (Issue) :41 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి సా.5.30 తదుపరి చతుర్దశి; నక్షత్రం: చిత్త తె.3.15 తదుపరి స్వాతి; వర్జ్యం: ఉ.9.11-10.59, దుర్ముహూర్తం: ఉ.5.48-7.30, అమృతఘడియలు: రా.8.01-9.49, రాహుకాలం: ఉ.9.00-ఉ.10.30, సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఉద్రిక్తంగానే..

వరుసగా రెండో రోజూ పాక్ డ్రోన్ దాడులు

కశ్మీరు నుంచి కచ్ వరకూ 20 నగరాలు లక్ష్యంగా..

నాలుగు రాష్ట్రాల్లో 26 డ్రోన్లు.. కూల్చివేసిన భారత సైన్యం

డ్రోన్ దాడికి ఫిరోజ్‌పూర్‌లో ముగ్గురికి గాయాలు.. ఒకరు విషమం

సరిహద్దు ప్రాంతాల్లో రెండో రోజూ సైరన్ మోతలు, చిమ్మ చీకట్లు

పంజాబ్‌లోని అమృత్‌సర్ నగరంలో లైట్లు ఆర్పేయడంతో అంధకారం అలుముకున్న దృశ్యం



జమ్మూ, శ్రీనగర్, అమృత్‌సర్, మే 9: భారత్, పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో వరుసగా రెండో రోజు కూడా ఉద్రిక్త పరిస్థితులే కొనసాగుతున్నాయి. జమ్మూ కశ్మీరు నుంచి గుజరాత్ వరకూ సైరన్ మోతలు వినిపిస్తున్నాయి. రాజస్థాన్‌లోని జైసల్మేర్, జోధ్‌పూర్ సహా జమ్ము నుంచి పంజాబ్ వరకూ చాలా ప్రాంతాల్లో బ్లాకవుట్ కొనసాగుతోంది. ఇళ్లల్లోనూ బయటా లైట్లు ఆర్పేయడంతో చిమ్మ చీకట్లు నెలకొన్నాయి. అదే సమయంలో, పాకిస్థాన్ తన దుర్బుద్ధిని పోనిచ్చుకోలేదు. జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌ల్లోని 20 నగరాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని శుక్రవారం రాత్రి కూడా పాకిస్థాన్ డ్రోన్ దాడులు చేసింది. మరోసారి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడింది. బారాముల్లా నుంచి భుజ్ వరకూ నాలుగు రాష్ట్రాల్లో 26 డ్రోన్ దాడులు చేసింది. వాటన్నిటినీ భారత్ అడ్డుకుని కూల్చేసింది. వీటిలో శ్రీనగర్ విమానాశ్రయం, దక్షిణ కశ్మీరులోని అవంతిపుర

మిగతా 13వ పేజీలో...

కూల్చాం.. నిర్వీర్యం చేశాం

గురువారం ఒక్కరోజే 300-400 టర్కీ డ్రోన్లతో దాడికి పాక్ యత్నం 11

కశ్మీర్‌లోని లేహ్ నుంచి గుజరాత్‌లోని సర్‌క్రీక్ దాకా 36 నగరాల్లోని సైనిక శిబిరాలే లక్ష్యం

అత్యధిక డ్రోన్లలో ఎలాంటి ఆయుధాలూ లేవు

మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను పరీక్షించడానికే

శిథిలాలపై దర్యాప్తు.. మరిన్ని ఆధారాల సేకరణ

పౌర విమానాలను పాక్ అడ్డుగా పెట్టుకుంది

మీడియాతో విక్రమ్ మిస్రి, సోఫియా, వ్యోమికా

జమ్మూలో చొరబాటుకు ఉగ్రవాదుల యత్నం

ఏడుగురిని హతమార్చిన బీఎస్ఎఫ్ 13

భారత దాడులతో కరాచీ పోర్టు దెబ్బతింది

పోర్ట్ ట్రస్ట్ అధికారిక 'ఎక్స్'లో పోస్ట్.. తర్వాత మాటమార్చి మరో పోస్ట్

12 తమ ఖాతా హ్యాకైందని.. పోర్ట్ సురక్షితంగానే ఉందని వివరణ

రుణాలతో ఆదుకోవాలని అంతర్జాతీయ భాగస్వాములకు పాక్ వినతి

'ఎక్స్'లో ఆ దేశ ఆర్థిక శాఖ.. ఖాతా హ్యాకైందని ఆ తర్వాత వెల్లడి



Karachi Port Trust Official
@official_kpt

Karachi Port has sustained heavy damage following a strike by India resulting in unacceptable loss of property. Emergency response efforts are underway. Updates on restoration will be provided regularly. We stand resilient.
#IndianNavyAction #IndiaPakistanWar #KarachiPort

కరాచీ పోర్టు ధ్వంసంపై పోర్టు ట్రస్ట్ ట్వీట్

పాక్‌కు ఐఎంఎఫ్ రుణం

100 కోట్ల డాలర్ల విడుదలకు ఓకే.. భారత్ అభ్యంతరం

ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశానికి అప్పిస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని హెచ్చరిక.. ఓటింగ్‌కు దూరం 11

ఆ ఇద్దర్నీ అప్పగించండి!

మౌలానా మసూద్ అజర్, హఫీజ్ సయీద్‌ను అప్పగించాల్సిందిగా పాకిస్థాన్‌కు భారత్ డిమాండ్? 13

టర్కీ షూట్!

200 బుల్లెట్లు కాల్చే డ్రోన్లను పాక్‌కు ఇచ్చిన టర్కీ

అయినా లెక్క చేయని భారత సైన్యం

పాక్ డ్రోన్లను, క్షిపణుల్ని

అద్భుతంగా అడ్డుకున్న మన ఎయిర్ డిఫెన్స్

యుద్ధంలో ఒక పక్షం మరో పక్షాన్ని చాలా సులభంగా దెబ్బ తీస్తే సైనిక పరిభాషలో దానిని 'టర్కీ షూట్' అంటుంటారు. 19వ శతాబ్దం ప్రారంభంలో అమెరికాలో తుపాకులతో షూటింగ్ ప్రాక్టీస్ చేయడం కోసం టర్కీ పక్షుల్ని వాడేవారు. ఆ పక్షిని సులభంగా కాల్చినట్లుగా శత్రు పక్షాన్ని అవలీలగా దెబ్బతీశారనే అర్థంలో ఈ ప్రయోగం వాడుకలోకి వచ్చింది. టర్కీ (ఇప్పుడు తుర్కియే) నుంచి దిగుమతి చేసుకున్న డ్రోన్లను వందల సంఖ్యలో భారత్‌పై గురి పెట్టిన పాక్‌కు కూడా ఇప్పుడు ఇదే పరిస్థితి ఎదురవుతోంది.



తుపాకీతో కూడిన టర్కీ డ్రోన్

తుర్కియే డ్రోన్లను, పాక్ క్షిపణుల్ని భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు సులభంగా దెబ్బతీస్తున్నాయి. పాక్ ప్రయోగించిన 90 శాతానికి పైగా ఆయుధాలను గాలిలోనే అడ్డుకుని పేల్చివేయగలుగుతున్నాయి. భారత్‌లోని 15 నగరాల్లో గల సైనిక స్థావరాలపై గురువారం తెల్లవారుజామున పాక్ దాడులు చేసింది. ఆ తర్వాత గురువారం మధ్యాహ్నం నుంచి జమ్ము, ఉధంపూర్ వంటి అనేక చోట్ల భారత సైనిక పోస్టులపై, చివరికి పౌర ఆవాసాలపై కూడా వరస దాడులకు దిగింది. ఇందుకోసం పాక్ వివిధ రకాల డ్రోన్లు, క్షిపణుల్ని ఉపయోగించింది. గురువారం నుంచి ఇప్పటివరకూ పాక్ 300 నుంచి 400కు పైగా తుర్కియే డ్రోన్లను భారత్‌పైకి ప్రయోగించిందని, వీటిలో అత్యధిక డ్రోన్లను

మిగతా 12వ పేజీలో...



నిత్యావసరాలకు కొరత లేదు

దేశంలో అవసరానికి మించి ఆహార ధాన్యాల నిల్వలున్నాయి 13

ఏ మాత్రం ఆందోళన అవసరం లేదు

ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం

కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవు

కేంద్ర ఆహార మంత్రి ప్రహ్లాద్ జోషీ వెల్లడి

పాక్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పలుచోట్ల హడావుడి కొనుగోళ్లపై మంత్రి స్పందన

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయన్న చమురు కంపెనీలు



త్రివిధ దళాధిపతులు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, భద్రతా సలహాదారుతో ప్రధాని మోదీ సమావేశం

ఏ పరిస్థితులకైనా సిద్ధం!

దేశ రాజధాని ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం

ఎయిర్ సైరన్ల ఏర్పాటు.. మాక్‌డ్రిల్స్ నిర్వహణ

పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దు

శత్రుదాడుల దృష్ట్యా రక్షణ చర్యలు పెంచాలి

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం ఆదేశం

దేశవ్యాప్తంగా ఆరోగ్య శాఖ సన్నద్ధతపై నడ్డా సమీక్ష

15 వరకు 24 విమానాశ్రయాల మూసివేత

న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్‌తో యుద్ధవాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రాష్ట్రాలు కూడా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నాయి. సరిహద్దు రాష్ట్రాల్లో పాఠశాలల మూసివేత, రాత్రివేళ విద్యుత్తు కోత, ఉద్యోగులకు సెలవులు రద్దు వంటి చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో దేశ రాజధాని ఢిల్లీలో భారీగా బలగాలను మోహరించడంతో పాటు కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు, ఎయిర్ సైరన్ల ఏర్పాటు, మాక్

మిగతా 13వ పేజీలో...

మోదీ ఉన్నతస్థాయి సమావేశం త్రివిధ దళాధిపతులు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ 13

మాజీ అధికారులతో చర్చలు.. సరిహద్దుల్లో భద్రతపై ఆరా

రంగంలోకి ప్రాదేశిక సైన్యం! 13

అవసరమైతే పిలిపించాలన్న కేంద్రం

ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారాల అప్పగింత

టెరిటోరియల్ ఆర్మీలో 50 వేల సిబ్బంది

వీరిలో క్రీడాకారులు, రాజకీయ నేతలూ..



ప్రాదేశిక సైన్యంతో క్రికెటర్ ధోని (ఫైల్)

ఐపీఎల్ వాయిదా

'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో వారంపాటు.. బీసీసీఐ నిర్ణయం 10

58 మ్యాచ్‌లు పూర్తి.. మిగిలినవి 16

భారత్‌ను వీడనున్న విదేశీ క్రికెటర్లు





ఉచితాలు ఆర్థిక వ్యవస్థకు భారం

ప్రజలు ఆలోచించాల్సిన సమయం వచ్చింది

వనరులు, నిధుల్లేకుండా పార్టీల హామీలు

కానీ, రాజ్యాంగం ప్రకారం సమీక్షించలేం

రిటైర్మెంట్ బెనిఫిట్లు అందలేదన్న ఓ పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టు వ్యాఖ్యలు 2

10 రోజుల్లో సర్కార్ చెల్లించాలని ఆదేశం

మిస్‌వరల్డ్ పోటీలకు
5వేల మందితో భద్రత

హోటల్ వద్ద సాయుధ మహిళా పోలీసులు..

ఆక్టోపస్ కమాండోలు.. సీసీ టీవీల నిఘా

మల్టీ ఏజెన్సీ కమాండ్ కంట్రోల్ సెంటర్

మూడంచెల భద్రతా వలయంలో పోటీల నిర్వహణ

అనుక్షణం పర్యవేక్షిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

నేటి నుంచే మిస్ వరల్డ్-2025 పోటీలు

గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభ వేడుకలు

అందాల భామలు.. బిర్యానీ, పలావ్‌లు!

పులుసు, వేపుడు అడిగి మరీ తింటున్నారు

100 మంది చెఫ్‌లు.. 500 మంది సహాయకులు

'మిస్ వరల్డ్ చెఫ్‌లతో 'ఆంధ్రజ్యోతి' ముచ్చట

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సర్కారు అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. చీమ చిటుక్కుమన్నా తెలిసేలా పోలీసులు నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు 109 దేశాలకు చెందిన సుందరీమణులు రాష్ట్రానికి రావడంతో భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడకుండా వ్యవహరిస్తున్నారు. 5వేల మందికి పైగా పోలీసులను ఈ పోటీల నిమిత్తం రంగంలోకి దించారు. వీరిలో అత్యధిక మంది సాయుధ పోలీసులే. పోటీల ప్రారంభ వేడుకలు జరిగే గచ్చిబౌలి స్టేడియంతోపాటు అతిథులు బస చేసి ఉన్న హోటళ్ల వద్ద షార్ప్ షూటర్లను, స్నైపర్లను మోహరించారు. ప్రపంచ సుందరి పోటీదారులకు హైదరాబాద్ హైటెక్‌సిటీలోని ఓ స్టార్ హోటల్‌లో బస ఏర్పాటు చేశారు. ఆ హోటల్‌తోపాటు ఆ ప్రాంతం మొత్తం నిఘా వ్యవస్థను పటిష్ఠం చేశారు. హోటల్‌లో ఉండే సీసీ టీవీలు, ట్రాఫిక్ సీసీ కెమెరాలను అన్నింటినీ నిత్యం

మిగతా 14వ పేజీలో...

ఆర్మీ పిలిస్తే వెళ్లి యుద్ధం చేస్తా

- గతంలో నేనూ సైన్యంలో పనిచేశా
- యుద్ధ విమానాలు నడిపాను
- పీవోకే భారత్ వశమైతే తప్ప కశ్మీర్ సమస్య పరిష్కారం కాదు
- ఇది నా వ్యక్తిగత అభిప్రాయం
- హెలికాప్టర్లో తిరగడం షో కోసం కాదు
- ప్రజల పనులు వేగంగా చేయాలనే
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్ మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరిగి, ఆర్మీ తనను పిలిస్తే.. వెళ్లి యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. తాను గతంలో భారత సైన్యంలో పనిచేశానని గుర్తు చేశారు. తనకు 20ఏళ్ల వయస్సున్నప్పుడే యుద్ధ విమానానికి పైలట్‌గా పనిచేశానని ఉత్తమ్ ఈ సందర్భంగా చెప్పారు. 1982లో మిగ్-21 ఫైటర్‌కు, ఆ తర్వాత మిగ్-23కి పైలట్‌గా పని చేశానన్నారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్ వశమైతే తప్ప కశ్మీర్ సమస్య పరిష్కారం కాదని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని, పార్టీకి సంబంధం లేదని అన్నారు. యుద్ధం జరిగితే పాకిస్థాన్ విచ్ఛిన్నమై పతనమవుతుందని అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి భారత సైన్యం ప్రతిదాడి సరైన చర్య అని ఉత్తమ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తాము షో చేయడానికి హెలికాప్టర్‌లో తిరగడం లేదని, ప్రజల పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకే వాడుతున్నామని ఉత్తమ్ వివరణ ఇచ్చారు. హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి తెలంగాణలోని ఏ ప్రాంతానికి వెళ్లినా గరిష్ఠంగా రూ.1.20 లక్షల మేరకు ఇంధనం ఖర్చు వస్తుందన్నారు. "ఏదైనా కార్యక్రమానికి హెలికాప్టర్‌లో వెళ్లినప్పుడల్లా ముగ్గురు, నలుగురు మంత్రులం వెళ్తున్నాం. నలుగురు మంత్రులు రోడ్డు మార్గంలో వెళితే కాన్వాయి, అధికారులు, పోలీసుల ఖర్చు కలుపుకొంటే అంతకంటే ఎక్కువ అవుతుంది. సమయం కూడా చాలా వృధా అవుతుంది" అని ఆయన చెప్పారు. తాము వాడుతున్న హెలికాప్టర్‌ను గత ప్రభుత్వమే లీజుకు తీసుకుందన్నారు. హెలికాప్టర్ సాయంతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల సమీక్షను సగం రోజులో పూర్తి చేశానని, అదే రోడ్డు మార్గంలో వెళ్లి సమీక్ష చేపట్టాలంటే 4రోజులు పట్టేదన్నారు. విస్తృతంగా పర్యటిస్తూ, వేగంగా పని చేస్తున్నామన్న కడుపు మంటతోనే తమపై విపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారని ఉత్తమ్ మండిపడ్డారు.



లోకం తీరు



ఎన్డీఎఫ్‌కు విరాళంగా నెల వేతనం

- ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నేతలు, ప్రజలు విరాళాలివ్వాలని పిలుపు



హైదరాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): నేషనల్ డిఫెన్స్ ఫండ్(ఎన్డీఎఫ్)కు ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఉగ్రవాదాన్ని తుడిచి పెట్టేందుకు, దేశ ప్రజల్ని కాపాడేందుకు భారత జవాన్లు చేస్తున్న పోరాటానికి చేయూతగా తన వంతు విరాళం అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తన సహచరులు, కాంగ్రెస్ నాయకులు, పౌరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునకు పార్టీ నేతలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తన నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు నెల వేతనాన్ని విరాళంగా సమర్పిస్తున్నట్లు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఈ అంశంపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతున్నారు. ఈ అంశంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ కూడా వారి ఒకరోజు వేతనాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళంగా ప్రకటించింది.

యుద్ధ వాతావరణం.. సమగ్ర ప్రణాళిక అవసరం

- ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఉత్పన్నమయ్యే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పోలీసు అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజల్లో జాతీయవాదాన్ని పెంపొందించడానికి అన్ని జిల్లా కేంద్రాల్లో అన్ని వర్గాల వారితో సంఘీభావ ర్యాలీలను నిర్వహించాలని చెప్పారు. ప్రజలను అప్రమత్తం చేసేలా మాక్ డ్రిల్స్‌ను నిర్వహించాలని అధికారులకు సూచించారు. అత్యవసర విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సెలవులను రద్దు చేసి, వారు హెడ్‌క్వార్టర్లలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రంలో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించామని చెప్పారు.

అన్ని రంగాలకు నాణ్యమైన విద్యుత్

- 'రాజీవ్ యువ వికాసం' లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయండి: భట్టి

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని అన్నిరంగాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దీనికోసం ఐదేళ్ల కాలానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, అమలు చేయాలని అధికారులకు సూచించారు. శుక్రవారం ఐదేళ్ల విద్యుత్ ప్రణాళికపై ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌ల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంతర్జాతీయ టెక్నాలజీ, ఫార్మా, మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలు పెట్టుబడులతో తమ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని, దీనివల్ల అంచనాలకు మించి విద్యుత్ డిమాండ్ నెలకొంటుందన్నారు. మరోవైపు.. ముందుగా నిర్దేశించుకున్న క్యాలెండర్ ప్రకారంగా రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులను ఎంపిక చేసి, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న రుణ మంజూరు పత్రాల అందజేతకు తగిన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకంపై సచివాలయంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కాగా, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 21 వరకు కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలకు కుటుంబ సమేతంగా హాజరు కావాలని డిప్యూటీ సీఎంను దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ వెంకట్రావు ఆహ్వానించారు. ఇదిలా ఉండగా, ఇదిలా ఉండగా, బొగ్గు ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న సింగరేణి రానున్న రోజుల్లో కీలక ఖనిజాల అన్వేషణ, సంప్రదాయేతర ఇంధన వనరుల రంగంలో ప్రవేశించి తన సత్తాను చాటాలని భట్టివిక్రమార్క అన్నారు. సచివాలయంలో సింగరేణి భవిష్యత్తు విస్తరణ ప్రాజెక్టులపై ఆయన సమీక్ష నిర్వహించారు.

ఎస్‌హెచ్‌జీల సోలార్ ప్లాంట్ల కోసం కమిటీలు

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌హెచ్‌జీ సోలార్ ప్లాంట్లు పెట్టడానికి వీలుగా స్వయం సహాయక సంఘాలకు సాంకేతిక సహాయం అందించేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘా(ఎస్‌హెచ్‌జీ)ల చేత పీఎం కుసుమ్‌లో కాంపోనెంట్-ఏ ద్వారా సోలార్ ప్లాంట్లు పెట్టించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. పొదుపు సంఘాల చేత భారీగా సోలార్ ప్లాంట్లు పెట్టించాలని ప్రభుత్వం యోచిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో అనుమతులు పొందిన పొదుపు సంఘాలు సోలార్ ప్లాంట్లు పెట్టడానికి అవసరమైన సహకారాన్ని జిల్లా కమిటీలు అందించనున్నాయి.

మరో 2,500 కోట్ల అప్పు తీసుకోనున్న సర్కార్

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,500 కోట్ల అప్పు తీసుకోవడానికి సెక్యూరిటీ బాండ్లను రిలీజ్ చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ నెల 13న నిర్వహించనున్న ఈ-వేలం ద్వారా రుణాన్ని సేకరించనుంది. 21 ఏళ్ల కాల పరిమితితో రూ.800 కోట్లు, 22 ఏళ్ల కాల పరిమితితో రూ.800 కోట్లు, 25 ఏళ్ల కాల పరిమితితో రూ.900 కోట్ల చొప్పున రుణాన్ని సేకరించనుంది. తెలంగాణ సహా దేశంలోని 7 రాష్ట్రాలు రూ.11,500 కోట్ల మేర రుణాలు తీసుకోనున్నాయి.

సరస్వతి నది పుష్కరాల కోసం ప్రత్యేకాధికారులు

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లిజిల్లా పరిధిలో ఈ నెల 15 నుంచి 31 వరకు సరస్వతి నది పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తరఫున ప్రత్యేకాధికారులను నియమించారు. ఆ శాఖ మంత్రి సీతక్క ఆదేశం మేరకు పీఆర్ డైరెక్టర్ సృజన శుక్రవారం ప్రొసీడింగ్స్ జారీ చేశారు. పెద్దపల్లి, వరంగల్, హన్మకొండ, ములుగు, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన నలుగురు డీపీవోలు, నలుగురు డీఎల్‌పీవోలు, 14 మంది ఎంపీడీవోలు, 28 మంది ఎంపీవోలు ప్రత్యేకాధికారుల విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో పోలీస్ నిఘా

సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు.. అసాంఘిక శక్తులపై ఆరా..!

- శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు!
- అడుగడుగునా తనిఖీలు.. సందర్శకుల పాసులు రద్దు



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పహారా కాస్తున్న భద్రతా సిబ్బంది

హైదరాబాద్ సిటీ/శంషాబాద్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న భీకర దాడుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రోజురోజుకూ పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. సౌత్ జోన్, సౌత్ వెస్ట్, సౌత్ ఈస్ట్ జోన్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పాత నగరంలోని పలు సున్నితమైన, సమస్యాత్మకమైన ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఎప్పటికప్పుడు పరిస్థితులపై పర్యవేక్షణ చేస్తున్నారు. భద్రత, బందోబస్తుపై స్థానిక పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్నారు.సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ పర్యవేక్షణలో ఆసిఫ్‌నగర్ డివిజన్ పోలీసులు మిరాజ్ ఎక్స్‌రోడ్డు నుంచి మల్లేపల్లి ఎక్స్‌రోడ్డు వరకు పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ప్రజలు భయభ్రాంతులకు గురికావొద్దని, ఎలాంటి పరిస్థితులెదురైనా తాము అండగా ఉంటామంటూ భరోసా కల్పించారు. విరాజ్ ఎక్స్‌రోడ్డు నుంచి మల్లేపల్లి ఎక్స్‌రోడ్డు వరకు పెట్రోలింగ్ నిర్వహించారు. మరోవైపు.. నగరంలోని పలు ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులు దృష్టి సారించారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే రౌడీషీటర్లు, అల్లరిమూకలు, అరాచక శక్తులకు సిటీ పోలీసులు తీవ్రంగా హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హైఅలర్ట్

భారత్, పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన సంఘటన శుక్రవారం తీవ్ర కలకలం రేపింది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 10.45 గంటలకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 'మేము పాకిస్థాన్ స్లీపర్ సెల్స్. ఏ క్షణంలోనైనా ఎయిర్‌పోర్టును పేల్చి వేస్తాం' అని ఆర్జీఐ ఎయిర్‌పోర్టుకు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో భద్రతా బలగాలు, సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు, అప్రమత్తమయ్యారు. ఏటీసీ టవర్, అరైవల్, డిపార్చర్, పార్కింగ్ తదితర ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా బాంబు లేదని నిర్ధారించిన తరువాత వచ్చింది ఫేక్ మెయిల్ అని అధికారులు తేల్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ బలగాలతో 24 గంటల పాటు గస్తీ నిర్వహిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. భద్రత బలగాలు ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్నారు. సందర్శకుల పాసులను రద్దు చేశారు. పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి శ్రీనగర్, అమృత్‌సర్, జోధ్‌పూర్, చండీగఢ్, రాజ్‌కోట్ వెళ్లే విమాన సర్వీసులను పూర్తిగా రద్దు చేశామని జీఎంఆర్ అధికారులు తెలిపారు.

ఆర్మీకి డొనేషన్లు ఇవ్వాలని నకిలీ లింకులు

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఆర్మీకి విరాళాలు ఇవ్వాలంటూ సోషల్ మీడియాలో సైబర్ నేరగాళ్లు లింకులు పంపుతున్నారు. ఆ వెబ్‌సైట్లను ఓపెన్ చేస్తే ఖాతాలు హ్యాక్ అవుతాయని సైబర్ క్రైం అధికారులు చెబుతున్నారు. సైన్యానికి విరాళాలు ఇవ్వాలనుకుంటే నేరుగా డిఫెన్స్ ఫండ్‌కు చెల్లించవచ్చని, ఇతర లింకులను ఓపెన్ చేయవద్దని సైబర్ సెక్యూరిటీ బ్యూ రో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అదను చూసి దండుకోవడమే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు వేల లింకులను సోషల్ మీడియాలో పెట్టారని, వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రస్తుతం యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఇది 24 గంటలు పని చేస్తుందని, ఎలాంటి సహాయం కావాలన్నా సంప్రదించాలని ఢిల్లీలోని రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ల్యాండ్‌లైన్:011-23380556.. వందన, రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ, లైజన్ హెడ్: 9871999044.. హైదర్ అలీ నఖ్వీ, రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకుడు: 9971387500.. జి.రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్: 9643723157.. సి.హెచ్.చక్రవర్తి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్: 9949351270.

సైన్యానికి మద్దతుగా పూజలు

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యానికి మద్దతుగా తెలంగాణ దేవాదాయ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించింది. దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్‌రావు ఆదేశాల మేరకు ఆలయాల్లో భారత సైన్యం శ్రేయస్సు కోసం శుక్రవారం పూజలు నిర్వహించారు. సైన్యం విజయం, సంక్షేమం కోసం సంకల్పం చేసి ఆరాధనలు చేశారు.

పాక్‌కు మద్దతుగా పోస్టు.. విద్యార్థినిపై కేసు

సంతోష్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పాకిస్థాన్‌కు మద్దతుగా పోస్టులు పెట్టిన విద్యార్థినిపై ఐఎస్ సదన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పాతబస్తీకి చెందిన విద్యార్థిని చంపాపేటలోని ఓ డిగ్రీ కళాశాలలో బీబీఏ రెండో సంవత్సరం చదువుతోంది. ఆపరేషన్ సిందూర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఆమె పాకిస్థాన్‌కు అనుకూలంగా పోస్టులు పెట్టింది. ఇవి వైరల్ అయ్యాయి. బీజేవైఎం నాయకులు ఆమెను కాలేజీ నుంచి సస్పెండ్ చేయాలంటూ ధర్నా నిర్వహించారు. ఆ పోస్టులపై అంతర్గత విచారణ తరువాత కాలేజీ యాజమాన్యం విద్యార్థినిని సస్పెండ్ చేసింది.



సీఐసీగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సీఐసీగా చంద్రశేఖర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్ ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ)గా ఐఎఫ్ఎస్ అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జి.చంద్రశేఖర్‌రెడ్డితో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. మూడేళ్లు లేదా 65 ఏళ్ల వయస్సు వచ్చే వరకు చంద్రశేఖర్ రెడ్డి ఈ పదవిలో కొనసాగనున్నారు.

నిమ్స్ వైద్యులకు ఆరోగ్యశ్రీ ప్రోత్సాహకం

- కొత్తగా 800 పోస్టుల భర్తీకి అనుమతి

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ రోగులకు చికిత్స అందించినందుకు, నిమ్స్‌కు ఆరోగ్యశ్రీ నుంచి వచ్చే డబ్బులో 35 శాతం ఇకపై డాక్టర్లకు, వైద్య సిబ్బందికి అందించేందుకు ముందడుగు పడింది. సచివాలయంలో శుక్రవారం జరిగిన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌లో సంబంధిత ప్రతిపాదనకు మంత్రి దామోదర రాజనర్సింహ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన నిమ్స్ డైరెక్టర్ బీరప్ప.. గత ఏడాది నిమ్స్‌లో ఆరోగ్య శ్రీ కింద రోగులకు అందించిన సేవల వివరాలతో కూడిన నివేదికను అందజేశారు. పెరుగుతున్న రోగులకు సంఖ్యకు అనుగుణంగా డాక్టర్లు, సిబ్బంది భర్తీకి అనుమతించాలని కోరారు. అనంతరం మంత్రి దామోదర మాట్లాడుతూ నిమ్స్‌లో 800పైగా పోస్టుల భర్తీకి అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించారు. కొత్త భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు.

తెలుగు జవాను వీరమరణం

పాక్ సైనికులతో వీరోచితంగా పోరాడుతూ అమరుడైన అగ్నివీర్ మురళీనాయక్

వీరజవాను కుటుంబానికి ఏపీ సీఎం చంద్రబాబు పరామర్శ

పుట్టపర్తి/హిందూపురం/అమరావతి/ఓర్వకల్లు/కర్నూలు, మే 9(ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లో తెలుగు జవాన్ మురళీ నాయక్(23) వీరమరణం పొందారు. దేశ రక్షణకు సేవలందిస్తూ పాక్ జవాన్ల తూటాలకు బలయ్యారు. సరిహద్దుల్లో హోరాహోరీగా జరిగిన కాల్పుల్లో ఆయన మృతిచెందినట్లు శుక్రవారం ఉదయం కుటుంబసభ్యులకు ఆర్మీ క్యాంప్ అధికారులు సమాచారం అందించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లి తండాకు చెందిన మురళీ నాయక్ 2022 నవంబరులో అగ్నివీర్‌లో ఉద్యోగం సాధించి, నాసిక్‌లో శిక్షణ తీసుకున్నారు. అస్సాంలో విధుల్లో ఉంటున్న ఆయన్ను ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్ముకశ్మీర్ సరిహద్దులకు పిలిపించారు. గురువారం అర్ధరాత్రి 12గంటల సమయంలో రాజౌరీ సెక్టార్‌లోని ఎల్‌వోసీ వద్ద పాక్ సైన్యం కాల్పులకు తెగబడింది. వారికి తగిన బుద్ధి చెప్పడానికి భారత్ కూడా ఎదురుకాల్పులు ప్రారంభించింది. యుద్ధరంగంలో వీరోచితంగా పోరాడుతున్న మురళీ నాయక్‌కు పాక్ సైనికుల తూటాలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్స కోసం విమానంలో ఢిల్లీకి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే వీర మరణం పొందినట్టు తెలిసింది. ఒక్కగానొక్క కూమారుడు ఇక లేడన్న విషయం తెలియగానే తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మురళీనాయక్ భౌతిక కాయాన్ని శనివారం కళ్లితండాకు తీసుకురానున్నారు. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం ఆదేశించింది.

పేద కుటుంబం నుంచి..

గడ్డం తండా పంచాయతీ పరిధిలోని కళ్లితండాకు చెందిన శ్రీరామ్‌నాయక్, జ్యోతిబాయి దంపతులకు మురళీ నాయక్ ఒక్కరే సంతానం. వీరికి తండాలో ఒకటిన్నర ఎకరం పొలం ఉంది. వ్యవసాయ పనులు ఉన్నప్పుడు తండాలో ఉంటారు. మురళీ నాయక్ గురువారం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్యలో తల్లిదండ్రులకు ఫోన్‌చేసి, క్షేమసమాచారాలు అడిగారు. తరువాత 9 గంటల సమయంలో స్నేహితుడు వినోద్ నాయక్‌కి ఫోన్ చేశారు. సరిహద్దుల్లో భీకర పోరు సాగుతోందని అక్కడి పరిస్థితిని వివరించారు. 'నా గురించి భయం లేదు. కానీ అమ్మానాన్నలపైనే బెంగ. నాకు ఏదైనా జరగరానిది జరిగితే వారిని బాగా చూసుకో' అని కోరారు. ఈ రాత్రి గట్టెక్కితే తనకు పునర్జన్మే అన్నాడని వినోద్ ఆవేదన వ్యక్తం చేశారు.



తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతిబాయితో మురళీ నాయక్ (ఫైల్)

ఒక్కరోజైనా ఆర్మీలో చేయాలని..

అగ్నివీర్ శిక్షణకు వెళ్లే సమయంలో మురళీ నాయక్‌ను తల్లిదండ్రులు వారించారు. ఈ ఉద్యోగం వద్దని, మరొకటి చూసుకోవాలని వారు ఎంత చెప్పినా మురళి ఒప్పుకోలేదు. 'ఒక్కరోజైనా ఆర్మీలో పనిచేయాలని ఉంది' అని తన సంకల్పాన్ని తల్లిదండ్రులకు వివరించి, ఒప్పించాడని అతని స్నేహితులు రాజశేఖర్, బాలు, రాజ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు. అనంతపురం జిల్లా పర్యటనకు శుక్రవారం వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు, పుట్టపర్తి విమానాశ్రయంలో దిగిన వెంటనే మురళీ నాయక్ వీరమరణం గురించి తెలుసుకున్నారు. వెంటనే తండాకు వెళ్లి వీర జవాను కుటుంబానికి ధైర్యం చెప్పాలని మంత్రి సవితను ఆదేశించారు. దీంతో ఆమె కళ్లి తండాకు వెళ్లి మురళి తల్లిదండ్రులను ఓదార్చారు. ఆ కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేశారు. "దేశం కోసం మీ బిడ్డ ప్రాణత్యాగం చేశారు. ఆ త్యాగం ఊరికే పోదు. మేమందరం మీ వెంట ఉంటాం. ధైర్యంగా ఉండండి' అని మురళీనాయక్ తల్లిదండ్రులను సీఎం చంద్రబాబు ఫోన్‌లో ఓదార్చారు. మురళీ నాయక్ విగ్రహాన్ని గోరంట్ల సర్కిల్‌లో ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత చెప్పారు.

మురళీనాయక్‌కు సీఎం రేవంత్, కేంద్ర మంత్రుల నివాళులు

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులతో పోరాడి అసువులు బాసిన వీర జవాన్ మురళీనాయక్‌కు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జవాను తండ్రి శ్రీరామ్ నాయక్‌తో బండి సంజయ్ ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. అమరుని కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఎంతో గర్వంగా ఉంది

తనకు ఒక్కడే కుమారుడని, అయినా దేశం కోసం వీరమరణం పొందడం ఎంతో గర్వంగా ఉందని మురళీ నాయక్ తండ్రి శ్రీరామ నాయక్ అన్నారు. చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరాలని చెప్పేవాడని, ఆఖరికి దేశం కోసమే ప్రాణాలు అర్పించాడని అన్నారు. 'జైహింద్.. జై భారత్' అని ఉద్వేగంగా అన్నారు. 20 రోజుల క్రితం కూడా ముంబై వచ్చి తమతో మాట్లాడి వెళ్లాడని, గురువారం రాత్రి కూడా ఫోన్‌లో మాట్లాడాడని తెలిపారు.

ఉచిత పథకాలు ఆర్థిక వ్యవస్థకు భారం

- సమాజం ఆలోచించాల్సిన సమయం ఇది
- రాష్ట్ర హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాల ఉచిత పథకాలపై రాష్ట్ర హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఎలాంటి నిధులు, ఆదాయ వనరుల్లేకుండానే ఆర్థికంగా భరించలేని ఉచిత పథకాలను రాజకీయ పార్టీలు ప్రకటించడంతో దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోందని జస్టిస్ నగేశ్ భీమపాక సారథ్యంలోని ఏకసభ్య బెంచ్ పేర్కొంది. ఉచిత పథకాల అమలుతో దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారం గురించి ప్రజలు, సభ్య సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉందని తెలిపింది. 40 ఏళ్ల సర్వీసు పూర్తి కావడంతో అసిస్టెంట్ ఇంజినీర్‌గా రిటైరైన ఏ.నరేందర్‌రెడ్డి తనకు రిటైర్‌మెంట్ బెనిఫిట్లు చెల్లించడం లేదని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం విచారణకు వచ్చింది. పిటిషనర్‌తోపాటు రిటైరైన ఉద్యోగుల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. ఉచిత పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందని ఆరోపించారు. పరిపాలన పేరుతో ఉచిత విద్యుత్, ఉచిత రవాణా, రుణ మాఫీ, రాయితీలు తదితర పేర్లతో అమలు చేస్తున్న ఉచిత పథకాలకే భారీగా నిధులు ఖర్చు చేస్తున్నదని, దీని వల్ల ప్రభుత్వ ఖజానాపై మోయలేని భారం పడుతోందన్నారు. కానీ, రిటైరైన ఉద్యోగుల బెనిఫిట్లు మాత్రం చెల్లించడం లేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. రాజ్యాంగంలోని 226వ అధికరణం ప్రకారం.. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో జోక్యం చేసుకునేందుకు అవకాశం లేదని, అవి న్యాయ సమీక్ష కిందకు రావని వ్యాఖ్యానించింది. అయితే, ఉచిత పథకాలతో దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారం గురించి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొంది. పిటిషనర్‌కు రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్లు పది వారాల్లో చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలిస్తూ పిటిషన్ విచారణను ముగించింది. కాగా, మెడికల్ ఏజ్ ఆధారంగా వికలాంగ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ ఇచ్చి తొలగించలేరని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. సిరికొండ మల్లేశ్ సహా పలువురు వ్యక్తులు తమను ఏకపక్షంగా ప్రభుత్వం తొలగించిందని ఆరోపిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. మెడికల్ ఏజ్ ఆధారంగా ఉద్యోగుల తొలగింపు చెల్లదని ఆదేశించింది.



శ్రీధర్, సందీప్ కుటుంబాలను ఆదుకుంటాం

ప్రభుత్వం ప్రకటన.. అధికారికంగా అంత్యక్రియలు.. పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్

మాచారెడ్డి/ఘట్‌కేసర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ప్రాణాలు కోల్పోయిన కామారెడ్డి జిల్లా పాల్వంచకు చెందిన కగార్ గ్రేహౌండ్ కానిస్టేబుల్ శ్రీధర్.. వాజేడు మండలం పెనుగోలు, లంకపల్లి అడవుల్లో ఎదురుకాల్పుల్లో ఘట్‌కేసర్‌కు చెందిన కగార్ గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ తిక్క సందీప్ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. శ్రీధర్, సందీప్ అంత్యక్రియలు శుక్రవారం వారి వారి స్వస్థలాల్లో కుటుంబసభ్యులు, గ్రామస్థుల అశ్రునయనాల మధ్య ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. శ్రీధర్, సందీప్‌కు గౌరవసూచకంగా పోలీసులు మూడు సార్లు గాల్లోకి తుపాకులను పేల్చారు. పాల్వంచలో జరిగిన శ్రీధర్ అంత్యక్రియల్లో ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుతో కలిసి మంత్రి పొన్నం పాల్గొన్నారు. అంతకుముందు శ్రీధర్ మృతదేహం వద్ద మంత్రి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని ఆయన ఓదార్చారు. ఘట్‌కేసర్‌లో జరిగిన సందీప్ అంత్యక్రియల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ ఈటల పాల్గొన్నారు. సందీప్ చితికి తల్లి శోభ నిప్పంటించింది.





పాల్వంచలో కానిస్టేబుల్ శ్రీధర్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్.. ఘట్‌కేసర్‌లో కానిస్టేబుల్ సందీప్‌కు నివాళి అర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్‌బాబు

శాంతి చర్చలు జరిపేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుండగానే ఈ ఘటన జరగడం దురదృష్టకరం అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, కాంగ్రెస్ సర్కారు హింసకు వ్యతిరేకమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కర్రెగుట్టల్లో అమరుడైన ఏపీలోని ప్రకాశం జిల్లా పెద్దచెర్లోపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పవన్ కల్యాణ్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో శుక్రవారం జరిగాయి.

రూ.కోటి పరిహారం: రేవంత్

మందుపాతర పేలి మృతి చెందిన ముగ్గురు కానిస్టేబుళ్లకు సీఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఒక్కో కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి పరిహారం అందిస్తుందని ప్రకటించారు. 300 గజాల ఇంటి స్థలం కేటాయించటంతో పాటు కుటుంబీకుల్లో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని పేర్కొన్నారు.

కేంద్రం ఆదేశాలపై జోక్యం చేసుకోలేం

» పాకిస్థాన్ చిన్నారుల గడువు పిటిషన్‌పై హైకోర్టు

బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ పౌరులు దేశాన్ని వీడాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలలో జోక్యం చేసుకోలేమని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత కేంద్రం ఆదేశాల నేపథ్యంలో.. పాకిస్థాన్ పౌరసత్వం కలిగిన తన ముగ్గురు పిల్లలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకుండా చూడాలని మైసూరుకు చెందిన ఓ మహిళ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను శుక్రవారం విచారించిన హైకోర్టు ధర్మాసనం..కేంద్ర ప్రభుత్వం దేశప్రజల రక్షణ కోసం ఆ ఆదేశాలు జారీ చేసిందని, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. మైసూరుకు చెందిన ఆ మహిళ పాకిస్థాన్‌లోని బలూచిస్తాన్ వ్యక్తిని పెళ్లి చేసుకున్నారు. ఆమెకు బీబీ యామినా(8), మహ్మద్ ముదాసిఫ్(4), మహ్మద్ యూసఫ్(3) సంతానం ఉన్నారు. ఈ ముగ్గురికీ పాకిస్థాన్ పౌరసత్వం ఉంది. జనవరిలో ఆమె తన పిల్లలతో కలిసి మైసూరుకు వచ్చారు. కేంద్రం ఆదేశాలతో పాకిస్థాన్‌కు వెనుతిరిగి వెళ్లేందుకు వాఘా సరిహద్దుకు వెళ్లారు. అక్కడ పిల్లల తండ్రి, వారి కుటుంబీకులు ఎవరూ సానుకూలంగా స్పందించలేదు. దీంతో ఆమె మైసూరుకు వచ్చి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది.

పాక్‌కు మద్దతుగా పోస్టులు పెల్లుబికిన వ్యతిరేకత

బెంగళూరు, మే 9(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ కొనసాగుతున్న నేపథ్యంలో విజయపుర, మంగళూరుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు పాకిస్థాన్‌కు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. విజయపురలోని అల్-అమీన్ మెడికల్ కళాశాల విద్యార్థిని తషా ఉర్దా ఫారూకి షేక్ పేరిట ఉన్న ఎక్స్ ఖాతాలో 'నా పాకిస్థాన్ స్నేహితురాలా, ఐటజీకే, ఏజేకే ప్రజలు ప్రభుత్వ మిలిటరీ ప్రాంతాలకు వెళ్లకండి. సరిహద్దుకు 200 కి.మీ. చెంతకు వెళ్లకండి. అల్లా పాకిస్థాన్‌ను, మనల్నందరినీ రక్షించాలి' అని పోస్టు పెట్టారు. మంగళూరులోని బెళ్తంగడి తాలూకా బెలాలు గ్రామ నివాసి రేష్మా ఎస్ ఇన్‌స్టాలో 'ధిక్కార ఆపరేషన్ సిందూర' అనే పోస్టు పెట్టారు. ఈ ఇద్దరి పోస్టులపై తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మళ్లీ అన్వేషణ

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ఇన్‌లెట్(శ్రీశైలం)వైపు ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆచూకీ కోసం మళ్లీ అన్వేషణ చేపట్టాలని సాంకేతిక కమిటీ నిర్ణయించింది. ఇందుకోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రాక్ మెకానిక్స్ సహకారం తీసుకోవాలని, ఆ సంస్థ సూచించిన పద్ధతిని పాటిస్తూ సహాయక చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. గత ఫిబ్రవరి 22వ తేదీన ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పై కప్పు కూలి.. 8మంది చిక్కుకుపోగా... రెండు మృతదేహాలు వెలికితీశారు. మరో ఆరుగురి ఆచూకీ లభించలేదు. ఇన్‌లెట్(శ్రీశైలం) నుంచి 13.9 కిలోమీటర్ల మేర సొరంగం తవ్వగా.. చివర్లో ఉన్న 50 మీటర్లు అత్యంత ప్రమాదకరంగా ఉందని నిపుణులు హెచ్చరించడంతో గత నెల ఏప్రిల్ 24న సొరంగంలో సహాయక చర్యలు నిలిపివేశారు. అప్పట్లో సహాయక చర్యల కోసం ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ తాజాగా జలసౌధలో శుక్రవారం సమావేశమైంది. ఇందులో జాతీయ విపత్తుల స్పందన సంస్థ(ఎన్‌డీఆర్ఎఫ్), ఎన్‌జీఆర్ఐ, జీఎస్ఐ, నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్, ఎస్‌డీఆర్ఎఫ్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ శిథిలాలను నెమ్మదిగా తరలిస్తూ, సొరంగం పైకప్పు లైనింగ్ చేసుకుంటూ ముందుకెళ్లాలని రాక్ మెకానిక్స్ సూచించింది. జాతీయ భూభౌగోళిక పరిశోధన సంస్థద్వారా జియోఫిజికల్ పరీక్షలు చేయించాలని, దీనికి రెండు, మూడు నెలలు పట్టవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఆ లోగా తవ్వకానికి అవసరమైన పనులు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఇన్‌లెట్ వైపు నుంచి డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలోనే తవ్వకం చేపట్టాలని నిర్ణయించారు. మరోవైపు ఔట్‌లెట్ (మన్నెవారిపల్లి) వైపు టీబీఎం కోసం తెచ్చిన బేరింగ్‌ను బిగించడానికి నవంబరు దాకా సమయం పడుతుందని నిర్మాణ సంస్థ వెల్లడించింది. ఈ లెక్కన నవంబరు ఆఖరు వరకు సొరంగం పనులు ముందుకు కదిలే అవకాశాల్లేవని అంచనా వేస్తున్నారు.

ఏ రాష్ట్రాన్నీ బలవంతంగా ఒప్పించలేం

» జాతీయ విద్యా విధానంపై సుప్రీం

న్యూఢిల్లీ, మే 9: త్రిభాషా సూత్రంతో కూడిన జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)-2020ను అమలు చేసేలా తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ దాఖలైన పిల్ సుప్రీం కోర్టు శుక్రవారం కొట్టివేసింది. జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేమని ఈ సందర్భంగా జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం స్పష్టం చేసింది. "ఎన్ఈపీ-2020 అమలు చేయాలా వద్దా అనేది రాష్ట్రాలకు సంబంధించిన సమస్య. ఆర్టికల్ 32 ప్రకారం ప్రజల హక్కులు పరిరక్షించేలా చూడటానికే ఆదేశాలు ఇవ్వగలం. ఎన్ఈపీ-2020 లాంటి పాలసీలను అమలు చేయాలని ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేం. ఎన్ఈపీ విషయంలో ఏ రాష్ట్రమైనా ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలకు పాల్పడితే మాత్రమే జోక్యం చేసుకోగలం. అందువల్ల ఈ పిటిషన్‌ను విచారించలేం" అని ధర్మాసనం వెల్లడించింది. అయితే ప్రధాన సమస్య విషయంలో తగిన ప్రొసీడింగ్స్‌లో విచారణ చేపట్టే అవకాశం ఉంటుందని పేర్కొంది. కాగా, పిల్ విచారణకు ముందు పిటిషనర్ జీఎస్ మణిని కోర్టు ప్రశ్నించింది. ఎన్ఈపీ అమలు చేయాలని ఎందుకు కోరుకుంటున్నారని అడిగింది. తాను తమిళనాడుకు చెందిన వ్యక్తిని అని, ప్రస్తుతం ఢిల్లీలో నివసిస్తున్నానని పిటిషనర్ చెప్పారు. ఎన్ఈపీ అమలు కాకపోవడం వల్ల తమిళనాడులో తాను సులువుగా హిందీ నేర్చుకోలేనని తెలిపారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. 'ఇప్పుడు ఢిల్లీలో నేర్చుకోండి' అంటూ సూచించింది.

సహజీవనానికి సమ్మతే కీలకం

» కోర్టులు దానినే పరిగణించాలి

» వివాహ హామీతో శారీరకంగా కలిశాననే వాదన చెల్లదు

» రేప్ కేసును కొట్టేస్తూ సుప్రీం వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, మే 9 : ఆర్థిక స్వాతంత్ర్యం పొందిన మహిళలు సహజీవన బంధంలోకి ప్రవేశించడం ఈనాడు చాలా మామూలు వ్యవహారంగా మారిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వయోజనులైన యువతి, యువకుడు సహజీవన బంధంలోకి ఇష్టపూర్వకంగా వస్తున్నారంటేనే దానివల్ల రాగల పరిణామాల పట్ల పూర్తి అవగాహన వారికి ఉన్నదనే భావించాల్సి ఉంటుందని పేర్కొంది. వివాహం చేసుకుంటానని హామీ ఇవ్వడం వల్లే తాను ఆ బంధానికి అంగీకరించానని చేసే వాదన చెల్లదని అభిప్రాయపడింది. ఓ వ్యక్తిపై అతని సహజీవన భాగస్వామి చేసిన అత్యాచార అభియోగాలను కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పులో భాగంగా న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో చిన్న ఫిర్యాదు కూడా లేకుండా రెండేళ్లకు పైగా శారీరక సంబంధంలో ఇరువురూ కొనసాగారని బెంచ్ గుర్తించింది. అంతకాలం ఆ సంబంధంలో కొనసాగారంటేనే సంపూర్ణ అవగాహన, అంగీకారం, ఇష్టంతోనే ఆ పని చేశారనే వాదనకు బలం చేకూరుతుందని తెలిపింది. అందువల్ల ఇలాంటి కేసుల పట్ల కోర్టు మరీ పండిత చర్చలకు దిగకుండా ఉండటం మంచిదని సూచించింది. వివాహం చేసుకోవాలనే తలంపుతోనే సహజీవనం చేశారా లేదా అనేదీ అప్రస్తుతమని తెలిపింది. ఎంతకాలంగా కలిసి ఉంటున్నారు.. దాని పట్ల ఇరువురికీ అవగాహన, అంగీకారం ఉన్నాయా లేదా ..భాగస్వాముల ప్రవర్తన ఎలాంటిది అనే అంశాలను మాత్రం పరిగణించి కోర్టు నిర్ణయం తీసుకుంటే చాలునని బెంచ్ అభిప్రాయపడింది.

వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీయొద్దు!

» ఆ ఆర్మీ మహిళా అధికారుల ఎస్ఎస్‌సీ సర్వీసును ముగించొద్దు

» తదుపరి విచారణ వరకు చర్యలు వద్దు

» కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మే 9: షార్ట్ సర్వీస్ కమిషన్ కింద ఎంపికైన మహిళా ఆర్మీ అధికారులకు శాశ్వత కమిషన్ (పీసీ) నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ప్రస్తుత పరిస్థితుల్లో' వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీయొద్దంటూ పరోక్షంగా భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల గురించి ప్రస్తావించింది. 69 మంది మహిళా అధికారులు వేసిన పిటిషన్లపై తదుపరి విచారణను ఆగస్టుకు వాయిదా వేసింది. అప్పటి వరకు వారి షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) సర్వీసును ముగించి పంపించొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. 'వారు తెలివైన అధికారులు. మీరు వారి సేవలను వేరేచోట వినియోగించుకోవచ్చు. ఇది కోర్టుల చుట్టూ తిరగాల్సిన సమయం కాదు. దేశానికి సేవచేయడానికంటూ వారికి మంచి స్థానం ఉంది' అని జస్టిస్ కాంత్ పేర్కొన్నారు. కేంద్రం తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భటి వాదనలు వినిపిస్తూ.. ఇది భారత సైన్యానికి యువ అధికారులు అవసరమన్న విధానం ఆధారంగా తీసుకున్న పాలనాపరమైన నిర్ణయమని కోర్టుకు తెలిపారు. షార్ట్ సర్వీస్ కమిషన్ సర్వీసును ముగించి, ఆ మహిళా అధికారులను పంపించడంపై ఎలాంటి స్టే ఇవ్వొద్దని కోరారు.

దేశంలో నివసించే హక్కు భారత పౌరులకే

» రోహింగ్యాలకు వర్తించదు: సుప్రీం

న్యూఢిల్లీ, మే 9: ఈ దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు భారత పౌరులకు మాత్రమే వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భారతీయులు కాని వారిని విదేశీయుల చట్టం కింద పరిగణిస్తామని పేర్కొంది. దేశంలో ఉంటున్న రోహింగ్యా శరణార్థులను విదేశీయులుగా గుర్తిస్తే భారతీయ చట్టాల ప్రకారం వారిని బహిష్కరించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. ఢిల్లీ నుంచి అక్రమ రోహింగ్యా ముస్లిం వలసదారులను బహిష్కరించడంపై స్టే విధించడానికి నిరాకరించింది. మయన్మార్‌లో రోహింగ్యాలు అణచివేతకు గురవుతున్నారని, శరణార్థులుగా వారికి దేశంలో నివసించే హక్కు ఉందంటూ సీనియర్ న్యాయవాది కొలిన్ గొంజాల్వెజ్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టులో అత్యవసర పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. దేశంలో రోహింగ్యా ముస్లింల ఉనికిపై కేంద్రం భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తం చేసిన తర్వాత, అస్సాం, జమ్ము కశ్మీర్ నుంచి వారిని బహిష్కరించడాన్ని నిలిపివేయడానికి సుప్రీంకోర్టు గతంలో నిరాకరించిందని పేర్కొన్నారు.

గుండెపోటుతో సివిల్ కాంట్రాక్టర్ మృతి

» మృతుడు ఆదిలాబాద్‌కు చెందిన గుట్ట ప్రవీణ్

» రూ.50 కోట్ల పెండింగ్ బిల్లుల కోసం ఏడాదిగా తిరుగుతున్న ప్రవీణ్ !



ఆదిలాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సివిల్ కాంట్రాక్టర్ గుట్ట ప్రవీణ్ (46) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం గురువారం ఉదయం హైదరాబాద్ వెళ్లిన ప్రవీణ్ పనులు ముగించుకుని ఆదిలాబాద్‌కు తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. రాత్రి 11 గంటల సమయంలో ప్రవీణ్ ఛాతీలో నొప్పి రావడంతో అతనితో ఉన్న వ్యక్తులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు ప్రవీణ్ అప్పటికే మరణించారని నిర్ధారించారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న తదితరులు ప్రవీణ్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు. కాగా, ప్రవీణ్‌కు చెందిన తిరుమల కన్‌స్ట్రక్షన్ సంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.50కోట్ల బిల్లులు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఆ బిల్లుల కోసం ప్రవీణ్ ఇటీవల తరచూ హైదరాబాద్ వెళ్లి వస్తున్నారు. పెండింగ్ బిల్లుల విషయంలో ప్రవీణ్ ఇటీవల తీవ్ర మనస్తాపానికి గురైనట్టు కుటుంబ సభ్యులు, బంధువులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే తీవ్ర అస్వస్థతకు గురై గుండెపోటుతో మరణించినట్లు చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రాజు రాకడకోసం..!

నేపాల్‌ను మళ్ళీ హిందూ రాజ్యం చేయాలని, రాజు తిరిగి సింహాసనం అధిష్ఠించాలని డిమాండ్ చేస్తూ అక్కడ నిరసనలు సాగుతున్నాయి. రాజు రాకడకోసం సాగుతున్న ఈ ఉద్యమం నిర్దిష్టంగా, సంఘటితంగా లేకపోవడంతో ఆశించిన ఫలితం సాధించలేకపోతోందని, ఇకపై మరింత బలంగా ఆ పోరాటాన్ని కొనసాగించాలని రాచరిక అనుకూల సంస్థలు, పక్షాలు గురువారం తీర్మానించుకున్నాయి. ఈ నెల 29నుంచి మలిదశ ఉద్యమాన్ని మరింత తీవ్రతరంచేసి, ఆందోళనలు, నిరసనలతో అంతిమలక్ష్యాన్ని సాధించాలని సమావేశం నిర్ణయించింది. ఇది జరిగిన మర్నాడు ఇప్పటివరకూ విడివిడిగా ఉద్యమిస్తున్న కొన్ని చిన్నాచితకా పార్టీలు, సంస్థలు కూడా ఒకే గొడుగుకింద ఒక్కటిగా పోరాడటానికి తమ సంసిద్ధత ప్రకటించాయట. మొత్తంగా ఓ నలభైయాభై గ్రూపులు ఒక్కటైనాయట. రాచరిక అనుకూల శక్తులతో మాజీ రాజు జ్ఞానేంద్ర వరుసపెట్టి భేటీ అవుతూ వారిని ఏకం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్న పేరిట ప్రజల మధ్య నిత్యం తిరుగుతున్నారు. ఈ సంక్షోభసమయంలో ప్రజలంతా ఒక్కటి కావాలని, దేశాన్ని రక్షించుకోవాలని ఏవో రహస్య సందేశాలు కూడా ఇస్తున్నారు. ఇప్పటివరకూ ఎడమొఖం పెడమొఖంగా ఉంటున్న శక్తులన్నీ ఇకపై సంఘటితంగా ఉద్యమించి రాజును తిరిగి గద్దెమీద కూచోబెట్టడం ఖాయమని జ్ఞానేంద్ర అభిమానుల నమ్మకం.

రాచరిక అనుకూల ఉద్యమం బలహీనపడిందని, ఇక తేరుకోదని ఐదు రోజుల క్రితమే అధికారపక్షం తన సదస్సులో తీర్మానించిన నేపథ్యంలో, రాజ భక్తులంతా మళ్ళీ ఇలా తమ ఉనికిని చాటుకొనే ప్రయత్నం చేస్తున్నారని విశ్లేషకుల అభిప్రాయం. ఈ ఉద్యమం ఇంకా సామాన్యుల మనసులను తాకలేదని ఓ వాదన. రాచరికం రావాలంటున్నవారు పలు డిమాండ్లతో ఉద్యమిస్తున్నారు. హిందూ రాజ్యం, రాజ్యాంగబద్ధమైన రాచరికం, రెండంచెల ఫెడరల్ వ్యవస్థ ఇత్యాదివి వాటిలో కొన్ని. నేపాల్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తుత విధానం పరిష్కరించలేదని, నాయకులు ప్రజల ఆశలను వమ్ముచేశారని రాచరిక అనుకూల శక్తుల వాదన. ప్రజాస్వామ్యం ముసుగులో ప్రజాధనం దోపిడీకి పాల్పడ్డారని, అందువల్ల దేశాన్ని ఇప్పటివరకూ ఏలిన రాజకీయనాయకుల ఆస్తిపాస్తులవివరాలు బయటపెట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

లౌకిక, గణతంత్ర రాజ్యంగా నేపాల్ అవతరించిన రెండుదశాబ్దాల అనంతరం మళ్ళీ రాజురావాలంటూ నిత్యం ఆందోళనలు జరుగుతూండటం విచిత్రం, విషాదం. మార్చినెలాఖరులో సాగిన ఉద్యమం తీవ్రత కనీవినీ ఎరుగనిది. వేలాదిమంది వీధుల్లోకి వచ్చి నినాదాలు చేశారు, భద్రతాదళాలు విరుచుకుపడటంతో అది హింసాత్మకంగా మారి కొందరు మరణించారు కూడా. ఈ ఉద్యమంలో కీలకపాత్ర వహిస్తున్న మాజీ మార్క్సిస్టు గెరిల్లా, ప్రస్తుత బడావ్యాపారి దుర్గా ప్రసాయి భారతదేశానికి పారిపోయినట్టుగా వార్తలు రావడం, ఇటీవలే ఆయన అరెస్టు కావడం తెలిసిందే.

అధికారికంగా పదహారువేలమంది ప్రాణాలు తీసిన అంతర్యుద్ధం ముగిసి, రాజ్యాంగ రచన, రాచరికం రద్దు, గణతంత్ర రాజ్యస్థాపన జరిగిన తరువాత నేపాల్ అతివేగంగా అభివృద్ధిపథంలోకి దూసుకుపోతుందని అందరూ ఆశించారు. కానీ, 2008నుంచి ఇప్పటివరకూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడమే దానికి కష్టమైపోతోంది. పదిహేడు సంవత్సరాల్లో పదమూడు ప్రభుత్వాలు మారిపోవడం ఒక ఎత్తయితే, సైద్ధాంతికంగా పూర్తి భిన్నమైన పక్షాలు సైతం అధికారంకోసం కక్కుర్తిపడటం ఆశ్చర్యం. రాజకీయ అస్థిరత, అవినీతి కారణంగా ప్రజల్లో ప్రజాస్వామ్య వ్యవస్థలమీద నమ్మకం సడలిపోతోంది. ప్రచండ, కె.పి.శర్మ ఓలి అధికారమే పరమావధిగా దగ్గరవుతూ, వెంటనే వెన్నుపోట్లు పొడుచుకుంటూ, తమ రాజకీయ శత్రువులతో సైతం చేతులు కలుపుతూ ప్రదర్శిస్తున్న అధికారదాహం ప్రజలకు విరక్తికలిగించింది. అధిక ధరలు, అవినీతి, నిరుద్యోగం, మౌలిక రంగాల్లో ఏ మార్పూ లేకపోవడం వంటివి ప్రజలు మళ్ళీ రాచరికంవైపు చూసేందుకు అవకాశం ఇస్తున్నాయి. ప్రచండ, ఓలి వర్గాలను అప్పట్లో ఏకం చేసిన మాజీ మావోయిస్టు దుర్గా ప్రసాయి వంటి వ్యాపారవేత్తలు ప్రజల్లో ఉన్న ఈ అసంతృప్తిని వాడుకొని రాజును మళ్ళీ గద్దెనెక్కించేందుకు ప్రయత్నిస్తున్నారు. నారాయణహితిలో మళ్ళీ జ్ఞానేంద్రను రాజుగా చూడాలనుకుంటున్న ఈ ఉద్యమం దీర్ఘకాలం నిలిచి, అంతిమంగా గెలుస్తుందా లేదా అన్నది ఇప్పుడే చెప్పలేం. కానీ, ప్రజల్లో తమ పట్ల పెరుగుతున్న అసంతృప్తిని ప్రధాన రాజకీయపక్షాలు గుర్తించి, పరిష్కరించి, నడవడికను మార్చుకోని పక్షంలో, రాజు వచ్చి తమను రక్షించాలని నినదిస్తున్నవారి సంఖ్య అతి వేగంగా పెరిగే ప్రమాదమైతే లేకపోలేదు.

కులగణన మంత్రం ఫలిస్తుందా?

ప్రేమ, యుద్ధం, రాజకీయాలు. వీటిల్లో ఎప్పుడైనా ఏమైనా జరగవచ్చు. కులగణన కోరిన రాహుల్‌గాంధీని అర్బన్ నక్సలైట్ అంటూ విమర్శిస్తూ వచ్చిన నరేంద్ర మోదీ ఇప్పుడు తానే ఆ స్థానంలోకి పోయి కూర్చున్నారు. దేశమంతటా కులగణన జరుపుతామని ప్రకటించారు. ఇలాంటి బోల్ట్ ఫ్రమ్ ద బ్లూ పరిణామాలు బీజేపీలో చాలా ఉంటాయి.



స్వాతంత్ర్యం వచ్చాక గడిచిన 78 ఏళ్లల్లో 14 మంది ప్రధానులు మారారుగానీ ఒక్కరూ కులగణన జరపడానికి సాహసించలేదు. బ్రిటిష్ ప్రభుత్వంలో జనాభా లెక్కల కమిషనర్‌గా ఉన్న జె.హెచ్. హట్టన్ 1931లో మన దేశంలో కులగణన నిర్వహించాడు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉండగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ 2011లో సామాజిక, ఆర్థిక, కులగణన (SECC) నిర్వహించింది. దాని మీద నిరసనలు చెలరేగడంతో ఆ నివేదికను బయటికి రాకుండా నిలిపివేశారు. మనం ఇప్పటికీ తొంభైయేళ్ళ క్రితపు గణాంకాల ఆధారంగానే దేశ జనాభాలో కులాల శాతాల గురించి మాట్లాడుతున్నాం. జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీల వరకు వివరాలు సేకరిస్తుంటారు. అది కూడ 2011 తరువాత ఆగిపోయింది.

వెనుకబడిన తరగతులు, ముస్లిం సామాజికవర్గాల సంఖ్య, శాతాల విషయంలోనే తరచూ అనేక ఊహాగానాలు, వివాదాలు చెలరేగుతుంటాయి. ముస్లిం జనాభా వేగంగా పెరిగిపోతూ సమీప భవిష్యత్తులో ఇండియా ఒక ఇస్లామిక్ దేశంగా మారిపోతుందని సంఘ్ పరివార్ తరచూ ప్రచారం చేస్తుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ 2005లో ముస్లిం సమాజంలోని వెనుకబడిన తరగతులకు బీసీ–ఈ జాబితాలో 4శాతం రిజర్వేషన్ కల్పించినపుడు పెద్ద దుమారం రేగింది. ముస్లిం బీసీల జనాభా అంత లేదని, జనాభా గణాంకాలను శాస్త్రీయంగా సేకరించకుండా రిజర్వేషన్ కల్పించారని సంఘ్ పరివార్ వర్గాలు హైకోర్టును ఆశ్రయించాయి. న్యాయస్థానం కూడా దీన్ని పరిగణనలోనికి తీసుకుంది. కానీ, జనాభా గణాంకాలను శాస్త్రీయంగా ఎలా సేకరించాలో మాత్రం ప్రభుత్వానికి సూచించలేదు.

ఓబీసీలకు రాజ్యాంగం తొలి ప్రతిలో రిజర్వేషన్ లేదు. తమిళనాడులో నిరసనలు చెలరేగాక, సుప్రీంకోర్టు జోక్యంతో రాజ్యాంగానికి తొలి సవరణగా ఆర్టికల్ 15(4) చేర్చి రాష్ట్రాల స్థాయిలో విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించారు. అయితే, కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఈ సౌకర్యం కల్పించలేదు.

ఓబీసీలు సామాజిక, విద్యా, ఆర్థిక రంగాల్లో ఎదుర్కొంటున్న వివక్ష, వెనుకబాటుతనం, పేదరికాలను తొలగించడానికి అవసరమైన సూచనలు ఇవ్వడానికి 1979 జనవరి 1న అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయి బీపీ మండల్ కమిషన్ వేశారు. దేశ జనాభాలో ఓబీసీలు 54శాతం ఉన్నారని మండల్ కమిషన్ తేల్చింది. వారికి కేంద్ర ప్రభుత్వంలో, ప్రభుత్వరంగ సంస్థల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పించాలని సూచించింది. ఆ సిఫార్సుల్ని ఓ దశాబ్దం తరువాత 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధాని వీపీ సింగ్ ఆమోదించారు. ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించడం సహించలేని ఆధిపత్య కులాలు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోయాయి. ఉత్తర భారతదేశంలో నిరసన జ్వాలలు చెలరేగాయి.

> 1 రాజకీయ రంగంతోపాటు సామాజిక, ఆర్థిక రంగాల్లోనూ సమానత్వాన్ని సాధించకపోతే ప్రజలు తిరగబడతారని అంబేద్కర్ సాక్షాత్తూ రాజ్యాంగ సభలోనే హెచ్చరించాడు. రాజకీయాల్లో ఎస్టీ రాష్ట్రపతిని చూసి అడవిలో ఆదివాసులు, బీసీ ప్రధానిని చూసి మైదానాల్లో బీసీలు సంతృప్తి పడిపోరు. వాళ్ళకు సాంఘిక, ఆర్థిక సమానత్వం కావాలి.

1984 లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాలు గెలుచుకుని పార్లమెంటులో ప్రవేశించిన బీజేపీ, 1989 ఎన్నికల్లో బాగా పుంజుకుని 85 స్థానాలకు చేరుకుంది. ఆ పార్టీ తన రాజకీయ భవిష్యత్తును ఆధిపత్య కులాల నిరసనల్లో గుర్తించింది. 'మండల్‌కు వ్యతిరేకంగా కమండలం' చేపట్టి రామ్ రథయాత్ర మొదలెట్టింది. ఇందులో బీజేపీకి నాలుగు లక్ష్యాలున్నాయి. మొదటిది: రాజకీయ రంగంలో ఆధిపత్య కులాల ప్రతినిధిగా ప్రకటించుకోవడం. రెండోది: ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించిన వీపీ సింగ్ ప్రభుత్వాన్ని కూల్చేయడం. మూడోది: ముస్లింల నుంచి హిందూ మతానికి ముప్పు పొంచి ఉందని ప్రచారం చేయడం. నాలుగోది: దేశంలోని ఓబీసీ తదితర బహుజనుల దృష్టిని రిజర్వేషన్ల నుంచి అయోధ్య రాముని వైపు మళ్ళించడం. రామ్ రథయాత్ర పెట్టుకున్న లక్ష్యాల్లో బీజేపీ కొన్నింటిని పూర్తిగా కొన్నింటిని పాక్షికంగా సాధించింది.

సంఘ్ పరివార్ రోడ్ మ్యాప్‌లో 1992 నాటి బాబ్రీ మసీదు కూల్చివేతతో ఒక ఘట్టం ముగిసింది. ఆ మహాసంస్థ తను చేపట్టిన 'పవిత్ర యుద్ధం'లో హిందూ ఎస్టీ, ఎస్సీ, బీసీలలో చెప్పుకోదగ్గ భాగాన్ని తన కాల్బలంగా మార్చుకోగలిగింది. ఈ పరిణామం 2002 నాటి గుజరాత్ అల్లర్లలో స్పష్టంగా కనిపించింది.

సంఘ్ పరివార్ కులాలను గుర్తించదు. హిందూ సమాజం మొత్తం ఒకే మతం అనేది దాని సిద్ధాంతం. ఈ సిద్ధాంతానికి ప్రభావితులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ నేతలు కొందరు బీజేపీకి తమ శక్తిమేర సేవలు అందించారు. వారిలో ప్రముఖ అంబేద్కరైట్లు కూడ వున్నారు. బయటి ప్రపంచానికి అంతగా తెలియదుగానీ ఆదివాసుల్లో తండాకు ఒక మతం ఉంటుంది. మరింత లోతుకు వెళితే ఒక్కో సమూహానికి ఒక్కో మత విశ్వాసం ఉంటుంది. ఇప్పుడు జనాభా లెక్కల్లో ఆ వైవిధ్యాన్ని పూర్తిగా తొలగించేశారు. హిందూ, ఇస్లాం, క్రైస్తవం, సిక్కు, బౌద్ధ జైన మతాల్లో ఏదో ఒకదాన్ని ఆదివాసులు ఎంచుకునేలా జనాభా లెక్కల చట్టాన్ని సవరించారు.

భారత ముస్లిం సమాజంలో కూడా శాఖ, కుల వర్గీకరణ తెచ్చి 'సున్నీ అష్రాఫ్'లకు వ్యతిరేకంగా షియా, సున్నీ బీసీ, ఎంబీసీలను దగ్గరికి చేర్చుకోవడానికి ఒక దశలో బీజేపీ ప్రయత్నించింది. అది తమ 'పవిత్రయుద్ధం' ఫార్ములాకే ముప్పుగా మారుతుందని భయపడి ఆ కాడిని దించేసింది.

బ్రిటీష్ పాలకులు నేరస్మృతిని ఇంగ్లండు నుండి తెచ్చారు గానీ పౌరస్మృతిని ఇక్కడి స్థానికులనే ఎంచుకోమన్నారు. బెంగాల్ గవర్నర్ జనరల్‌గా ఉన్న వారెన్ హేస్టింగ్స్ 1772లో హిందూ ప్రతిధుల కోరిక మేరకు మనుధర్మాన్ని పౌరస్మృతిగా ప్రకటించాడు. భారత రాజ్యాంగ రచనా సంఘానికి అధ్యక్షునిగా వ్యవహరించిన బీఆర్ అంబేద్కర్ ఇక మనుస్మృతికి కాలం చెల్లింది అని ప్రకటించడం సంఘీయులకు ఆగ్రహాన్ని తెప్పించింది. రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోనికి రాగా, ఆ వెంటనే వచ్చిన 'ఆర్గనైజర్' పత్రిక ఫిబ్రవరి 6 సంచిక "మనువు మన హృదయాలను పాలిస్తుంటాడు" అని ప్రకటించింది.

హిందూ ఎస్సీ, బీసీ, ఎస్టీలను మత ప్రాతిపదిక మీద తమకు దగ్గరగా తీసుకొని ఓటు బ్యాంకును పెంచుకోవాలనుకుంటున్న సంఘీయులు అంబేద్కర్‌ను వ్యూహాత్మకంగా స్వంతం చేసుకుంటున్నారు. అంబేద్కర్ రచనల్ని వాళ్ళు ఆరు భాగాలుగా విభజిస్తున్నారు. మొదటిది: మనుస్మృతి, కుల అణచివేత మీద అంబేద్కర్ చేసిన ఘాటైన విమర్శను దాచి పెడతారు. లేదా, వర్ణం తప్ప కులం అనేది అస్సలు హిందూ సాంప్రదాయమే కాదనే వాక్యంతో అంబేద్కర్ ఆరోపణలన్నింటినీ కొట్టిపడేస్తారు. రెండవది: ఇస్లాం, ముస్లింల మీద కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అంబేద్కర్ చేసిన విమర్శల్ని తమ పవిత్ర యుద్ధానికి అనుకూలంగా వాడుకుంటారు. మూడవది: గాంధీ అంబేద్కర్ల మధ్య సాగిన వివాదాలకు ఎక్కువ ప్రచారం కల్పించి ఎస్సీ, ఎస్టీ, బీసీలు జాతీయ కాంగ్రెస్‌కు దగ్గర కాకుండా చూసేందుకు వాడతారు. నాలుగవది: కమ్యూనిస్టు పార్టీలను అంబేద్కర్ తన ప్రధాన శత్రువులని భావించేవారని విస్తృతంగా ప్రచారం చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలు మార్క్సిజానికి ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఐదవది: కుల వివక్ష రద్దుకు అంబేద్కర్ చూపిన పరిష్కారాల్ని మెచ్చుకుంటూ ఆయన్ని హిందూ మత సంస్కర్తగా కొనియాడుతారు. అంబేద్కర్ పేరులోనే రాముడు (రాంజీ) ఉన్నాడని ఈ మధ్య ప్రత్యేకంగా పేర్కొంటున్నారు. ఆరవది: రాజ్యాంగం మన దేశానికి అంబేద్కర్ ఇచ్చిన ప్రసాదమని పేర్కొనడమేగాక, తాము ఏది చేసినా రాజ్యాంగానికి విధేయులమై ఉంటున్నామని బుకాయిస్తారు.

ఎంతటి ప్రచార హోరుతో ప్రజల్ని సంఘ్ పరివార్ వశీకరిస్తున్నా సమస్త రంగాల్లో కులవివక్ష అనే కఠిన వాస్తవం బహుజనుల్ని ఎప్పుడో ఒకప్పుడు మెలుకువ వచ్చేలా చేస్తుంది. అప్పుడు వాళ్ల కులగణన జరిపించమని తప్పక అడుగుతారు. పైగా, రాహుల్‌గాంధీ రోజుకు ఒకసారి "జిస్కీ జిత్నీ భాగేదారీ ఉస్కే ఉత్నీ హిస్సేదారి" (ఎవరి జనాభా ఎంతో సంపదలో వారికి అంత) అని నినదిస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల భయంతో బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అందరికన్నా ముందుగా కులగణన చేపట్టారు. వెనుకబడిన తరగతులు 27శాతం, అతి వెనుకబడిన తరగతులు 36శాతం, ఎస్సీలు 20శాతం అని బిహార్ ప్రభుత్వం తేల్చింది. ఇప్పుడు ముంపు నీరు బీజేపీ కాళ్ళ కిందికి వచ్చింది. ఆ పార్టీ నిన్నటివరకూ తాను 'అర్బన్ నక్సలిజం' అని విమర్శించిన స్థానాన్నే ఎంచుకోక తప్పలేదు.

రాజకీయ రంగంతోపాటు సామాజిక, ఆర్థిక రంగాల్లోనూ సమానత్వాన్ని సాధించకపోతే ప్రజలు తిరగబడతారని అంబేద్కర్ సాక్షాత్తూ రాజ్యాంగ సభలోనే హెచ్చరించాడు. రాజకీయాల్లో ఎస్టీ రాష్ట్రపతిని చూసి అడవిలో ఆదివాసులు, బీసీ ప్రధానిని చూసి మైదానాల్లో బీసీలు సంతృప్తి పడిపోరు. వాళ్ళకు సాంఘిక, ఆర్థిక సమానత్వం కావాలి. వాళ్ళను అడవి నక్సలైట్లు, అర్బన్ నక్సలైట్లు అని ఎద్దేవా చేయవచ్చుగానీ అది పరిష్కారం కాదు. పిక్చర్ అభి బాకీ హై!

■ డానీ
సమాజ విశ్లేషకులు

ముస్లిం ప్రగతికి అడ్డుగోడ వక్ఫ్ మాఫియా!

నేను రాసిన 'ముస్లిం సంక్షేమానికే వక్ఫ్ సవరణలు' అనే వ్యాసంలో (ఆంధ్రజ్యోతి: 09.04.2025)– గత 75 ఏండ్లుగా వక్ఫ్ బోర్డు అధీనంలో లక్షలాది ఎకరాల ఆస్తి ఉన్నా అది పేద ముస్లింలు, మహిళల అభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడలేదు అన్న నిజాన్ని వెల్లడించాను. వక్ఫ్ సవరణ వలన వక్ఫ్ బోర్డుకు ఒక జవాబుదారీతనం వస్తుందని వివరించాను. దానికి స్పందనగా ముస్లిం సంఘాల కన్వీనర్ సలీమ్ పాషా 'వక్ఫ్‌పై వాట్సాప్ వర్సిటీ పరిజ్ఞానం' అంటూ వక్ఫ్ మాఫియాకు వంత పాడారు (ఆంధ్రజ్యోతి: 24.04.2025).

వక్ఫ్ బోర్డు దగ్గర ఉన్న భూమి 9.4 లక్షల ఎకరాలే. కానీ అది కాక కాంగ్రెస్ తెచ్చిన 2013 వక్ఫ్ సవరణలు అడ్డం పెట్టుకొని 36 లక్షల ఎకరాలు వివిధ రాష్ట్రాలలో మాదే అని లిటిగేషన్ పెట్టిన అంశం సాక్షాత్తు హోమ్ మినిస్టర్ అమిత్ షా పార్లమెంటులో చెప్పారు. ఆ సందర్భంలో ముస్లింలకు మంచి చేసే సవరణలకు వ్యతిరేకంగా ఓటు వేసిన 232 ఎంపీలు ఎందుకు ప్రశ్నించ లేదు? పార్లమెంటులో ఇది నిజం కాదు అని ఎందుకు చెప్పలేదు? అమిత్ షా రాష్ట్రాలు, కొన్ని ఊర్ల పేర్లతో సహా ప్రస్తావించారు కదా?

గతంలో లాలూ ప్రసాద్ యాదవ్ కూడా నిండు సభలో వక్ఫ్ మాఫియా గురించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2013 రాజ్యాంగ వ్యతిరేక అధికారాలు వక్ఫ్ బోర్డుకు కట్టబెట్టిన తరువాత వక్ఫ్ ఆస్తులు 2,07,394 (2013) నుండి 8,72,870 (2024) పెరిగాయి, అలానే 18.3 లక్షల ఎకరాలు (2013) నుండి 39 లక్షల ఎకరాలకు పెరిగాయి. అలానే 2013లో ఢిల్లీ వక్ఫ్ బోర్డుకు 9 ఆస్తులు, 0.03 ఎకరాలు ఉంటే; 2025 నాటికి అవి 1047 ఆస్తులు, 29 ఎకరాలకు పెరిగాయి. ఔరంగజేబు చేయలేని పని కాంగ్రెస్ చేసింది. ఇది సాక్షాత్తు సుప్రీంకోర్ట్ అఫిడవిట్‌లో కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన నగ్నసత్యం.



> వక్ఫ్ చట్టంలోని పలు సెక్షన్ల ద్వారా 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు భారతదేశంలో ఏ సంస్థకూ లేని అపరిమిత అధికారాలు కట్టబెట్టింది. ఇంగ్లీష్‌లో ఒక సామెత ఉంది 'అధికారం అవినీతికి దారితీస్తుంది, అపరిమితమైన అధికారం అత్యంత అవినీతికి దారితీస్తుంది' అని. ఈ చట్టాలే వక్ఫ్ బోర్డు మహా అవినీతికి దారితీశాయి.

కాంగ్రెస్ తెచ్చిన 2013 సవరణలు (వక్ఫ్ 1995 ఆక్ట్) సెక్షన్ 40 ప్రకారం, వక్ఫ్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆర్డర్ ఫైనల్. వక్ఫ్ ఆక్ట్ సెక్షన్ 83(7) స్పష్టంగా వక్ఫ్ ట్రిబ్యునల్ ఆర్డర్ ఫైనల్ అని చెబుతుంది. దాన్ని ఏ ఇతర కోర్టు విశ్లేషించే అధికారం లేకుండా కాంగ్రెస్ పార్టీ ఈ చట్టాన్ని తెచ్చింది. ఇది నిజం కాకుంటే, 2025 సవరణలో వక్ఫ్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా తొంభై రోజులలో హైకోర్టును ఆశ్రయించవచ్చు అనే అంశం మీద మీకు అభ్యంతరం ఎందుకు? కోర్టులు పార్లమెంట్ చేసిన చట్టాలనే సమీక్షించగలిగిన అధికారాన్ని కలిగి ఉండగా, కేవలం వక్ఫ్ ట్రిబ్యునల్‌కు ఆ ప్రత్యేకత కాంగ్రెస్ ఎందుకు కల్పించింది? రాజకీయ మెప్పు కోసమే కదా?

1995 సెక్షన్ 14: పాత చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డులో కేవలం సున్నీ, షియాలు ఉండాలని సూచన ఉంది కానీ నిర్దిష్టమైన నిబంధన లేదు. ఇక అఘకాని, బోర, ఇస్మాయిలి, అహ్మదీయ.. ఇతర వర్గాలకు అవకాశం లేదు. అతి ముఖ్యం పసమందా (ఓబీసీ) ముస్లిమ్స్, అత్యధికంగా 80శాతం ఉండే వర్గాలకు అవకాశమే లేదు. కానీ 2025 చట్టం మహిళలతో పాటు, ఈ వర్గాలకు కూడా నిర్దిష్టమైన రిజర్వేషన్ కల్పిస్తుంది. ఇలా ప్రాతినిధ్యం కల్పించటం గురించి 'ముస్లింలను విభజిస్తున్నారు' అనే ఆరోపణ చేయటం ముస్లిం ఉన్నత వర్గాల ఆధిపత్య ధోరణికి నిదర్శనం. ఒక్కసారి కళ్ళకు కట్టిన మతపరమైన గంతలు విప్పి చూస్తే– కేవలం భారతదేశంలోనే అన్ని వర్గాల ముస్లింలూ శాంతితో ఉన్నారు. తక్కిన ముస్లిం దేశాలన్నింటిలోనూ వేర్వేరు వర్గాల మధ్య నిత్య ఘర్షణలే! కేవలం భారత్‌లో మాత్రమే, అది కూడా హిందూ మెజారిటీ ఉంది కనుక, అన్ని వర్గాలకు ప్రశాంతత, భద్రత ఉంది. అబ్దుల్ కలాంను రాష్ట్రపతి చేసింది, షానవాజ్ హుస్సేన్, ఎంజే అక్బర్, నజ్మా హెప్తుల్లా వీళ్ళని మంత్రులను చేసింది బీజేపీ. ఎన్నికలలో ముస్లిమ్స్ బీజేపీని ఒక విరోధి పార్టీగా చూసినా మోదీ సబ్ కా సాథ్ – సాబ్ కా వికాస్ అనే స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నారు.

ఇక వక్ఫ్ 1995 చట్టంలోని సెక్షన్స్ 107, 108, 108ఏ, 108బిలను తొలగించటం విషయానికి వద్దాం. ఈ సెక్షన్స్ ద్వారా 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు భారతదేశంలో ఏ సంస్థకూ లేని అపరిమిత అధికారాలు కట్టబెట్టింది. ఇంగ్లీష్‌లో ఒక సామెత ఉంది 'అధికారం అవినీతికి దారి తీస్తుంది, అపరిమితమైన అధికారం అత్యంత అవినీతికి దారి తీస్తుంది' అని. ఈ చట్టాలే వక్ఫ్ బోర్డు మహా అవినీతికి దారి తీశాయి. సెక్షన్ 107– భారతదేశంలోని ఏ చట్టం కూడా ఈ చట్టం ముందు తక్కువే. సెక్షన్ 108 ప్రకారం కేంద్రం వక్ఫ్ బోర్డులకు ఎలాంటి అధికారాలు అయినా ఇవ్వవచ్చు. 108ఏ ప్రకారం 'వక్ఫ్ బోర్డు పాలనా ప్రాపర్టీ' అని తమ రిజిస్టర్లో ఎక్కిస్తే చాలు (అది ప్రభుత్వ ప్రాపర్టీ, ప్రైవేట్ ప్రాపర్టీ, షెడ్యూల్ ఏరియా ప్రాపర్టీ ఏదైనా సరే), అది తేలేవరకు అమ్మలేరు లేదా కొనలేరు. 108బి భారతదేశంలో ఏ కోర్టు వక్ఫ్ బోర్డు చర్యలకు అడ్డు వెళ్లకుండా నిరోధిస్తుంది. ఈ సెక్షన్స్ అన్నీ రాజ్యాంగ విరుద్ధమే!

ముస్లిమ్స్ సోదర సోదరీమణులకు మనవి– ఈ వక్ఫ్ మాఫియా చేసే అబద్ధ ప్రచారాన్ని నమ్మకండి. 75 ఏండ్లుగా మీకు దక్కింది ఏమీ లేదు. ఈ చట్ట సవరణ వలన, ముఖ్యంగా ముస్లిం యువత ప్రగతిపథంలో నడుస్తుంది. ముందు దేశం, తర్వాతే మతం అనే భావన పెరుగుతుంది. దేవుడు ఒక్కడే, లోకంలో వివిధ పేర్లతో పిలుస్తారు అనే సత్యాన్ని గ్రహించి 'సర్వే జనా సుఖినో భవంతు' అనే స్ఫూర్తితో మనం ముందుకు నడవాలి.

● డాక్టర్ బూర నర్సయ్యగౌడ్
భోనగిరి మాజీ ఎంపీ

కాంట్రాక్ట్ అధ్యాపకుల డిమాండ్ అక్రమం!

ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు వాళ్ళని రెగ్యులరైజ్ చేయాలని ఆందోళన చేపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దీనిపై చర్చ జరుగుతోంది. యూనివర్సిటీలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ విధివిధానాలకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేసిన నాటి నుంచి ఈ ఆందోళనలు మొదలయ్యాయి. అయితే ఇది ఒక అశాస్త్రీయమైన, అప్రజాస్వామికమైన డిమాండ్.

ప్రభుత్వరంగ సంస్థలలో లేదా విశ్వవిద్యాలయంలో ఉద్యోగులను నియమించడానికి ఒక ప్రక్రియ ఉంటుంది. నైపుణ్యం కలిగిన అర్హులైన వారిని ఉద్యోగులుగా నియమిస్తారు. విశ్వవిద్యాలయాల్లో నోటిఫికేషన్ లేకుండా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా, రోస్టర్ విధానం అమలు చేయకుండా, కాంట్రాక్ట్ అధ్యాపకులు నియమాకాల్లోకి వచ్చారు. ఇలాంటి చర్యలు రాజ్యాంగ విరుద్ధం. రిజర్వేషన్లను పాటించకుండా జరిగిన ఇటువంటి నియామక ప్రక్రియ ద్వారా ఉద్యోగాల్లోకి వచ్చిన కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులరైజ్ చేయమని డిమాండ్ చేయడం అన్యాయం. అదేవిధంగా ఈ మధ్యకాలంలో ఒప్పంద అధ్యాపకులు కోఠి మహిళా యూనివర్సిటీలో, మంథనిలో ధర్నా నిర్వహిస్తూ ఈ సమస్య గురించి తెలియని విద్యార్థుల చేత రెగ్యులరైజేషన్ డిమాండ్‌ను పలికించారు. తరగతులు బహిష్కరిస్తూ రోడ్ల మీద కూర్చోబెట్టారు. ఆ సమస్యలో ఉన్న రాజ్యాంగేతర డిమాండ్ల గురించి తెలియని అమాయకమైన విద్యార్థులను ఆందోళనలో భాగం చేయడం సమర్థనీయం కాదు.

గతంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు ఎలాంటి నియామక ప్రక్రియా లేకుండా ఉద్యోగాల్లోకి వచ్చారు. వారు రెగ్యులరైజేషన్ అడగడం ఒక సమస్య అయితే, శాస్త్రీయ విద్యావిధానం కోసం పనిచేస్తున్న ప్రగతిశీల వాదులు ఈ ఆందోళనలకు మద్దతు తెలపడం ఆశ్చర్యం. శాస్త్రీయ విద్యావిధానం కోసం పోరాడేవారు దానికి విఘాతం కలిగించే చర్యలను ఖచ్చితంగా అడ్డుకుంటారు. విద్యారంగంలో నైపుణ్యానికి పెద్ద పీట ఉంటుంది కానీ, అనుభవానికి కాదు అనే విషయం గుర్తుంచుకోవాలి. ప్రపంచ అవసరాలకు తగిన నైపుణ్యాలు సంపాదిస్తున్న నేటి తరంలో నైపుణ్యాల ప్రతిపాదికన కాకుండా కేవలం అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోమని అడగడం బాధాకరం. దశాబ్ద కాలంగా రాష్ట్రంలోని యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 292 పోస్టులను భర్తీ చేస్తామని చెప్పింది. ఇంకా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో 1200 పైచిలుకు అధ్యాపక నియామకాలు చేయాల్సి ఉంది. అయితే 1100కు పైగా ఉన్న కాంట్రాక్టు అధ్యాపకులు 292 పోస్టుల్లో వాళ్ళని రెగ్యులరైజేషన్ చేయమని అనడం వాళ్ళ డిమాండ్‌లో ఉన్న సంక్లిష్టతను, అస్పష్టతను తెలియజేస్తుంది. డిగ్రీలు, పీజీలు ఉన్నతమైన మార్కులతో పాసై పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులు 10 సంవత్సరాలుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం వేచి చూస్తున్న తరుణంలో ఒప్పంద అధ్యాపకుల ఆందోళనలు వీరి ఆశలను తుంచే విధంగా ఉన్నాయి.


కాంట్రాక్టు అధ్యాపకులు దశాబ్దకాలం పైగా ప్రభుత్వ విద్యా రంగంలో పనిచేస్తున్నారు. కాబట్టి వారికి రాబోయే యూనివర్సిటీ నియామకాలలో అన్యాయం జరగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దాని కోసం అప్రజాస్వామికమైన రెగ్యులరైజేషన్ కాకుండా, నియామక ప్రక్రియలో వెయిటేజ్ ఇవ్వాలి. అదే విధంగా సమాన పనికి సమాన వేతనాన్ని అందజేయాలి. ఆరోగ్య భద్రత కల్పించి వారిని ఆదుకోవాలి. ఒప్పంద ఉద్యోగులు భారత రాజ్యాంగ విలువలకు లోబడి ప్రజాస్వామ్య యుతమైన, న్యాయమైన డిమాండ్లతో ఉద్యమాలను చేపట్టాలి

○ అల్లూరి విజయ్
PDSU (విజృంభణ), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ

'పది' పరీక్షలపై పునరాలోచించాలి

'ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇంటిని తగలబెట్టుకోలేం కదా!?' అచ్చం అలాగే ఉంది! పదోతరగతి పరీక్షా విధానం మార్పు పట్ల తెలంగాణ విద్యాశాఖ అధికారుల వైఖరి. ప్రైవేటు విద్యాసంస్థలు 20శాతం మార్కులు సంపూర్ణంగా వేసుకుంటున్నారనే ఆరోపణతో మొత్తం పరీక్షా విధానం ర్యాంకుల నుంచి మార్కుల వైపు మళ్ళించడం పూర్తిగా చట్టవిరుద్ధం. ప్రైవేటు విద్యా వ్యవస్థపై అదుపు పేరుతో వారి దోపిడిని మరింత పెంచే మార్పు ఇది.

ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు మార్కుల పేరుతో పిల్లలను భౌతికంగా, మానసికంగా హింసిస్తున్నారు. చదువులను 'భట్టీయం'గా మారుస్తున్నారు కాబట్టి, ఇది మారాలని కోరిన మీదట, విద్యాహక్కు చట్టం–2009 అమలులోకి వచ్చింది. అందుకనుగుణంగా 6–9 తరగతుల పరీక్షా విధానం విద్యా హక్కు చట్టం సెక్షన్ 19(1)హెచ్ నిబంధనలు సూచించిన విధంగా 'నిరంతర సమగ్ర మూల్యాంకనం'(సీసీఈ) పద్ధతిలో మార్పు జరిగింది. దీనిప్రకారం ఒక సబ్జెక్టులో ఏడాది కాలాన్ని నాలుగు భాగాలుగా విభజించి నిర్మాణాత్మక మూల్యాంకనం (యఫ్‌ఏ–1, యఫ్‌ఏ–2, యఫ్‌ఏ–3, యఫ్‌ఏ–4) జరుపుతారు. ఇది రొటిన్ పరీక్షా విధానానికి భిన్నం. ఫార్మెటివ్ అసెస్‌మెంట్‌లో విద్యార్థుల 1) రాతాంశం 2) పఠనాంశం 3) ప్రాజెక్టు వర్క్ (పాఠశాల బయట విద్యార్థి పాఠ్యాంశానికి అనుగుణంగా చేసే యాక్టివిటీ) 4) స్లిప్ టెస్టు (పాఠ్యాంశం తర్వాత ఫీడ్ బ్యాక్ టెస్టు) ఈ నాలుగు అంశాల పరిశీలన మీదట ఉపాధ్యాయులు ఒక్కో అంశానికి ఐదు మార్కుల చొప్పున మొత్తం 20 మార్కులు ఇస్తారు. నాలుగు ఫార్మెటివ్ అసెస్‌మెంట్ సగటు తీసి ఇరవై మార్కులు గరిష్ఠంగా ఏడాది పరీక్షలో కలుపుతారు.



ఇక రెండో అంశం ఏమంటే సంగ్రహనాత్మక మూల్యాంకనం (యస్‌ఏ–1, యస్‌ఏ–2) ఇది సబ్జెక్టును రెండు భాగాలుగా విభజించి 40+40 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇది ఆయా సబ్జెక్టుల్లో పాఠ్యాంశం సామర్థ్యాలు విద్యార్థులకు ఎంతవరకు అందాయో పరిశీలన చేసే కీలక పరీక్ష. ఇది విద్యార్థి నేర్చుకున్న అభ్యసనానుభవాలను, సామర్థ్యాలను పరీక్షిస్తుంది. దీనిని 2010 నుంచి 6–9 తరగతులకు అమలుపరుస్తూ, 2014లో పదోతరగతిలో కూడా అమలుపరిచారు.

వాస్తవంగా పాఠశాలలో 'నిరంతర సమగ్ర మూల్యాంకనం' జరిపి ర్యాంకులతో కూడిన తుది సర్టిఫికెట్‌ను ఎస్సెస్సీ బోర్డు జారీ చేస్తే సరిపోతుంది. కానీ, తమ సంప్రదాయిక పరీక్షా విధానం వదులుకోవడానికి ఇష్టపడని బోర్డు విద్యా హక్కు చట్టం సూచించిన 'నిరంతర సమగ్ర మూల్యాంకనం' ప్రక్రియలోనే యస్‌ఏ–1, యస్‌ఏ–2 కలిపి 80మార్కులు వార్షిక పరీక్షగా నిర్వహించి, సబ్జెక్టు ఉపాధ్యాయులు ఇచ్చే 20మార్కుల గరిష్ఠ సగటును కలుపుతోంది. మార్కులకు బదులు ఎస్సెస్సీ బోర్డు ర్యాంకులతో సర్టిఫికెట్లు జారీచేసింది. అయితే 20శాతం ఫార్మెటివ్ అసెస్‌మెంట్ మార్కుల రికార్డులు విద్యాశాఖ పర్యవేక్షించాలి. కానీ, సిబ్బంది లేక తూతూ మంత్రంగా నిర్వహిస్తుండడంతో ప్రైవేటు విద్యా సంస్థల మధ్య ఉన్న పోటీ మూలంగా పదికి పది ర్యాంకులు పేరుతో 20కి 20మార్కులు వేసి బోర్డుకు పంపుతున్నారు. ఇక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు నిజాయితీగా యథాతథంగా విద్యార్థుల మార్కులు పంపుతున్నారు. ఈ అంతరం పూడ్చడం కోసమని, పర్యవేక్షణ చేయలేని విద్యాశాఖ తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు పదో తరగతిలో ర్యాంకులు రద్దుచేసి మళ్ళీ పాత పద్ధతిలో 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపి ఒప్పించింది. దీని వల్ల అనేక రకాల వివాదాలు రానున్నాయి.

ప్రాథమికంగా ఇది విద్యాహక్కు చట్టం సూచించిన 'నిరంతర సమగ్ర మూల్యాంకనం' కాన్సెప్ట్‌కు సెక్షన్ 19(1)హెచ్ నిబంధనకు పూర్తి విరుద్ధ నిర్ణయం? అనేక ఏళ్ళుగా రొటీన్ పరీక్షా విధానంలో మార్పు కోరుతూ వచ్చిన మనం, నూతన మార్పులు జీర్ణించుకోలేక, తిరిగి అశాస్త్రీయ పరీక్షా విధానం వైపు మొగ్గినట్లు అవుతుంది. తొమ్మిదవ తరగతి వరకు అనుసరించిన బోధనా విధానం, పరీక్షా విధానానికి భిన్నంగా పదవ తరగతి పరీక్ష నిర్వహించడం అవుతుంది. ఫార్మెటివ్ అసెస్మెంట్‌కు కనీస భాగస్వామ్యం లేకుండా పోతుంది? అంతేకాదు! ర్యాంకులకు బదులు మార్కులు ప్రకటించడం వల్ల తిరిగి ప్రైవేటు విద్యావ్యవస్థలో నూటికి నూరు మార్కులతో పరీక్ష వ్యాపారమయం అవుతుంది. ప్రైవేటు విద్యా సంస్థలు మధ్య అనారోగ్యకర పోటీకి దారితీస్తుంది. వీటన్నింటికంటే ఎక్కువగా ఒత్తిడి లేని సమగ్ర నిరంతర మూల్యాంకనాన్ని తిరస్కరించినట్లు అవుతుంది. ఇన్ని రకాల అడ్డంకులు అధిగమించి ఈ పది పరీక్ష జరపడం ద్వారా అదనంగా విద్యార్థులకు లభించే ప్రయోజనం ఏమీలేదు?

రాష్ట్ర ప్రభుత్వం పది పరీక్షలపై పునరాలోచన జరపాలి. ఆర్భాటంగా ఒక తప్పుడు విధానం అమలుకు అవకాశం ఇవ్వడానికి బదులు తెలంగాణలోని విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాల అభిప్రాయాలు తీసుకొని పరీక్షా విధానాన్ని సంస్కరించాలి. విద్యాశాఖా మంత్రి కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కనుక, ప్రజాస్వామ్య పద్ధతిలో పది పరీక్షా విధానంపై చర్చించి నిర్ణయం తీసుకోవాలి.

◆ ఎన్. తిర్మల్
సీనియర్ జర్నలిస్టు

85 ఏళ్లు దాటిన వారికి రాని ఏప్రిల్ పెన్షన్!

తెలంగాణా రాష్ట్రవ్యాప్తంగా 85 సంవత్సరాలు పైబడిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు దాదాపు రెండువేల మందికి ఏప్రిల్ నెల పెన్షన్లు ఇంకా అందలేదు. పెన్షన్ అందని వాళ్ళు తమ పెన్షన్ పేమెంట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి వివరాలు చెప్పాలని కొందరు అంటున్నారు. కానీ దానిలో ఏ మాత్రం పొరపాటు జరిగినా ఆ వివరాలు మన డబ్బులను దొంగిలించే వారి(ఫ్రాడ్‌స్టర్ల) చేతిలో పడతాయేమో అని పెన్షనర్లు భయపడుతున్నారు. అందువల్ల పూర్వ పద్ధతిలోనే 85 సంవత్సరాల వయసు పైబడిన వారికి కూడా వాళ్ళ లైఫ్ సర్టిఫికెట్‌ను ఆమోదించి, లేదా కదల లేని స్థితిలో ఉన్న పెన్షనర్ల దగ్గరికి న్యాయస్థానాలు చెప్పినట్టుగా అధికారులు తమ సిబ్బందిని పంపించి ప్రత్యక్షంగా వెరిఫై చేయించి వారి పెన్షన్లను రిలీజ్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.


– మోతుకూరు నరహరి
రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ & రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

సుందరీమణులకు భద్రత సాధ్యమేనా?!

ఈ నెల 14న ఓరుగల్లుకు అందాలభామల రాక

- పాకిస్థాన్‌తో యుద్ధం, ఆపరేషన్ కగార్‌తో సందిగ్ధ స్థితి
- మూడంచెల భద్రత ఏర్పాటు చేసిన పోలీసులు
- 2వేల మంది సిబ్బందితో భారీ భద్రత ఏర్పాట్లు
- పోలీసులకు సవాల్‌గా మావోయిస్టుల ఏరివేత, సరస్వతీ పుష్కరాలు
- ఓరుగల్లు వైభవం ప్రపంచానికి చాటేలా ఏర్పాట్లు చేసిన పర్యాటకశాఖ
- ప్రస్తుత పరిస్థితుల్లో అయోమయం



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

మిస్ వరల్డ్‌ పోటీలు జరిగేనా..? ఒకవేళ పోటీలు జరిగినా అందాల భామలు ఓరుగల్లుకు వచ్చేనా..? అనేది ఉత్కంఠగా మారింది. శనివారం నుంచి హైదరాబాద్ కేంద్రంగా విఎస్‌వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31వ తేదీ వరకు పోటీలు నిర్వహించే లా షెడ్యూల్ ఖరారైంది. తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేసేందుకు ప్రభుత్వం పోటీలకు వచ్చే ముద్దుగుమ్మలను ఔట్‌డోర్ షెడ్యూల్ ప్లాన్‌చేశారు. ఈనెల 14న ఓరుగల్లులో విఎస్‌వరల్డ్ పోటీదారులు పర్యటించాల్సి ఉంది. ఇందుకోసం పోలీసుశాఖ మూడంచెల భద్రత ఏర్పాట్లను చేసింది. రెండువేల మందికి పైగా పోలీసులతో అందాల భామలకు భద్రత కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే పాకిస్థాన్‌తో యుద్ధం, ఓరుగల్లు సరిహద్దుల్లో మావోయిస్టుల అలజడి నేపథ్యంలో మిస్సమ్మలకు భద్రత ఏర్పాట్లు, 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సరస్వతీ పుష్కరాలకు భద్రత కల్పించటం ఖాకీలకు సవాల్‌గా మారనున్నాయనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.

పర్యాటక ప్రాంతాల ముస్తాబు

అందాల భామల రాక కోసం ఓరుగల్లు చారిత్రక ప్రాంతాలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 14వ తేదీన ఓరుగల్లు అందాలను తిలకించేందుకు 57మందితో కూడిన ముద్దుగుమ్మల బృందాలు రానున్నాయి. 14న మధ్యాహ్నం 2గంటలకు హైదరాబాద్ నుంచి అమెరికా, కెనడాలకు చెందిన 35మంది అందాలభామల బృందం హనుమకొండ హరిత హటల్‌కు చేరుకుంటుంది. ఇదే సమయంలో 22 మంది ఐరోపా అందగత్తెలు యునెస్కో గుర్తింపు పొందిన రామప్పకు వెళ్లనున్నారు. హనుమకొండ హరిత హోటల్‌కు సాయంత్రం 4.30గంటలకు చేరుకుంటారు. ఇక్కడి నుంచి వెయ్యి స్తంభాల గుడిని సందర్శిస్తారు. అనంతరం వరంగల్ కోటకు చేరుకుని కాకతీయుల కళా వైభవాన్ని తిలకిస్తారు. రాష్ట్ర చిహ్నంలో ఉన్న కాకతీయ తోరణంతో పాటు అక్కడ ఉన్న శిల్పా సంపదను పరిశీలిస్తారు. కొద్దిసేపు విద్యార్థినులతో ముచ్చటిస్తారు. రాత్రి 9.30 గంటలకు హరిత హోటల్‌కు చేరుకుని డిన్నర్ అనంతరం హైదరాబాద్‌కు తిరిగి వెళతారు.

అలాగే మరో బృందం రామప్పకు సాయంత్రం 5.30గంటలకు చేరుకుంటారు. రామప్ప శిల్ప వైభవాన్ని తిలకిస్తారు. నీటిలో తేలాడే ఇటుకులతో పాటు శిల్ప సౌందర్యాన్ని పరిశీలిస్తారు. అనతంరం కాకతీయుల కాలంలోనే పురుడు పోసుకున్న పేరిణి నృత్య ప్రదర్శనను తిలకిస్తారు. అనంతరం రామప్ప కాటేజీల్లో ఏర్పాటుచేసిన డిన్నర్‌కు హాజరై రాత్రి 9గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. వీరి పర్యటనను సుమారు 120దేశాలకు ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. దీంతో కాకతీయుల పరిపాలన, కళానైపుణ్యంతో పాటు ఓరుగల్లు చరిత్ర ప్రపంచవ్యాప్తం కానుంది. ఇక ముద్దుగుమ్మల రాకతో రామప్ప, వరంగల్ కోట, వేయిస్తంభాల దేవాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. కాకతీయుల కళావైభవాన్ని తిలకించే ముద్దుగుమ్మలను మంత్రముగ్ధులను చేసేలా జిగేల్ జిగేల్ అనే లైట్లు, సౌండ్స్ తదితర ఏర్పాట్లను అధికారయంత్రాంగం చేస్తోంది. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా ఏర్పాట్లతో పాటు ఓరుగల్లు

మిగతా 7వ పేజీలో...

అందగత్తెలు వచ్చేనా..?

వివిధ దేశాల నుంచి వచ్చే అందాలభామల కోసం ఓరుగల్లు ముస్తాబవుతోంది. పోలీసులు కూడా భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే పాకిస్తాన్‌తో యుద్ధం నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీలు ఉంటాయా? అనేది సందిగ్ధంగా మారింది. పాకిస్తాన్ టార్గెట్ జాబితాలో హైదరాబాద్ నగరం కూడా ఉండటంతో 120దేశాలకు పైగా వస్తున్న సుందరీమణులకు భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవేళ హైదరాబాద్‌లో అందాల పోటీలు జరిగినా.. ఔట్‌డోర్ పర్యటనలు ఉంటాయా? అనేది అనుమానంగా మారింది. ఇటు పాకిస్థాన్‌తో యుద్ధంతో పాటు ఓరుగల్లు సరిహద్దుల్లో మావోయిస్టులతో ఫైరింగ్ నడుస్తోంది. గురువారం ముగ్గురు తెలంగాణ పోలీసులు మందుపాతరలకు బలయ్యారు. మావోయిస్టుల కోసం సరిహద్దుల్లో తెలంగాణ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. వీటితో పాటు 15వ తేదీ నుంచే సరస్వతీ పుష్కరాలు కూడా ప్రారంభం కానున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అందగత్తెలకు భద్రత ఓరుగల్లు పోలీసులకు సవాల్‌గా మారనుంది. ప్రధానంగా పాకిస్థాన్‌తో యుద్ధంతో పాటు అందాల పోటీలను వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, సీపీఐ తదితరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇలాంటి ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో అందాలభామల ఓరుగల్లు పర్యటన ఉంటుందా అనే చర్చ జరుగుతోంది.

పుష్ప రథంపై అమ్మవారు

- పదో రోజుకు చేరిన కల్యాణ బ్రహ్మోత్సవాలు
- ఉభయ దాత సేవా కర్తలుగా గౌడ సంఘం



భద్రకాళి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

వరంగల్ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళి దేవస్థానంలో శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు శుక్రవారం పదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4 గంటలకు నిత్యపూజ, అర్చన, పారాయణం, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. పదో రోజు కల్యాణ బ్రహ్మోత్సవాల సేవా కర్తగా తెలంగాణ గౌడ సంఘం వారు అమ్మవారికి పట్టువస్త్రాలు, పూజ సామగ్రి సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తిని పుష్పరథంపై ఊరేగించారు. దాదాపు 3 వేల మంది భక్తులు హాజరు కాగా అందరికీ అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో పాటు తెలంగాణ గౌడ సంఘం నాయకులు బొనగాని యాదగిరి గౌడ్, బైరి రవికృష్ణ గౌడ్, బత్తిని సుదర్శన్‌గౌడ్, జనగాం శ్రీనివాస్ గౌడ్, బయ్యగోని కుమారస్వామి గౌడ్, కార్పొరేటర్ పోశాల పద్మ గౌడ్, మాజీ ఎంపీటీసీ దూలం నీరజ రాజు గౌడ్, అనంతుల రమేష్‌గౌడ్, కోలా రాజేష్‌గౌడ్, శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో పరిశీలించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- పలు విభాగాల అధికారులతో సమావేశం



డిప్యూటీ కమిషనర్లతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయి పరిశీలనలో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌ల తోపాటు పలు విభాగాల అధికారులతో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలపై సమీక్షించి పథకాల విజయవంతానికి మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అర్హులైన లబ్ధిదారులను ఎంపికచేసి కలెక్టర్‌ల లాగిన్‌లకు అప్‌లోడ్ చేయాలని అన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న రేషన్‌కార్డుల సర్వేలను షురూ చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను స్క్రీనింగ్ చేసి, సిబిల్ స్కోర్ కోసం బ్యాంకులకు పంపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్‌లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, రాజేందర్ పాల్గొన్నారు.

రైతులే బీఆర్‌ఎస్ పార్టీకి పట్టుకొమ్మలు

- సభను విజయవంతం చేసిన ప్రజలకు రుణపడి ఉంటాం
- బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ సభ కోసం తీసుకున్న భూములను చదును చేయిస్తున్న పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఎల్కతుర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి రైతులే పట్టు కొమ్మలని, వారి ఎదుగుదలే పార్టీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో గత నెల 27న నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభాస్థలితోపాటు పార్కింగ్ స్థలాల చదును పనులను ఆయన పరిశీలించారు. పొలాలకు చెందిన ఒడ్డను యథావిధిగా నిర్మించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన భూములను తిరిగి యథావిధిగా చదును చేసి రైతులకు అప్పగిస్తున్నామన్నారు. సభ సమయంలో పడిన చెత్తను కూలీలతో తీసివేయిస్తున్నామన్నారు. 25ఏళ్ల గులాబీ పండుగను జరుపుకునేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి విలువైన భూములను సభ ఏర్పాటు కోసం ఇచ్చినందుకు రుణపడి ఉంటామన్నారు. పార్కింగ్ ప్రదేశాలతో పాటు వాహనాల రాకపోకల కోసం రైతుల పొలాల నుంచి తాత్కాలిక దారులు వేశామని, తిరిగి ఆ భూములను పంట సాగుకు అనుకూలంగా తయారు చేసి ఇస్తామన్నారు.

ఎల్కతుర్తిలో నిర్వహించిన సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ నాయకుల్లో రైళ్లు పరుగెడుతున్నాయని పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రైతులు విసుగుచెందారన్నారు. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తేనే రైతుల బతుకు బాగుపడుతాయనే నమ్మకంతో ఉన్నారన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి సంక్షేమ పథకాలు అందజేసే విధంగా మరో పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ భారీ విజయం సాధించడం ఖయమన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కాషబోయిన రాజ్‌కుమార్, మాచర్ల శరత్, గొల్లె మహేందర్, కడారి రాజు, కోరే రాజ్‌కుమార్ ఉన్నారు.

నాలాల పూడికతీతలో వేగం పెంచండి

- మేయర్ గుండు సుధారాణి
- నగరంలో పూడికతీత పనుల పరిశీలన



శాకరాసికుంటలో డిసిల్టేషన్ పనులు పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : నాలాల పూడికతీతలో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వరంగల్ నగరంలోని బొందివాగు, భద్రకాళి చెరువు ప్రాంతంతో పాటు మ్యూజికల్ గార్డెన్ ప్రాంతాల్లో నాలాల పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. నగరం ముంపునకు గురి కాకుండా ఉండేందుకు ముందస్తుగా వరంగల్ నగరంలోని భద్రకాళి, బొందివాగు, నయీంనగర్, దర్గా కాజీపేట, శాకరాశికుంట, చిన్నవడ్డెపల్లి, శివనగర్, వరంగల్ 12 మోరీలు, అలంకార్, నందీహిల్స్, తిరుమల జంక్షన్‌ల ప్రాంతంలో ఉన్న పెద్ద నాలాలలో డిసిల్టేషన్ పనులు నిబంధనలకు అనుగుణంగా చేయాలని కోరారు. కచ్చానాలాల పూడికతీత, బాక్స్‌డ్రైన్స్‌లను శుభ్రం చేస్తామన్నారు. సుమారు రూ.1కోటితో ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, ఏఈలు ముజామిల్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.


జల్‌హీ అమృత్ లక్ష్యాలను అమలు చేయండి

కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0లో చేపడుతున్న జల్ హీ అమృత్ కార్యక్రమ లక్ష్యాలను అమలు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. కేంద్ర గృహ పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, అస్కీ సంయుక్తాధ్వర్యంలో చేపడుతున్న అంశాలపై ఇంజనీరింగ్, స్మార్ట్ సిటీ అధికారులతో కలిసి శుక్రవారం బల్దియా కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జల్‌హీ అమృత్ రేటింగ్ ప్రకారం వరంగల్ బల్దియాకు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో ఎస్‌టీపీ ద్వారా ప్రతీ రోజు 70 కిలో వాట్స్ పవర్ జనరేట్ చేయడంతోపాటు మురికినీటి శుద్ధీకరణ ప్లాంట్‌లకు ఉపయోగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్, స్మార్ట్‌సిటి పీఎస్‌సీ ఆనంద్ ఓలేటి పాల్గొన్నారు.

2లక్షల 32వేల ఎకరాల్లో సాగు

- పత్తి 78 వేల ఎకరాలు
- వరి 1 లక్షా 46 వేల ఎకరాలు
- మొక్కజొన్న 5నుంచి 6 వేల ఎకరాలు
- నూనె గింజలు 200 ఎకరాలు
- పప్పులు వెయ్యి ఎకరాలు

ఖరీఫ్‌కు ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయ శాఖ



హనుమకొండ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణానికి ప్రణాళికను సిద్ధం చేసి అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. సాగు లెక్కల ఆధారంగా ప్రణాళిక శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సాగు అంచనా సిద్ధం చేశారు.

2లక్షల 32వేల ఎకరాల్లో..

హనుమకొండ జిల్లాలోని పరకాల, ఆత్మకూరు, దామెర, శాయంపేట, కమలాపూర్, నడికూడ, భీమదేవరపల్లి, ఐనవోలు, ధర్మసాగర్, వేలేరు. హనుమకొండ, కాజీపేట, మడికొండ, ఎల్కతుర్తి, హసన్‌పర్తి మండలాల పరిధిలో సాగు విస్తీర్ణంపై అధికారులు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా పత్తి 78 వేల ఎకరాలు, వరి 1లక్షా 46 వేల ఎకరాలు, మక్కజొన్న 5నుంచి 6 వేల ఎకరాలు, నూనె గింజల పంటలు 200ఎకరాలు, ఇతర పప్పు దినుసు పంటలు వెయ్యి ఎకరాల్లో సాగుకు అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు.

గత ఏడాదిలో సాగును బట్టి..

హనమకొండ జిల్లా పరిధిలో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో క్రాప్ బుకింగ్ ద్వారా పంటలను గుర్తించిన అధికారులు.. ఈ ఖరీఫ్‌లో పత్తి వెయ్యి నుంచి 1500 వరకు తగ్గవచ్చని అధికారులు చెబుతున్నారు. వరిసాగు చేసిన రైతులకు సన్నవడ్లకు ప్రభుత్వం క్వింటాల్‌కు బోనస్ రూ.500 ఇవ్వడంతో వరి సాగు పెరుగనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పత్తికి తగ్గిన దిగుబడి

జిల్లాలో గత ఏడాది పత్తిసాగు చేసిన రైతులకు పత్తి దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారు. ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చిందని దీంతో రైతులు పత్తి సాగు చేసిన వారికి అప్పులే మిగిలాయని రైతులు వరి పంటను సాగు చేసేందుకు సిద్ధపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

జూన్ మొదటి వారంలోనే వర్షాలు

జిల్లాలో జూన్ మొదటి వారంలో వర్షాలు కురిస్తే రైతులు సాగుకోసం విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. మరో నెలరోజుల కాల వ్యవధిలో ఇప్పటి నుంచే రైతులు దుక్కులు దున్ని భూములను చదును చేసుకుంటున్నారు. సాగుకు అవసమైన విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉండే విధంగా ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులతోపాటు వ్యాపారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని నకిలీ విత్తనాలు అందిస్తే వ్యాపారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఆయిల్‌పామ్‌కు కొనుగోలు కేంద్రాలు
- హనుమకొండ జిల్లా వ్యాప్తంగా నాలుగు సెంటర్లు ఏర్పాటు
- వేబ్రిడ్జి వేసిన 14 రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు
- ఉమ్మడి జిల్లాలో పంటకు పెరుగుతున్న మద్దతు ధర
6



యాదవరెడ్డిని పరామర్శిస్తున్న హరీష్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్

యాదవరెడ్డికి హరీష్‌రావు పరామర్శ

హనుమకొండ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని మర్రి యాదవరెడ్డి నివాసంలో కుటుంబ సభ్యులను మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు పరామర్శించారు. హరీష్‌రావుతోపాటు మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, బండ శ్రీనివాస్, బీరబెల్లి భరత్ కుమార్ రెడ్డి, బండి రజనీకర్, చింతల యాదగిరి, పులి రజినీకాంత్, జోరిక రమేష్, కంజర్ల మనోజ్, బుద్ధ వెంకన్న, పొలపెల్లి రామ్మూర్తి, సత్యనారాయణ, సంపత్‌రెడ్డి, రమేష్, వీరస్వామి, మోటె చిరంజీవి, రవీందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, కిషన్, ప్రేమ్‌సాగర్‌రావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలకు డిప్యూటీ సీఎంకు ఆహ్వానం



ఉపముఖ్యమంత్రికి ఆహ్వానం అందజేస్తున్న శైలజా రామయ్యర్

మహదేవపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కకు కాళేశ్వరం పుష్కరాలకు రావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

నాంచారమ్మ జాతరకు రావాలని కవితకు ఆహ్వానం

వరంగల్ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజపురంలో జరుగనున్న ఎరుకల నాంచారమ్మ జాతరకు ముఖ్య అతిథిగా రావాలంటూ ఎమ్మెల్సీ కవితకు ఎరుకల సంఘం నాయకులు ఆహ్వానం అందించారు. తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ తదితరులు శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఆమెను కలిసిన వారిలో కుతాడి రవికుమార్, నాగులు, శ్రీరామ్ ఆనంద్, ఓని సదానందం, మానుపాటి రమేష్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీ కవితను ఆహ్వానిస్తున్న ఎరుకల సంఘం నాయకులు

ఉగ్రవాదం నుంచి శాశ్వత విముక్తి కలగాలి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ● ఘనంగా సీపీఐ పట్టణ నాల్గవ మహాసభలు

జనగామ కల్చరల్, మే 9(ఆంధ్రజ్యోతి): దేశానికి ఉగ్రవాదం నుంచి శాశ్వత విముక్తి కలగాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జనగామలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ జనగామ పట్టణ నాల్గవ మహాసభలు జరిగాయి. ఈ సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎర్రజెండాను ఎగురవేసి మాట్లాడారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ను స్వాగతిస్తూ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉగ్రవాదానికి కులం, మతం, దేశం లేదని, పాకిస్తాన్ పాలకులు, ఉగ్రవాదులు ఒకరిపై ఒకరు ఆధార పడి భారత్‌లో నరమేధాన్ని సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మహాసభలలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

మావోయిస్టులను ఏరివేసేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మావోయిస్టులు చర్చలకు వస్తామంటే ఒప్పుకునేది లేదని ఓ కేంద్ర మంత్రి నియంతలా మాట్లాడుడతున్నారు. తెలంగాణ గ్రేహౌండ్స్‌కు చెందిన ముగ్గురు జవాన్లు మృతి చెందడం బాధాకరమని, ఈ దుశ్చర్యను సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కూంబింగ్ పేరుతో కర్రెగుట్టలను చుట్టుముట్టి 22 మందిని ఎన్‌కౌంటర్ పేరుతో చంపివేయడం సరికాదన్నారు.

కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్య దర్శి సీహెచ్.రాజారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయకార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, నాయకులు చొప్పరి సోమయ్య, మోతె శ్రీశైలం, చామకూర యాకూబ్, కేమిడి మల్లయ్య, గుగులోతు సఖి, బాణాల వెంకన్న, పుప్పాల అయిలయ్య, జాయ నాగేశ్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న దేవాదాయ శాఖ ఏసీ సునీత

నేడు భారత సైనికుల విజయాన్ని కోరుతూ పూజలు

హనుమకొండ కల్చరల్ మే 9(ఆంధ్రజ్యోతి): అపరేషన్ సిందూర్‌లో ధైర్యంగా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా నేడు తెలంగాణలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు గంగు మణికంఠశర్మ, ప్రణబ్, శ్రవణ్‌కుమార్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ రామల సునీత పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారతీయ సైనిక దళాలకు పూర్తి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం అన్ని ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఇందులో భాగంగా రుద్రేశ్వర ఆలయంలో పంచముఖ అంజనేయ స్వామికి అభిషేకం నిర్వహించి అర్చన నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాలోని కొత్తకొండ, మెట్టుగుట్ట, ఐనవోలు ఆలయాలతో పాటు వరంగల్ జిల్లాలోని అన్ని దేవాదాయశాఖ అధీనంలో పూజలు నిర్వహింపజేసినట్లు తెలిపారు. ఆలయ ఈవో అనిల్‌కుమార్ అర్చక సమాఖ్య వరంగల్ నగర శాఖ అధ్యక్షుడు తనుగుల అనిల్‌కుమార్, వేయిస్తంభాల ఆలయ సిబ్బంది మధుకర్, సుధాకర్‌రావు, రజిత, భక్తులు పూజాధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో 30 ఆలయాల్లో భారత సైనికుల క్షేమాన్ని కాంక్షిస్తూ పూజలు నిర్వహించారు.

కాళేశ్వరంపై పోలీసుల డేగ కన్ను

కర్రెగుట్ట కాల్పుల నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు



కాళేశ్వరంలో పోలీసుల తనిఖీలు

మహదేవపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): వాజేడు మండల శివారు కర్రెగుట్ట అడవుల్లో మావోయిస్టులు, పోలీసుల మధ్య కాల్పులు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేకంగా కాళేశ్వరం వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అంతేగాకుండా ఈ నెల 15 నుంచి పుష్కరాలు ప్రారంభం కానున్నందున.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తుండడంతో ఇంటలిజెన్స్ అధికారులు నిఘా పెట్టారు.. ప్రతీ ఒక అంశంపై ఆరా తీస్తున్నారు. కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెనపై ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాన్ని పోలీసులు జల్లెడ పడుతున్నారు. కాళేశ్వరం పుష్కరాలకు పెద్ద ఎత్తున వీఐపీలు రానున్నందున ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఇంటెలిజెన్స్ విభాగం ఈ ప్రాంతంపై ప్రత్యేక నజర్ పెట్టింది.

గిరిజన గురుకుల కళాశాలల్లో ప్రవేశాలు

దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ, మే 9 (ఆంధ్రజ్యోతి) : 2025-26 విద్యా సంవత్సరానికి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలురు, బాలికలు)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ (గురుకుల) వరంగల్, ఖమ్మం రీజనల్ కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్ డీఎస్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు) హనుమకొండలో ఎంపీసీ, బీపీసీ, పాలకుర్తిలోని బాలికల కళాశాలలో ఎంపీసీ, బీపీసీ, పర్వతగిరి బాలికల కళాశాలలో ఎంపీసీ, బీపీసీ, మూడుచెక్కలపల్లి బాలికల కళాశాలలో ఎంపీసీ, బీపీసీ, నర్సంపేట బాలుర కళాశాలలో ఎంపీసీ, బీపీసీ గ్రూప్‌లలో సీట్లకు గాను గిరిజన, గిరిజనేతర బాల, బాలికల నుంచి స్పాట్ కౌన్సెలింగ్ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు వెంకన్న తెలిపారు ప్రవేశం పొందగోరు బాలబాలికలు ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాల (బాలురు) యాకుత్‌పుర, వరంగల్‌లో ఈనెల 15న కౌన్సెలింగ్‌కు పదో తరగతి ఉత్తీర్ణులైన బాల బాలికలు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ తీసుకొని రావాలని తెలిపారు. మిగతా వివరాలకు 9490957296 ఫోన్‌లో సంప్రదించవచ్చునని అన్నారు.

నేడు టీజీఆర్జేసీ పరీక్ష

● ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 32 కేంద్రాలు
● హాజరు కానున్న 7,564 మంది విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించే టీజీఆర్జేసీ ప్రవేశ పరీక్ష శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రవేశ పరీక్షల ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కె.ఇందుమతి ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో సీఎస్, డీవోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇందుమతి మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 32 పరీక్ష కేంద్రాలను అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,564 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు.


కాగా, హనుమకొండలోని కిషన్‌పుర చైతన్య హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం అని హాల్‌టికెట్లు జారీ అయిన విద్యార్థులు.. హనుమకొండలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సెంటర్‌కు మార్చారని, దీనిని గమనించాలని ఆమె కోరారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

కేయూ ఎన్ఎస్ఎస్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఆట్ల రాజు



స్టేషన్‌ఘన్‌పూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ అడ్వైజరీ కమిటీ 2025 సభ్యుడిగా మండలంలోని నెమలిగొండ గ్రామానికి చెందిన అట్ల రాజు ఎంపికయ్యారు. ఈ మేరకు కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం అడ్వైజరీ కమిటీని ప్రకటించారు. కమిటీలో యూనివర్సిటీ లా కాలేజీలో విద్యను అభ్యసిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా సేవలు అందించిన అట్ల రాజు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గతంలో ఎన్ఎస్ఎస్‌లో, రాష్ట్ర, జిల్లా, కళాశాల, యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ వలంటరీగా అవార్డులు అందుకోవడం జరిగిందన్నారు. తాను చేసిన సేవలను గురించిన వైస్ చాన్స్‌లర్ తనను అడ్వైజరీ సభ్యుడిగా ఎంపిక చేయడం గర్వంగా ఉందన్నారు. తనను ఎంపిక చేసిన అధికారులందరికీ రుణపడి ఉంటానని తెలిపారు. కేయూ ఎన్ఎస్ఎస్ అడ్వైజరీ సభ్యుడిగా రాజు ఎంపిక కావడంతో హర్షం వ్యక్తం చేశారు.

నిట్ బీవోజీ చైర్‌పర్సన్‌గా మోహన్‌రెడ్డి



హనుమకొండ, మే 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎన్ఐటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్‌గా పద్మశ్రీ బీవీఆర్ మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరునెలల కాలానికి లేదా కొత్త చైర్‌పర్సన్ నియామకం అయ్యే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. సయోంట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త అయిన డాక్టర్ మోహన్‌రెడ్డి అనేక దశాబ్దాల నాయకత్వ అనుభవం ఉన్న, లోతైన పారిశ్రామిక జ్ఞానం కలిగిన, భారతదేశంలో సాంకేతిక విద్యాపురోగతికి బలమైన పునాదులు వేసిన వ్యక్తి. ప్రస్తుతం ఆయన ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ బోర్డులకు కూడా చైర్‌పర్సన్‌గా సేవలందిస్తున్నారు. భారత ఇంజనీరింగ్, ఐటీ సేవల రంగంలో విశిష్టమైన సేవలందించిన డాక్టర్ రెడ్డి గతంలో నాస్కామ్ చైర్మన్ కూడా పనిచేశారు. భారత సాంకేతికత, సేవారంగాలను ప్రపంచ వేదికపైకి తీసుకువెళ్లే విధానాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. వ్యాపారం, పరిశ్రమల రంగంలో చేసిన అత్యుత్తమ సేవలకుగాను ఆయనను భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. కాగా, వరంగల్ ఎన్ఐటీ బీవోజీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ మోహన్‌రెడ్డి నియమితులు కావడంపై నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో డాక్టర్ బీవీఆర్ రెడ్డి నిట్ వరంగల్‌కు మార్గనిర్దేశం చేయడం తమకు ఎంతో గొప్ప గౌరవం అన్నారు. ఆయన నాయకత్వంలో సంస్థ విద్య, పరిశోధన, పారిశ్రామిక సహకారం మరింత బలోపేతం కాగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రపంచస్థాయి సాంకేతిక విద్య, పరిశోధనలో నిట్ కేంద్రంగా మారే దిశగా ఆయన మార్గదర్శనం ఎంతో అవసరమన్నారు.

యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి

మరిపెడ, మే 9 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన మౌంటెనర్ భూక్యా యశ్వంత్ ఖాతాలోకి మరో పర్వతశ్రేణి చేరింది. శుక్రవారం యశ్వంత్ మిజోరం రాష్ట్రంలోని ఎత్తైన పర్వతాన్ని అధిరోహించారు. ఇప్పటికే భారత్‌లోని ఐదు పర్వతాలు, అంతర్జాతీయ స్థాయిలో కిలిమంజారో, ఎల్బ్రోస్, కాసియూజ్కో, యానం, ఖాంగ్‌యాస్టో, ఎవరెస్టబేస్ పర్వతాలను జయించారు. యశ్వంత్‌ను పలువురు ప్రశంసిస్తున్నారు.



మిజోరంలో పర్వతరోహణ పూర్తి చేసిన యశ్వంత్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు ● మరిపెడ మండలంలో ఘటన ● ఓవర్ స్పీడ్‌తోనే ప్రమాద ఘటన



రోడ్డు ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిన యువకుడి మృతదేహం



కార్తీక్ (ఫైల్)



సంతోష్ (ఫైల్)

మరిపెడ, మే 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి తరువాత మరిపెడ విలేజీ క్రాస్ దగ్గర ఎన్‌హెచ్ 365పై చోటుచేసుకుంది. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఓవర్ స్పీడే ఈ ప్రమాద ఘటనకు కారాణమని తెలుస్తోంది. కుటుంబ సభ్యులు, మరిపెడ పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. మరిపెడ మండలం బాబోజిగూడెం జీపీ పరిధి వెంకురాంతండాకు చెందిన భూక్యా సంతోష్ (22), బోజ్యతండా చెందిన గుగులోత్ కార్తీక్ (21), వాగువొడ్డుతండాకు చెందిన అజ్మీరా సుధీర్‌లు అదే రాత్రి మరిపెడ బంగ్లాకు రెండు ఎన్ఎస్ 200 సీసీ పల్సర్ బైక్‌లపై వేర్వేరుగా ఓవర్ స్పీడ్‌తో వస్తున్నారు. ఓ బైక్‌పై సంతోష్, కార్తీక్ ఉండగా, మరో బైక్ ను సుధీర్ నడుపుతున్నారు. సుధీర్ నడిపే బైక్ సంతోష్, కార్తీక్‌లు ప్రయాణిస్తున్న బైక్ ను మరిపెడ విలేజీకి వెళ్లే క్రాస్ రోడ్డు దగ్గర బలంగా ఢీకొట్టింది. దీంతో కార్తీక్, సంతోష్‌లు కిందపడి తీవ్ర గాయాలకు గురై అక్కడికి అక్కడే మృతిచెందారు. సుధీర్‌కు సైతం గాయాలకు గురి కాగా, చికిత్స కోసం పోలీసులు 108 వాహనం ద్వారా మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చేతికి అందివచ్చిన ఆ యువకుల అకాల మృతితో వారి తల్లితండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు మరిపెడ ఇన్‌చార్జ్ ఎస్సై అంజమ్మ, ఎస్సై సతీశ్‌గౌడ్ తెలిపారు.

ఆయిల్‌పామ్‌కు కొనుగోలు కేంద్రాలు

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా నాలుగు సెంటర్లు ఏర్పాటు

వేబ్రిడ్జి వేసిన 14 రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు

పంటకు పెరుగుతున్న మద్దతు ధర

హనుమకొండ టౌన్,మే 9 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ పంటలకు రాష్ట్రప్రభుత్వం సబ్సిడీ పోత్సాహకాలు అందించడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. హనుమకొండ జిల్లాలో ఆయిల్‌పామ్ పండించిన రైతులకు ఆయా కంపెనీలు జిల్లాలో నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల అధికారులు చెబుతున్నారు.



ఆయిల్ పామ్ గెలలను ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం



కొత్తపల్లిలో ఆయిల్‌పామ్ గెలల కలెక్షన్ కేంద్రం ఏర్పాటు చేసిన కంపెనీ ప్రతినిధులు

నాలుగు సెంటర్లు

హనుమకొండ జిల్లాలో 2021 సంవత్సరం నుంచి రైతులు ఆయిల్ పామ్ పంటలను సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి రానుండడంతో హనుమకొండ జిల్లాలోని నాలుగు కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి, ఎల్కతుర్తి మండలంలోని భావుపేట, పరకాల డివిజన్‌లోని ఆత్మకూరులో కొనుగోలు కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కాజీపేట మండలంలోని తరాలపల్లిలో కలెక్షన్ కేంద్రం కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. రైతులు మొదటి దశలో ఆయిల్‌పామ్ సాగుచేసిన ప్రాంతాల్లో ప్రస్తుతం పంట దిగుబడి వస్తున్న క్రమంలో ఈ కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది కలుగకుండా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దిగుబడి వచ్చిన రైతులు వారి వాహనాల్లో ఆయిల్‌పామ్ గెలలను కంపెనీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన కొనుగోలు కలెక్షన్ కేంద్రాల వద్దకు తరలించి వేబ్రిడ్జి వేసిన తర్వాత బిల్లును కంపెనీ ప్రతినిధులకు ఇస్తారు. అనంతరం వారు రైతులకు ఫార్మర్ కోడ్ ద్వారా రశీదు అందించి ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 14 రోజులలో వారి అకౌంట్స్‌లో డబ్బులు జమ చేస్తారని అధికారులు చెబుతున్నారు.

పెరుగుతున్న మద్దతు ధర

జిల్లాలో ఆయిల్ పామ్ పంటలకు రోజురోజుకూ మద్దతు ధర పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2014లో జనవరి నెలలో ఒక టన్నుకు రూ.7,824 ధర ఉండగా 2025లో రూ.20,871 ఒక మెట్రిక్ టన్నుకు ధర పలకడంతో రైతులకు పంట సాగు చేసినందుకు గిట్టుబాటు అవుతుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆయిల్ పామ్ పంటలపై ఆసక్తి

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తితో వందల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. 2021 నుంచి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారామ్‌నాయక్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో ఎక్కువ లాభాలు రావడంతో రోజురోజుకూ సాగు పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.


బ్లూ క్యాప్డ్ రాక్ థ్రష్


ఆరెంజ్ మినివెట్


ఎల్లో ఫుటెడ్ గ్రీన్ పిజియన్


బ్లాక్ హూడెడ్ ఓరియోల్


ఇండియన్ ప్యారడైజ్ ఫ్లై క్యాచర్

పచ్చని చెట్లు, ఎత్తయిన కొండలు, చెరువులు, వాగులు.. వంకలు ఇవన్నీ పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కిలకిల రావాలు, వివిధ రకాలు పక్షులు గుంపులుగా వచ్చి.. కనువిందు చేస్తున్నా యి. ఇందుకు మహబూబాబాద్ జిల్లా గూడూరు అభయారణ్యం పరిధిలోని భీమునిపాదం జలపాతం పరీవాహక అటవీప్రాంతం నిలయమైంది. దేశవిదేశాల నుంచి వందల సంఖ్యలో పక్షులు వేల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి, విడిది చేసి, వెళ్తుంటాయి. సందర్శకులను ఇట్టే కట్టిపడేస్తాయి. గూడూరు అటవీశాఖ ఎఫ్‌డీవో చంద్రశేఖర్ నేతృత్వంలో ఇటీవల 'బర్డ్‌వాచ్' కార్యక్రమాన్ని నిర్వహిం చారు. 202 రకాలకు పైగా పక్షులు విడిది కోసం వచ్చినట్లు గుర్తించారు. వాటిలో జిల్లాలోని పలు ప్రాంతాలకు ఏటా వచ్చే విదేశీ వలస పక్షులపై నేటి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం. - గూడూరు (ఆంధ్రజ్యోతి)

వేసవి విడిది.. రావోయి అతిథి..

- వలస పక్షుల కోలాహలం
- భీమునిపాదం వద్ద విడిది

- అతిథులకు ఆవాసం గూడూరు అభయారణ్యం
- 200 లకు పైగా పక్షి జాతుల గుర్తింపు
- పర్యాటకులకు సందడే సందడి

ఉమ్మడి వరంగల్ జిల్లా పాకాల (పాకాల వైల్డ్‌లైఫ్ సాంచూరి) అభయారణ్యం పరిధిలోని మహబూబాబాద్ జిల్లా అడవులు సైతం వలస పక్షులకు నిలయంగా మారింది. ఆతిథ్య కేంద్రంగా విహార స్థలంగా విరాజిల్లుతున్న ఈ ప్రాంతంలో పక్షుల ఆవాసాలకు జీవ మనుగడకు అనువైన ప్రదేశాలు ఉండడంతో ఆయా కాలాలను అనుసరించి పక్షులు వలస వస్తున్నాయి. వర్షాకాలంతో పాటు శీతాకాలం, వేసవికాలం వచ్చిందంటే ఏటా పక్షుల సందడి కన్పిస్తోంది. ముఖ్యంగా సైబీరియా, ఆస్ట్రేలియా, రష్యా హిమాలయాల నుంచి 8 వేల కిలోమీటర్లు ప్రయాణించి పక్షులు దక్షిణ భారతదేశంలోని తెలంగాణకు చేరుకుంటాయి.

ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలోని గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని భీమునిపాదం అభయారణ్యం అడవుల్లో పక్షుల కిలకిల రాగ ధ్వనుల సందడి నెలకొంది. రంగురంగుల ఈకలు, చూడచక్కని ముక్కులతో కొమ్మారెమ్మలపై ఎగురుతూ.. నింగిలో ఆహ్లాదకరమైన విన్యాసాలు చేస్తూ వినసొంపైనా కిలకిల రాగాలతో భీమునిపాదం అడవులకు వలస పక్షులు మరింత అందాన్ని తీసుకువచ్చాయి.

అడవుల్లో పక్షులు, జంతువులకు ఆహారం సమృద్ధిగా లభిస్తుంది. దీంతో ఉత్తర, మధ్య భారతదేశంతో పాటు వివిధ ప్రాంతాలు, దేశాల నుంచి అరుదైన పక్షులు భీమునిపాదం జలపాతం పరీవాహక అభయారణ్యాన్ని విడిదిగా ఎంచుకున్నాయి. మే మొదటి వారం నుంచి డిసెంబర్ వరకు దాదాపు 202 రకాలకు పైగా పక్షులు కన్పిస్తుంటాయి. మహబూబాబాద్ జిల్లా అటవీ విస్తీర్ణం 1.45 లక్షల చదరపు కిలోమీటర్లు ఉంటుంది.

విడిదిగా భీమునిపాదం జలపాతం

తెలంగాణలో 497 పక్షి జాతులు ఉండగా, అందులో మహబూబాబాద్ జిల్లాలోని భీమునిపాదం జలపాతం అటవీ వలస పక్షులకు విడిది ప్రాంతంగా నిలుస్తోంది. ఇక్కడ 202 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. స్థానిక పక్షులు 122, వలస పక్షులు 80 మనుగడ సాగిస్తున్నాయి. భీమునిపాదం అటవీ ప్రాంతంలో పక్షులకు అనువైన జీవవైవిధ్యం, పరిసర ప్రాంతాల్లో చెరువులు, కుంటలు ఉండడంతో పాటు నీరు ఉండడం ద్వారా ఏటా 70 నుంచి 80 రకాల పక్షులు వలస వస్తాయి.


పిచుకలు ఏర్పాటు చేసుకున్న గూళ్లు

వలస పక్షులు ఎంచుకునే ప్రదేశాలు

సాధారణంగా వలస పక్షులు అడవుల్లో నీటి ఆధారిత ప్రాంతాలు, ఆహారం సమృద్ధిగా ఉండే చెరువులు, కుంటల వద్ద మనుగడ ఏర్పాటు చేసుకుంటాయి. ఆయా ప్రాంతాల సమీపంలోనే అవి గూళ్లు పెట్టుకుని నివసిస్తాయి. కొన్ని రకాల పక్షులు మాత్రం వ్యవసాయ మైదానాలను ఆధారం చేసుకుని సమీపంలోని చెట్లపై గూడును ఏర్పాటు చేసుకుంటాయి.

వలస పక్షుల సంరక్షణకు కృషి
- చంద్రశేఖర్, ఎఫ్‌డీవో, గూడూరు



భీమునిపాదం జలపాతం వద్దకు వచ్చే వలస పక్షుల సంరక్షణ కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. వాటి ఆహార అన్వేషణపై అధ్యయనం చేస్తున్నాం. గడ్డి జాతి మొక్కలను పెంచుతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. పక్షుల విడిదికి అవసరమైన నిర్మాణాలను చేపడుతున్నాం. గూడూరు వైల్డ్‌లైఫ్ డివిజన్ పరిధిలోని మూడు అటవీశాఖ రేంజ్‌లు పాకాల వైల్డ్‌లైఫ్ సాంచురియా పరిధిలో ఉన్నాయి. అవి మహబూబాబాద్ జిల్లా వరకు విస్తరించి ఉంది.

భీమునిపాదంలో సంచరించే పక్షిజాతులు

బ్లూక్యాప్డ్ రాక్ థ్రష్, ఆరెంజ్ మినివెట్, ఎల్లో ఫుటెడ్ గ్రీన్ పిజియన్, బ్లాక్ హూడెడ్ ఓరియోల్, బ్లూ థ్రోటెడ్ ఫ్లైక్యాచర్, రాకెట్ టైల్డ్ డ్రాంగో, వెర్డిటర్ ఫ్లైక్యాచర్, టికెల్స్ బ్లూ ఫ్లై క్యాచర్, ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్, ఇండియన్ పిట్ట, గోల్డెన్ ఫ్రంటెడ్ లీఫ్ బర్డ్, యషి డ్రాంగో, గ్రీన్ ఇంపీరియల్ పిజియన్, బ్లాక్ నెప్డ్ మోనార్క్, పాలపిట్ట, బ్లాక్ రంప్డ్ ఫ్లేమ్ బ్యాక్, గ్రేవ్యాగ్ టెయిల్, టికెల్స్ బ్లూ ఫ్లై క్యాచర్, గ్రే హెడెడ్ క్యానరీ ఫ్లై క్యాచర్‌తో పాటు ఏషియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్, వైట్ ఐ బెజార్డ్, రెడ్ క్రిస్టెడ్ పోచర్డ్స్, రివర్ టెర్న్స్, స్మాల్ ప్రాటిన్ కోల్స్, విస్కెరెడ్ టెర్న్స్, కామన్ కింగ్‌ఫిషర్, ఫ్లైడ్ కింగ్‌ఫిషర్, మాన్‌టె గ్యాష్ హరియర్, పాలిడ్ హ్యారియర్, ఎర్రముక్కుల రామచిలుక, పెయింటెడ్ స్పర్ ఫోల్, గ్రేహెడెడ్ స్వం పెయిన్ పక్షులు, మ్యాంగ్రోవి బ్లూ ఫ్లైక్యాచర్, బెట్టు ఉడుత, పూనుగు పిల్లి, నార్తన్ పిన్‌టైల్, యురేషియన్ కూట్, గడ్వాల్, కామన్ టీల్, కర్లీసాండ్‌ఫైపర్, బ్లాక్ వింగ్‌స్టిల్ట్, పెరిగ్రైన్‌ఫాల్కన్, రివర్‌టెర్న్, ఇండియన్ స్పాట్ బిల్డ్ బాతు, ఆసియా ఓపెన్‌బిల్ కొంగ, స్పాటెడ్ ఔలెట్స్, స్పర్ వింగ్డ్‌లాప్‌వింగ్, వైట్‌రుంప్ట్‌షమ, గ్రేటర్ ఫ్లెమింగోస్, బార్ హెడెడ్‌గీస్ లాంటి పక్షి జాతులు అభయారణ్యంలో సంచరిస్తున్నాయి. వీటిలో చాలా వరకు అత్యంత అరుదైనవి, ఇతర ప్రాంతాల్లో అంతగా కనిపించని పక్షిజాతులు ఇక్కడ కన్పిస్తాయి.

తెలంగాణలో 497 వరకు పక్షిజాతులు నమోదు కాగా, నూతనంగా నమోదు చేసిన పక్షి జాతుల్లో 4 జాతులు భీమునిపాదం నుంచే నమోదు కావడం గమనార్హం. ఈ పక్షులను పరిశీలించడానికి, కెమెరాల్లో బంధించడానికి రాష్ట్రం, దేశం నలుమూలల నుంచి పక్షి ప్రేమికులు వస్తున్నారు. ఇక ఈ ప్రాంతం పూర్తిగా ప్రాచుర్యంలోకి రాలేదు. ఇక సర్వే, పరిశోధన జరిగితే మరిన్ని పక్షి జాతులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. వలస పక్షులు దాదాపు అన్ని మాంసహారులే.. కొంగజాతికి చెందిన పక్షులు చేపలు, నత్తలు, కప్పలను ఎక్కువగా తింటాయి. బాతుజాతికి చెందిన రెడ్ క్రెస్టెడ్ పోచర్డ్, నార్తర్‌పిన్‌టేయిన్స్, గ్రిబు, విజిలింగ్ డక్స్ లాంటివి చేపలు, ఎండ్రికాయలు, ఇతర పురుగులను ఆహారంగా తీసుకుంటాయి. కూట్సులాంటి పక్షులు నాచును తీసుకుంటాయి. పక్షుల సంతనోత్పత్తి కాలం డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఉంటుంది.


బ్లూ క్యాప్డ్ రాక్ థ్రష్


గోల్డెన్ ఫ్రంటెడ్ లీఫ్ బర్డ్


బ్లాక్ నెప్డ్ మోనార్క్


గ్రేవ్యాగ్ టెయిల్


గ్రే హెడెడ్ క్యానరీ ఫ్లై క్యాచర్

బొమ్మలకు జీవం పోసి..

- సరికొత్త టెక్నాలజీతో విగ్రహాలు
- 5000 వేలకు పైగా తయారీ
- తయారీలో 35 ఏళ్ల అనుభవం
- అదే కాకతీయ శిల్ప కళానిలయం

మామునూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో 35 సంవత్సరాలుగా వివిధ దేవాలయాలకు విగ్రహాలు, పెద్ద ఆంజనేయ విగ్రహాలు తయారు చేసిన అనుభవం వీరి సొంతం.. వరంగల్‌లోనే కాక ఇతర రాష్ట్రాలకు వీరు తయారు చేసిన విగ్రహాలు ఎగుమతి చేస్తారు. కస్టమర్లు ఆర్డర్లు ఇస్తే వాళ్లకు నచ్చిన విధంగా తక్కువ రోజుల్లో విగ్రహాలను తయారు చేస్తారు. సిమెంట్, మట్టి విగ్రహాలే కాక లేటెస్ట్ టెక్నాలజీతో రూపొందించి ఫైబర్‌తో చేసిన విగ్రహాలను తయారుచేయడం కాకతీయ శిల్ప కళానిలయం ప్రత్యేకత.


కాకతీయ శిల్ప కళానిలయం వారు తయారు చేసిన ఆంజనేయుడి భారీ విగ్రహం

బొమ్మలకే ప్రాధాన్యం

దేవుడి విగ్రహాలతో పాటు స్వాతంత్ర్య సమరయోధులు, వీధులు, కూడళ్లలో ఏర్పాటు చేయడానికి మహానాయకులు, పశుపక్ష్యాధులు, వ్యవసాయ రంగంలో ఉపయోగించే పనిముట్లు, మూగజీవాలు ఇలా ఒక్కటేమిటి వీళ్ల చేతికి ఫొటో ఇస్తే చాలు అచ్చం ప్రాణం ఉట్టిపడేలా సిమెంట్ బొమ్మను తక్కువ బరువుతో అందంగా తయారు చేసి మనకు అందిస్తారు.



వారికి వారే సాటి

దేవాలయాల్లో సిమెంటుతో భగవతా మూర్తులను తయారు చేయడంలో వీరికి వీరే సాటి. వరంగల్‌లోని ఏ ఊరి పొలిమేరల్లోకి వెళ్లినా పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ, కట్టమైసమ్మ, బొడ్రాయి, బతుకమ్మ, తెలంగాణ తల్లి ఇలా గ్రామ దేవతామూర్తుల సిమెంటు బొమ్మలు స్వాగతం చెప్పేలా జీవం పోస్తుంటారు. అదే కాకతీయ శిల్ప కళానిలయం వారి స్పెషాలిటీ.

విగ్రహాల తయారీలో 35 ఏండ్ల చరిత్ర

తరాలుగా కాకతీయ శిల్ప కళానిలయం ద్వారా ఈ వృత్తిని కొనసాగిస్తున్నారు. వరంగల్ జిల్లాలోనే కాకుండా తెలంగాణలోని అన్ని జిల్లాలకు ఆర్డర్లపై విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు వరంగల్‌లోని 30 ఫీట్ల అతి పెద్ద హనుమాన్ విగ్రహాలు తయారు చేయడం విశేషం.

ప్రభుత్వం ప్రోత్సహించాలి
ముత్తినేని కార్తిక్, కళాకారుడు, వరంగల్



మావద్ద 15 మంది సిబ్బంది ఉన్నారు. మా కుటుంబ సభ్యులమంతా కలిసి ఈ వ్యాపారం చేస్తున్నాం. ప్రతిరోజూ మూడు నుంచి నాలుగు ఆర్డర్లు వస్తాయి. మా తండ్రి చూపిన బాటలోనే నడుస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం రుణ సదుపాయం కల్పిస్తే మరింత అభివృద్ధి చెందుతాం.


క్రికెట్‌లో శిక్షణ తీసుకోవడానికి వచ్చిన విద్యార్థులతో కళకళలాడుతున్న జేఎన్ఎస్

జేఎన్‌ఎస్‌కు క్రికెట్ కళ

వేసవి సెలవులు రావడంతో మైదానాలకు క్యూ కడుతున్న చిన్నారులు

వరంగల్ స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో భానుడు భగభగమంటు నిప్పులు చెరుగుతుంటే అవేమి పట్టనట్లుగా చిన్నారులు, యువత నగరంలోని వివిధ క్రీడా మైదానాలకు క్యూకడుతున్నారు. నేటీ నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో నగరంలోని యువత వారికి నచ్చిన క్రీడల్లో తర్ఫీదు పొందడానికి సమీపంలో ఉన్న క్రీడా మైదానాలకు వెళ్లేందుకు ఆసక్తిని కనబర్చుతున్నారు. క్రేజీ గేమ్ ప్రసిద్ధి గాంచిన క్రికెట్‌లో శిక్షణ కోసం గురువారం పెద్ద సంఖ్యలో జేఎన్ఎస్‌కు చిన్నారుల తరలిరావడంతో క్రీడా మైదానం కళకళలాడింది. మే 1నుంచి 31వరకు జేఎన్ఎస్ వేదికగా పలు క్రీడాంశాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించడానికి ఇప్పటికే స్పోర్ట్స్ అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. వేసవి శిక్షణ శిబిరాల ప్రారంభ దశలోనే చిన్నారులు జేఎస్ఎస్‌కే పోటెత్తడంతో ఆ క్రీడకు ఉన్న ఆదరణ ఏంటో ఇట్టే అర్థమవుతుంది.

సుందరీమణులకు భద్రత సాధ్యమేనా?!

(5వ పేజీ తరువాయి)

వంటకాలను రుచి చూపించేలా తయారు చేస్తున్నారు. ముఖ్యంగా నాటుకోడి పులుసు, జొన్న రొట్టెలు, పచ్చి పులుసు, బోటికూర తదితర వెరైటీలను వండిస్తున్నారు. వీటితో ఇంగ్లీషు, ఫ్రెంచ్, జర్మనీ, ఇటలీ తదితర భాషలపై పట్టున్న గైడ్‌లను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. అందగత్తెలకు వారికి అర్థమయ్యే భాషల్లోనే ఓరుగల్లు చరిత్ర, కాకతీయ కళావైభవాన్ని వివరించేలా పర్యాటకశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

మూడంచెల భద్రత

ఓరుగల్లుకు వస్తున్న ప్రపంచ అందగత్తెల కోసం ప్రభుత్వం మూడంచెల భద్రత ఏర్పాట్లు చేస్తోంది. రామప్ప శిల్ప వైభవాన్ని తిలకించేందుకు వస్తున్న సుందరీమణులకు భద్రతపై ఇప్పటికే పోలీసులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. రామప్పకు రానున్న 22మంది మిస్ వరల్డ్ పోటీదారులకు వెయ్యిమంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్ కోటలో పర్యటించే 35మంది అందగత్తెల కోసం 800మంది పోలీసులు, హరిత హోటల్ వద్ద 250మందితో భారీ భద్రతకు ఏర్పాట్లు చేస్తున్నారు. యుద్ధం నేపథ్యంలో స్థానిక పోలీసుల భద్రతతో పాటు హైదరాబాద్ నుంచి ప్రత్యేక కమాండోలతో సుందరీమణులకు రక్షణ కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్ నగరంలో ఇప్పటికే పోలీసులు 45వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, జీడబ్ల్యుఎంసీ ఆధ్వర్యంలో 750కి పైగా సీసీ కెమెరాలు ఉన్నాయి. అలాగే రామప్పలో ఇప్పటికే ఉన్నవాటితో కలిపి 70కిపైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటన్నింటిని కూడా హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీరితోపాటు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, ఇంటెలిజెన్స్ బృందాలు ఎప్పటికప్పుడు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అయితే భద్రత ఏర్పాట్లు విస్తృతంగా చేస్తున్నప్పటికీ పోలీసులకు వరుస కార్యక్రమాలు సవాల్‌గా మారనున్నాయి. 14వ తేదీన రాత్రి వరకు 2వేల మంది పోలీసులు సుందరీమణులకు రక్షణగా ఉండాలి. మరుసటి రోజు నుంచే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి 15వ తేదీన కాళేశ్వరంలో పుష్కరాల్లో పాల్గొనే అవకాశం ఉంది. దీంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు భద్రతతో పాటు సీఎంకు రక్షణ ఏర్పాట్లు చేయాలి. వీటితో పాటు పాకిస్థాన్‌తో యుద్ధ మేఘాలు కమ్ముకోవటంతో ఏ క్షణం ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. దీంతో పోలీసులకు భద్రత ఏర్పాట్లు సవాల్‌గా మారాయనే టాక్ వినిపిస్తుంది.

మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ఠ ఏర్పాట్లు

- రామప్ప చుట్టూ నో డ్రోన్ ఫ్లయింగ్ జోన్
- వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు
- మీడియాతో ములుగు జిల్లా కలెక్టర్, ఎస్పీ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ములుగు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, చరిత్ర, పర్యాటకాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలకు ములుగు జిల్లాలోని రామప్ప దేవాలయం వద్ద పటిష్ఠమైన ఏర్పాట్లు చేసినట్లు ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న మిస్‌వరల్డ్ పోటీదారులు వస్తున్నారని తెలిపారు. ఆ రోజు పర్యాటకుల సందర్శనను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. పాస్‌లు ఉన్న వారికి మాత్రమే దేవాలయం వద్దకు అనుమతించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి రామప్ప స్వాగత తోరణం వద్ద నియంత్రణ అమలులోకి వస్తుందన్నారు. వెయ్యిమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే రిహార్సల్స్ పూర్తి చేశామన్నారు. 35కు పైగా దేశాల నుంచి పోటీదారులు, ప్రతినిధులు తరలివస్తుండగా వారి భద్రత దృష్ట్యా రామప్ప చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో నో డ్రోన్ ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించడం జరిగిందన్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్నిశాఖల సమన్వయంతో ఈవెంట్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డీపీఆర్వో ఎమ్డీ.రఫిక్ పాల్గొన్నారు.


ఖిలా వరంగల్ మధ్యకోటలో లైటింగ్ షో ట్రయల్ రన్ దృశ్యం

కోటలో ఏర్పాట్ల పరిశీలన

ఖిలావరంగల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న సుందరీమణుల రాక సందర్భంగా ఖిలావరంగల్ మధ్యకోటలో జరుగుతున్న ఏర్పాట్లను గ్రేటర్ వరంగల్ నగర కమిషనర్ అశ్వినితానాజీ వాకడే పరిశీలించారు. శుక్రవారం రాత్రి మధ్యకోటలోని శిల్పాల ఆవరణలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇల్యూమినేషన్ (విద్యుత్‌దీపాల ఏర్పాటు) ట్రయల్ రన్ పనులను ప్రారంభించారు. ఇతర మరమ్మతు పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పురావస్తుశాఖ ఖిలావరంగల్ ఇన్‌చార్జి విజయ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా టూరిజం కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ సరిత శుక్రవారం మధ్యకోటలోని శిల్పాల ఆవరణలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. స్టాల్స్, చేనేత ప్రదర్శన, శివతాండవం, పేరిణీ నృత్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర పురావస్తుశాఖ, పర్యాటక శాఖ జిల్లా అధికారులు సైతం కోటలో మరమ్మతు పనులను పరిశీలించారు. త్వరగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి నవీన్‌కుమార్, పర్యాటకశాఖ జిల్లా అధికారి శివాజీ, కో-ఆర్డినేటర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యకోటను పరిశీలిస్తున్న టూరిజం కార్పొరేషన్ ఎస్ఈ సరిత





కోటలో పనులను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ అశ్విని

అతిథులకు బహుమతులు సిద్ధం

ఏర్పాట్లను పూర్తి చేసిన అటవీ శాఖ అధికారులు

ములుగు, మే 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్పకు ఈ నెల 14న ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొననున్న కంటెస్టెంట్స్ రానున్న విషయం విదితమే. ప్రపంచంలోని 35 దేశాల నుంచి వస్తున్న సుందరీమణుల కోసం జిల్లా అటవీశాఖ అధికారులు వెదురుకర్రతో చేయించిన(హ్యాండ్ మేడ్) బహుమతులను సిద్ధం చేశారు. తెలంగాణ ఖ్యాతిని గ్లోబల్ లెవల్‌లో మారుమోగేలా బహుమతులను సిద్ధం చేయిం చారు. మధ్యప్రదేశ్ నుంచి ఇద్దరు ట్రైనర్లను పిలిపించి జంగాలపల్లి గ్రామంలోని 30 మంది మహిళలకు శిక్షణ ఇప్పించి వెదురు కర్రతో వివిధ రకాల బొమ్మలను తయారు చేయించారు. ఈ బొమ్మల తయారికి తాడ్వాయి మండలం నుంచి వెదురు కర్ర తెప్పించారు. ఎంతో నైపుణ్యంతో మహిళలు తయారు చేసిన బహుమతులను గెస్ట్‌లకు అందించనున్నట్లు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ తెలిపారు. గతంలో తాడ్వాయి మండలం కొండపర్తికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ వచ్చినప్పుడు స్టాల్‌ను ఏర్పాటు చేసి వెదురు కర్రతో చేసిన బొమ్మలను ప్రదర్శనకు పెట్టారు. ఆ బొమ్మలు గవర్నర్‌ను ఆకర్షింపచేశాయని, వారికి బహుమతిగా బొమ్మలను అందజేశామని డీఎఫ్‌వో తెలిపారు. మహిళలు అద్భుత నైపుణ్యంతో చేసినటువంటి బొమ్మలను వివిధ దేశాల నుంచి వస్తున్న సుందరీమణులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో తెలంగాణ ఖ్యాతి ప్రపంచ స్థాయిలో మారుమోగుతుందన్నారు.


మహిళలు తయారు చేస్తున్న వెదురు బొమ్మలు


మహిళలు వెదురు కర్రలతో తయారు చేసిన బొమ్మలు



ఈసం నారాయణకు సన్మానం

కేయూ క్యాంపస్, మే 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన యూనివర్సిటీ లోగో కమిటీలో సభ్యుడిగా జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణ నియమితులైన సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేయూ బయోటెక్నాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బయెటక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ తాడూరి శాస్త్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పుల్లా శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నేతలు సంగాల దయాకర్, కిరణ్‌కుమార్, బొక్క మొగిలి, దామెర ప్రకాశ్, ప్రతాప్, సంగాల ఎప్రామ్‌రాజ్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు సేవ చేయాలి

కేయూ క్యాంపస్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ శాయశక్తులా నిరాశ్రయులకు, వృద్ధులకు సేవలందించాలని కేయూ పాలక మండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కారుకాల అనితారెడ్డి అన్నారు. శుక్రవారం కేయూ రోడ్డులో లార్డ్ వృద్ధాశ్రమయంలో కారుకాల అనితారెడ్డి, రాంరెడ్డి దంపతుల షష్టిపూర్తిని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాంరెడ్డి, నాగరాని నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేలాడుతున్న మృత్యు పాశాలు

- కేబుల్ తీగలతో భయాందోళన చెందుతున్న వాహనదారులు, కాలనీవాసులు
- కేబుల్ వైర్లు తెగి రోడ్డుపై పడడంతో ప్రమాదాల బారిన పడుతున్న స్థానికులు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు





హనుమకొండ టైలర్‌స్ట్రీట్ సమీపంలోని స్తంభాలకు అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లు

హనుమకొండ చౌరస్తా, మే 9 (ఆంధ్రజ్యోతి) : నగరవాసులను విద్యుత్ స్తంభాలకు అమర్చిన కేబుల్, ఇంటర్‌నెట్ తీగలు భయపెడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు, కాలనీలతో పాటు ప్రధాన రోడ్డు మార్గాల్లోని స్తంభాలకు కట్టలుగా వేలాడుతున్న కేబుల్ తీగలు ఎప్పుడు తెగిపోయి పడి ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం జన సంచారం ఉండే హనుమకొండ ప్రధాన కూడళ్లు, చౌరస్తా, టైలర్ స్ట్రీట్, గుడిబండల్, అశోక జంక్షన్లలో పాటు ప్రధాన రోడ్ల వెంబడి స్తంభాల కిందికి జారిన కేబుల్ వైర్లు కుప్పలుగా యమపాశాలను తలపిస్తున్నాయి. విద్యుత్ స్తంభాలకు ఇంటర్‌నెట్, కేబుల్ వైర్లను వినియోగించుకున్నందుకు ప్రతిఫలంగా విద్యుత్ శాఖ సిబ్బందికి కొంతమేర చెల్లించడం వల్లే పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లను కట్టకూడదనే నిబంధనలున్నా ఆ విషయాన్ని కేబుల్, ఇంటర్‌నెట్ నిర్వాహకులు పెడచెవిన పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటర్‌నెట్ కనెక్షన్, కేబుల్ వైర్లను ప్రధాన రోడ్డు మార్గాలతో పాటు పలు కాలనీలకు పంపించే క్రమంలో ప్రమాదవశాత్తు అలాంటి వైర్లు తెగిపోతున్నాయి. నగరవాసులు వాటిని గమనించక ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి. ఇటీవల హనుమకొండ యాదవనగర్‌కు చెందిన ముద్దసాని శ్రవణ్‌కుమార్ రెడ్డికాలనీలో బైక్‌పై వెళ్తుండగా తెగి ఉన్న కేబుల్‌ను గమనించకుండా పోయేసరికి వైరు మెడకు తట్టుకొని పడిపోయాడు. దీంతో అతడి చేయి విరగడంతో పాటు తలకు బలమైన దెబ్బలు తాకాయి. ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. స్ట్రీట్ లైట్ల మరమ్మతుల కోసం విద్యుత్ శాఖకు చెందిన ఉద్యోగులు విద్యుత్ స్తంభాలు ఎక్కడానికి వీలు లేని విధంగా కేబుల్ వైర్లను స్తంభాలకు చుట్టిపెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో స్తంభాలకు చుట్టిన కేబుల్ వైర్లకు విద్యుత్ సరఫరా జరిగి అవి కిందకు వేలాడుతున్న సమయంలో వాహనదారులు విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశాలు లేక పోలేదు. గతంలో హనుమకొండ టైలర్ స్ట్రీట్‌లో విద్యుత్ సరఫరా చేసే వైర్లు లూజ్ కనెక్షన్‌తో మంటలు చెలరేగాయి. అక్కడ ఉన్న స్తంభానికి కేబుల్ తీగల అమర్చి ఉండటంతో మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. అసలే వేసవి కాలం గాలి దుమారం వీచడంతో విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లు తెగి ఎలాంటి ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కేబుల్ వైర్లు, ఇంటర్‌నెట్ కనెక్షన్ల ద్వారా లబ్ధి పొందుతున్న వ్యాపారస్తుల నిర్లక్ష్యంతో విద్యుత్ స్తంభాలకు వైర్లను అమర్చుతూ వాహనదారులు, స్థానికుల ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని పలువురు నిలదీస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లు గుట్టలుగా ఉంచకుండా చూడాల్సిన యంత్రాగం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుట్టలుగా ఉన్న కేబుల్ వైర్లను తొలిగించాలని నగర వాసులు కోరుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది..

- కందికొండ సదానందం, 8వ డివిజన్



మాది 8వ డివిజన్ టైలర్‌స్ట్రీట్ సమీపంలోని మారెమ్మచెట్టు ప్రాంతం. ఈ ప్రాంతంలోని విద్యుత్ స్తంభాలకు పెద్ద చుట్టలతో కూడిన కేబుల్ వైర్లు ఉన్నాయి. అటు వెళ్లే సమయంలో ఆ వైర్లు తెగి ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని బిక్కు బిక్కుమంటూ వెళ్ళాల్సి వస్తోంది. గతంలో ఇదే ప్రాంతంలో స్తంభాలకు కట్టిన వైర్లు తెగి అటుగా వెళ్లిన వారికి చుట్టుకొని ప్రమాదాల బారినపడ్డారు. స్తంభాలకు అమర్చిన కేబుల్ వైర్లను తొలగించాలని ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదు. ఇప్పటికైనా అమర్చిన కేబుల్ వైర్లను తొలగించాలి.



డీఈవో జ్ఞానేశ్వర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వడుప్సా ప్రతినిధులు

సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూల్స్‌కు సంబంధించిన ఏఅంశాన్ని సమాచార హక్కు ద్వారా ఇతరులకు అందజేయాల్సిన అవసరం లేదని రాష్ట్ర హైకోర్టు స్పష్టం చేసినట్లు వడుప్సా(ట్రస్మా) వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, ప్రధానకార్యదర్శి బిల్ల రవి అన్నారు. ఈ మేరకు వడుప్సా ప్రతినిధులు శుక్రవారం హనుమకొండలోని వరంగల్ డీఈవో కార్యాలయంలో వరంగల్ డీఈవో ఎం.జ్ఞానేశ్వర్‌ను కలిసి వినతి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలలు పబ్లిక్ అథారిటీ కిందకు రావని రాష్ట్ర హైకోర్టు స్పష్టం చేసిన విషయాన్ని డీఈవోకు వివరించారు. అనంతరం జిల్లాలోని ప్రైవేటు స్కూల్ సమస్యలను డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై డీఈవో సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వడుప్సా జిల్లా కోశాధికారి ఠాకూర్ జ్ఞానేశ్వర్ సింగ్, ముఖ్య సలహాదారులు కోడం శ్రీధర్, పొన్నెజు చక్రపాణి, జిల్లా అకడమిక్ కన్వీనర్ మడిపెల్లి రాజు, ఉపాధ్యక్షుడు నాగపురి కిరణ్‌కుమార్, వరంగల్ మండలాధ్యక్షుడు కూచన క్రాంతికుమార్, ఖిలావరంగల్ మండలాధ్యక్షుడు ముక్కెర రవీందర్, కోశాధికారి కూరపాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

14 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలో 14 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైళ్లలో ఎండుగంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం కాజీపేట రైల్వేస్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌లలో తనిఖీలు చేశారు. తనిఖీల అనంతరం రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేయగా బ్యాగు లభ్యమైంది. బ్యాగులో ఉన్న కవర్లలో 14 కిలోల 700 గ్రాముల గంజాయి లభ్యమైందన్నారు. రైళ్లలో తనిఖీలు చేస్తుండగా గంజాయి రవాణా చేసే వ్యక్తులు గంజాయి బ్యాగుని చెట్లపొదల్లో పడేసి పారిపోయి ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. పట్టుబడిన గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.90వేలు ఉంటుందని తెలిపారు.

ప్రైవేట్ విద్యా సంస్థల మోసపూరిత ప్రచారం నమ్మొద్దు

కేయూ క్యాంపస్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యాసంస్థల మోసపూరిత ప్రచారాలను నమ్మవద్దని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ అన్నారు. శుక్రవారం కేయూ గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఏబీఎస్ఎఫ్ విద్యార్థుల సమావేశంలో నరేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కోటేషన్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షించేలా ప్రచారాలు చేస్తున్న విద్యాసంస్థల డొల్లతనాన్ని గమనించాలని పిలుపునిచ్చారు. అనేక ప్రైవేట్ విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు లేవన్నారు. ఇరుకుగదుల్లో తరగతులు నడుస్తున్నాయని చెప్పారు. అధికమొత్తంలో ఫీజులు వసూల్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేశ్, కేయూ అధ్యక్షుడు దూడపాక నరేందర్, నాయకులు ఇప్ప భరత్, భద్రన్న, రమేశ్, సాయి, కిరణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

హసన్‌పర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లాపూర్, నాగారం 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈలు శిరీష్ కుమార్, తరుణ్ కుమార్‌లు తెలిపారు. సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ క్రమబద్ధీకరణ పనులు కొనసాగుతున్నాయని విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

హసన్‌పర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి పుల్ల అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 20వ తేదీన దేశ వ్యాప్త సమ్మెలో రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనగాని శ్రీనివాస్, సందెల భిక్షపతి, బొంకూరి నాగరాజు, కనకస్వామి, ప్రదీప్, శ్రీవాణి, సరోజన, రమ, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ప్రైవేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న డీఈవో, డీఐఈవో



సమావేశంలో మాట్లాడుతున్న మంద శ్రీకాంత్

కేయూ క్యాంపస్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న హనుమకొండ డీఈవో, డీఐఈవోలను వెంటనే సస్పెన్షన్ చేయాలని ఎస్ఎఫ్ఐ హనుకొండ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూ గెస్ట్ హౌస్‌లో ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లా కేంద్రంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు హోర్డింగ్‌లతో ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. విచ్చలవిడిగా వేసవిలో తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. అధిక మొత్తంలో లక్షల ఫీజులను అక్రమంగా వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. దీనిపై వెంటనే కలెక్టర్ స్పందించాలని నిబంధనలు పాటించని విద్యా సంస్థలను మూసివేయాలని డిమాండ్ చేశారు. అలాగే వారికి వత్తాసు పలుకుతున్న విద్యాధికారులనూ సస్పెన్షన్ చేయాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు మల్లేశ్, పవన్, అజయ్, భరత్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ప్రశాంతతకు, శరీర ధృఢత్వానికి దోహదపడుతాయని కేఎంసీ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకతీయ మెడికల్ కళశాల (కేఎంసీ) వరంగల్ క్రీడా మైదానంలో ఏర్పాటు ఉచిత వేసవి క్రికెట్ క్రీడాశిక్షణ శిబిరాన్ని కేఎంసీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ రామ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. హెచ్‌సీఏ ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆరు శిక్షణ కేంద్రాల్లో ఉచిత వేసవి క్రికెట్ క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. అండర్-14, 16, 19, 23 బాలబాలికల విభాగాల్లో మే 9నుంచి జూన్ 7వ తేదీ వరకు నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో క్రీడా శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సదాశివ, రాము, ఈసీ మెంబర్ వినయ్, కోచ్ గోవింద్‌సింగ్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో కాంగ్రెస్ ర్యాలీ

కాజీపేట, మే 9 (ఆంధ్రజ్యోతి) : పహల్గాం ఉగ్రదాడికి నిరసిస్తూ పాక్‌పై భారత్ ఎదురుదాడిని హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు మడికొండలో శుక్రవారం భారీ ర్యాలీ చేశారు. జై భారత్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట మండల పార్టీ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. యుద్ధంలో త్యాగాలు చేసే వారికి భారత ప్రజల అండదండలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బిల్లా రవీందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు గుర్రం అమర్‌నాథ్, ఎడబోయిన ప్రభాకర్, 46వ డివిజన్ అధ్యక్షులు వస్కుల నాగరాజు, 64వ డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, నాయకులు బైరి లింగమూర్తి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘచందర్, రామాలయ చైర్మన్ పల్లపు అర్జున్‌తోపాటు స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

భూనీల సమేత వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు

హనుమకొండ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఆదాలత్ సమీపంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర ఆలయంలో వారం పాటు కొనసాగే స్వామివారి 15వ బ్రహ్మోత్సవాలు అరంభమయ్యాయి. శుక్రవారం విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, పుణ్యాహవాచనం, అంకురోపణలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నర్సింహ దేశికన్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగే వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమంలో హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమా దంపతులు పాల్గొన్నారు. శనివారం మహాకుంభ ప్రతిష్ఠ, ఆదివారం నర్సింహస్వామి జయంతి, హనుమత్ వాహనసేవ, సోమవారం స్వామి వారి కల్యాణోత్సవం, మంగళవారం ఉంజల్ సేవ, బుధవారం మహాపూర్ణహుతి, శ్రీ పుష్పయాగంతో వేడుకలు పరిసమాప్తం అవుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నేడు దొప్ప లక్ష్మీనరసింహుడి జయంతి

హనుమకొండ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బ్రహ్మణవాడలో కాకతీయకాలం నాటి చారిత్రక శ్రీదొప్ప లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామివారి జయంతి, ఆదివారం వైభవంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు బురుగుపల్లి చంద్రశేఖరశర్మ, గంగాధర ఫణిభూషణశర్మలు చెప్పారు. సాలగ్రామ శిలసౌందర్యమూర్తిగా శతావతారాల విగ్రహంతో కల్గిన మహాలక్ష్మిదేవిని, పార్శమున, ప్రహ్లాదుడి వరదుడుగా శ్రీదొప్ప లక్ష్మి యోగ నర్సింహ స్వామిగా అవతరించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ప్రతీ ఏటా మార్ద సంప్రదాయ విధానంలో స్వామివారికి జయంతి, కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సుప్రభాతం, గణపతి పూజతో ప్రారంభమయ్యే వేడుకల్లో భాగంగా 108 కలశలతో ప్రత్యేక కలశాభిషేకం, ఉపనిషత్ సేవకాలం, విష్ణు సహస్రనామ పారాయాణలు నిర్వహిస్తామని, ఆదివారం స్వామివారి కల్యాణోత్సవంతోపాటు భక్తులకు అన్నదానం చేస్తామని ఆలయ అర్చకుడు బురుగుపల్లి చంద్రశేఖర శర్మ తెలిపారు.

అంతర్జాతీయ నర్సుల వారోత్సవాలు



అంతర్జాతీయ నర్సుల వారోత్సవంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

వరంగల్ మెడికల్, మే 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నర్సుల వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ హాజరై, మాట్లాడారు. ఇండో-పాక్ యుద్ధ నేపథ్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రక్తం యూనిట్లను సేకరించడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ శశికుమార్, బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ దయాశీల, ప్రిన్సిపాల్ సునీత, ఎస్.సుజీవన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఏసీజీఈకి సన్మానం



చలపతిరావును సత్కరిస్తున్న డీఈవో కార్యాలయ సిబ్బంది

వరంగల్ ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డీఈవో కార్యాలయంలో ఏసీజీఈగా విధులు నిర్వర్తించి ఇటీవలే హైదరాబాద్ డీజీఈ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన దున్నాడ చలపతిరావును హనుమకొండ డీఈవో కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. శుక్రవారం హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో చలపతిరావును పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎఫ్ఏవో ఎ.మధుసూదన్, టీఎస్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరమ్ జిల్లా సెక్రెటరీ జంగం రాజేశ్వర్, సూపరింటెండెంట్ పి.శైలజ, సిబ్బంది సరోజిని, గౌసుద్దీన్, జయధీర్, అలీం, జాకీర్, కుమారస్వామి, అవినాష్, ప్రసాదరావు, సుమలత, భవాని, సునీల్, క్రాంతి, నవీన్, ప్రశాంత్, గీత, సులోచన పాల్గొన్నారు.

బడుల బలోపేతంలో ప్రజల భాగస్వామ్యం కీలకం

హసన్‌పర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల బలోపేతంలో ప్రజలు, అధికారులు, మహిళాసంఘాల భాగస్వామ్యం కీలకమని మండల విద్యాధికారి ఇ.రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఓపెన్ స్కూల్ ఉల్లాస్ ప్రోగ్రాంపై మండల స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. మండల స్థాయి కన్వీనర్ ఎంఈవో రాజిరెడ్డి, కోకన్వీనర్ ఏపీఎం ఆకుతోట ప్రభాకర్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాలతో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంఈవో, ఏపీఎంలు మాట్లాడారు. మే 12న గ్రామ స్థాయిలో గ్రామ విద్యా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వయోజనులైన చదువురాని యువతీ, యువకులను గుర్తించి వివరాలను నమోదు చేసుకొని వారికి కూడా విద్యను అందించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంపత్, రమాదేవి, రవికుమార్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏపీసీ చైర్మెన్‌లు, గ్రామీణ మహిళా సమాఖ్య సభ్యులు, సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు, మిస్ కోఆర్డినేటర్, సీసీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రాజిరెడ్డి

భోజన కుతూహలం

పల్లేరుతో భేషైన ఆరోగ్యం..!

పల్లేరు మనకు చాలా ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటుంది. చాలా మంది దీన్ని పిచ్చి మొక్క అనుకుంటారు. కానీ పల్లేరు కాయలు, ఆకుల వల్ల అమితమైన ప్రయోజనాలున్నాయని ఆయుర్వేద గ్రంథాలు చెబుతున్నాయి.



పల్లేరును సంస్కృతంలో 'గోక్షురం' అని పిలుస్తారు. 'గోక్షురం' అంటే శరీరానికి చల్లదనాన్ని, బలాన్ని, పుష్టిని అందించేదని అర్థం. పల్లేరుకాయలు చిన్నవి, పెద్దవి అని రెండు రకాలుగా ఉంటాయి. పెద్ద పల్లేరుకాయల్ని 'గజపల్లేరు' అంటారు. ఈ కాయను రెండుగా చీలిస్తే- లోపల భాగమంతా జిగురుగా ఉంటుంది. ఈ జిగురు మన శరీరానికి ఎంతో ఉపకరిస్తుంది. కేవలం జిగురు మాత్రమే కాదు, పల్లేరు ఆకులు, కాయలు, వేర్లు... ఇవన్నీ త్రిదోష సమతుల్యతను కలిగిస్తాయి. చిన్న పల్లేరు కాయలకు కూడా ఈ తరహా గుణాలే ఉంటాయి. పల్లేరు కాయలు, ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం.

- పల్లేరు ఆకులను ఎండబెట్టి వాటితో ఉదయాన్నే టీ చేసుకొని తాగితే చర్మానికి కాంతి వస్తుంది.
- పల్లేరు ఆకులను సలాడ్‌లో వేసుకొని తింటే మూత్రంలో మంట తగ్గుతుంది. మూత్రనాళంలోని రాళ్లు కరిగిపోతాయి.
- పల్లేరు కాయలను ఎండబెట్టి కషాయంగా చేసి తాగితే హార్మోన్ల అసమతౌల్యం కలిగే రకరకాల సమస్యలు తగ్గుతాయి. యువతులను వేధించే 'పోలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్ (పీసీఓడీ)కు కూడా ఇది మంచి పరిష్కారం.
- పల్లేరు కాయలు స్ఫటికం మాదిరిగా ముళ్లు ముళ్లుగా ఉంటాయి. ఈ కాయలలోని గుజ్జును ఏదో ఒక రూపంలో తీసుకుంటే మూత్రపిండాల్లో పేరుకున్న రాళ్లు కరుగుతాయి.
- పల్లేరు ఆకులు, కాయలు, వేర్లను ఎండబెట్టి... పొడి చేసి దాన్ని కూరల్లో వాడుకుంటే రకరకాల ప్రయోజనాలు ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

మనలో చాలామంది తాటి ముంజలను ఇష్టంగా తింటూ ఉంటారు. వీటితో రకరకాల వంటలు కూడా చేసుకోవచ్చు. తాటి ముంజలను సరికొత్తగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

తాటి ముంజలతో మురిపించే రుచులు

తాటి ముంజలతో లెమనేడ్

కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, నిమ్మరసం- రెండు చెంచాలు, పంచదార- మూడు చెంచాలు, ఐస్ క్యూబ్స్- 4, ఉప్పు- చిటికెడు, నల్ల ఉప్పు- చిటికెడు, నీళ్లలో నానబెట్టిన సబ్జాగింజలు- రెండు చెంచాలు, పుదీనా ఆకులు రెండు

జాగ్రత్తలు

- లేత తాటి ముంజలు తీసుకుంటే ఈ పానీయం మరింత రుచిగా ఉంటుంది.
- ఇందులో నానబెట్టిన చియా గింజలు కూడా వేసుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలను చిన్న ముక్కలుగా తరగాలి.
- మిక్సీలో తాటి ముంజల ముక్కల్లో సగం, నిమ్మరసం, పంచదార, రెండు ఐస్ క్యూబ్‌లు, ఉప్పు, నల్ల ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి.
- ఒక సర్వింగ్ గ్లాస్‌లో సబ్జా గింజలు, మిగిలిన తాటి ముంజల ముక్కలు, రెండు ఐస్ క్యూబ్‌లు, మిక్సీ గిన్నెలోని మిశ్రమం వేయాలి. ఒక గ్లాసు చల్లని నీళ్లు పోయాలి. పైన పుదీనా ఆకులు వేసి సర్వ్ చేయాలి.

వీటిలో నీరు అధికంగా ఉంటుంది కాబట్టి శరీరానికి తగినంత తేమ అందుతుంది. నిర్జలీకరణ సమస్యలు రావు. తాటి ముంజలలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.




తాటి ముంజల పాయసం

కావాల్సిన పదార్థాలు

పాలు- ఒక లీటరు, పంచదార- ముప్పావు కప్పు, లేత తాటి ముంజలు- ఆరు, యాలకుల పొడి- అర చెంచా, బాదం పలుకులు- రెండు చెంచాలు, జీడిపప్పు పలుకులు- రెండు చెంచాలు, గులాబీ నీరు- ఒక చెంచా

తయారీ విధానం

- తాటి ముంజలకు తొక్క తీసి వీలైనంత సన్నగా తరగాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి పెద్ద మంట మీద పావుగంటసేపు మరిగించాలి. పాలను గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు చిక్కగా అయ్యాక పంచదార పోసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత పాలను స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. ఫ్రిజ్‌లో రెండు గంటలు ఉంచాలి. తరవాత ఈ చల్లటి పాలలో తాటి ముంజల తరుగు, గులాబీ నీళ్లు, బాదం పలుకులు, జీడిపప్పు పలుకులు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. తరవాత చిన్న పింగాణీ గిన్నెల్లో పోసి సర్వ్ చేయడమే. ఈ పాయసం రుచి అద్భుతంగా ఉంటుంది.



జాగ్రత్తలు

- పాయసం చిక్కగా ఉండాలనుకుంటే... చిన్న గిన్నెలో ఒక చెంచా కస్టర్డ్ పౌడర్ వేసి, కొన్ని నీళ్లు పోయాలి. జారుగా కలిపి ఆ మిశ్రమాన్ని మరుగుతున్న పాలలో కలిపితే సరిపోతుంది.
- గులాబీ నీరు అందుబాటులో లేకపోతే నాలుగు రేకుల కుంకుమ పువ్వు వేసుకోవచ్చు.
- పంచదార వద్దనుకుంటే... మరిగిన పాలను స్టవ్ మీద నుంచి దించాక అందులో బెల్లం పొడి కలుపుకోవచ్చు.

తాటి ముంజలలో ఎ, బి, సి విటమిన్లతోపాటు ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం లాంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తపోటు, మలబద్దకం లాంటి సమస్యలను నివారిస్తాయి. శరీరంలో కణితులు, రొమ్ము క్యాన్సర్ రాకుండా నిరోధిస్తాయి. ముఖం మీద మొటిమలు, మచ్చలు, ముడతలు రాకుండా చేస్తాయి.

తాటి ముంజల కూర



కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఉప్పు- తగినంత, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి- అర చెంచా, జీలకర్ర- పావు చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- పావు కప్పు, నూనె- మూడు చెంచాలు

జాగ్రత్తలు

- తాటి ముంజల్ని మరీ లేతగా, మరీ ముదురుగా కాకుండా మధ్యస్థంగా ఉండేవి తీసుకోవాలి.
- నూనె వేడెక్కిన వెంటనే కొన్ని జీడిపప్పు పలుకులు వేస్తే కూర కమ్మగా ఉంటుంది.
- టమాటా ముక్కలను వీలైనంత సన్నగా తరగాలి. లేదంటే టమాటా పేస్టు వాడుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలకు తొక్క తీసి ఒక్కోదాన్ని నాలుగు ముక్కలుగా కోయాలి.
- స్టవ్ మీద కడాయి పెట్టి, నూనె వేసి వేడి చేయాలి. తరవాత జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, చిటికెడు ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత తాటి ముంజల ముక్కలు, పసుపు, కారం, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత టమాటా ముక్కలు, ధనియాలపొడి, జీలకర్ర పొడి, కొత్తిమీర తరుగు వేసి కలపాలి. మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత కడాయిని స్టవ్ మీద నుంచి దించి కూరను వేరే గిన్నెలోకి తీయాలి. ఈ తాటి ముంజల కూర... అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

ఎండాకాలంలో తాటి ముంజలు తినడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. వడదెబ్బ తగలదు. శరీరంలో పేరుకున్న విషపదార్థాలు తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

మూతల రంగుల్లో మర్మం ఇదే..!



మనం సాధారణంగా బయటికి వెళ్లినప్పుడు లేదా ప్రయాణాల్లో దాహమనిపిస్తే వెంటనే వాటర్ బాటిల్ కొనుక్కుని నీళ్లు తాగేస్తూ ఉంటాం. ఈ బాటిళ్లకు పలు రంగుల మూతలు ఉండడాన్ని చాలామంది గమనించే ఉంటారు. ఈ రంగు మూతలు ఆ బాటిళ్లలోని నీటి గురించి తెలియజేస్తాయంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

నీలం: మనకు తరచుగా లభ్యమయ్యే వాటర్ బాటిళ్లకు నీలం రంగు మూతలు ఉంటాయి. అంటే ఆ బాటిళ్లలోని నీటిని నదులు, చెరువులు లాంటి సహజ వనరుల నుంచి సేకరించి శుద్ధి చేశారని అర్థం. ఈ నీటిలో లవణాలు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అందుకే ఈ నీటిని 'మినరల్ వాటర్' అంటారు.



ఆకుపచ్చ: ఇవి కాస్త అరుదుగా కనిపిస్తూ ఉంటాయి. పెద్ద సూపర్ మార్కెట్లలో, షాపింగ్ మాల్స్‌లో, ఫైవ్ స్టార్ హోటళ్లలో ఇవి లభ్యమవుతాయి. ఆకుపచ్చ మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నది 'ఫ్లేవర్డ్ వాటర్' అని అర్థం. కొన్ని రకాల నేచురల్ ఫ్లేవర్స్‌ను స్వల్ప మోతాదులో కలపడం వల్ల ఈ నీరు ప్రత్యేకమైన రుచితో ఉంటుంది.

నలుపు: నలుపు రంగు మూత ఉన్న వాటర్ బాటిల్స్ కూడా అరుదుగానే కనిపిస్తాయి. వీటి ధర ఎక్కువగా ఉంటుంది. వీటిని సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు కొంటూ ఉంటారు. నల్లని మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి... 'ఆల్కలైన్ కలిపిన నీళ్లు' అని అర్థం. ఈ నీళ్లు తాగితే కడుపులో ఆమ్లత్వం, ఇతర జీర్ణాశయ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో క్షార పదార్థాలు, మినరల్స్ కూడా కలుపుతారు.

తెలుపు: తెల్లని మూత ఉన్న వాటర్ బాటిల్స్ సాధారణంగా అన్ని చోట్లా దొరుకుతూనే ఉంటాయి. వీధి చివరన ఉండే చిన్న కొట్లు, కిరాణా షాపులు, కూల్‌డ్రింక్ షాపులు, బస్టాండ్లలో ఇవి విరివిగా లభ్యమవుతూ ఉంటాయి. తెలుపు మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి 'బాగా శుద్ధి చేసిన నీళ్లు' అని అర్థం. వీటిలో ఎటువంటి మినరల్స్ ఉండవు. కేవలం దాహం తీర్చుకోవడానికి పనికొస్తాయి.

పసుపు, ఎరుపు, గులాబీ రంగులు: పసుపు రంగు మూత ఉంటే ఆ నీళ్లు విటమిన్లు, ఎలక్ట్రొలైట్లు కలిపినవనీ; ఎరుపు రంగు మూత ఉంటే అవి కార్బొనేటెడ్ నీళ్లు అనీ తెలుసుకోవచ్చు. గులాబీ రంగు మూత ఉంటే అది నీటిని గురించి తెలియజేసేది కాదు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు రొమ్ము క్యాన్సర్ గురించి అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినది.

మేకప్

మదర్స్ డే మేకప్

మదర్స్ డే నాడు మనోహరంగా కనిపించాలంటే 30 ఏళ్లు పైబడిన తర్వాత ముఖంలో ప్రతిఫలించే గీతలు, మచ్చలను మేకప్‌తో దాచేయాలి. తోటి తల్లులందరిలో మెరుపులీనుతూ కనిపించడం కోసం... ఇవిగో ఈ ప్రాథమిక మేకప్ చిట్కాలు పాటించండి.

హైడ్రేషన్ కోసం: వేసుకునే మేకప్ ముఖం మీద సమంగా పరుచుకోవడం కోసం ముందుగా చర్మాన్ని సిద్ధం చేయాలి. అందుకోసం ఫేసియల్ సీరమ్‌ను ముఖం మీద అద్దుకోవాలి. ఈ సీరం జిడ్డుగా ఉండకుండా చర్మానికి తేమతో పాటు, సన్‌స్క్రీన్ రక్షణ కూడా అందించేలా ఉండాలి. ఈ సీరమ్ చర్మంలో చక్కగా ఇంకిపోయిన తర్వాతే మేకప్ మొదలుపెట్టాలి.

ద్రవరూప ఫౌండేషన్: ముఖం మీద ఉండే సన్నని గీతల్లో ఇరుక్కుపోయి ఎబ్బెట్టుగా కనిపించకుండా ఉండాలంటే తేలికపాటి ద్రవరూప ఫౌండేషన్ ఎంచుకోవాలి. ఈ రకమైన ఫౌండేషన్ చర్మం మీద పలుచగా పొరలా ఏర్పడి ఆ తర్వాత వేసుకోబోయే కాంపాక్ట్, బ్లష్‌లకు అనువుగా ఉంటుంది. అయితే ఫౌండేషన్‌ను నేరుగా అప్లై చేసుకోకుండా, మొదట ముఖమంతా అక్కడక్కడా చుక్కలుగా అద్దుకుని, ఆ తర్వాత స్పాంజ్‌తో ముఖమంతా పరుచుకునేలా చేయాలి

తడిపిన స్పాంజ్‌తో: ఫౌండేషన్, కన్‌సీలర్‌ల కోసం తడిపి పిండిన మేకప్ స్పాంజ్ వాడుకోవాలి. ఈ పద్ధతితో మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. మరింత సహజసిద్ధంగా కనిపిస్తుంది. అయితే స్పాంజి తేమగా ఉండాలే తప్ప నీరు కారుతూ ఉండకూడదు. అందుకోసం స్పాంజిని గోరువెచ్చని నీటి ధార కింద ఉంచి, గట్టిగా పిండేయాలి.

ద్రవరూప బ్లష్: బ్లష్‌తో అందం రెట్టింపవుతుంది. అయితే అందుకోసం సరైన రంగులను ఎంచుకోవాలి. ముదురు రంగు బ్లష్‌లు, మరీ మెత్తని పౌడర్ రూపంలో ఉండే బ్లష్‌లు ఎబ్బెట్టుగా కనిపిస్తూ, చర్మపు గీతల్లో ఇరుక్కుపోతాయి. కాబట్టి పౌడర్ బ్లష్‌లకు బదులుగా ద్రవరూప బ్లష్‌లు ఎంచుకోవాలి. వీటిని కూడా తడిపి పిండిన స్పాంజి తోనే అద్దుకోవాలి.



తులసి ప్రయోజనాలెన్నో!

తులసి మొక్కను మనం పవిత్రంగా భావిస్తాం. దానిని అనునిత్యం పూజిస్తాం. అలాంటి తులసిలో విటవిఎన్-ఎ, యాంటీ ఆక్సిడెంట్లు తాంటివి పుష్కలంగా ఉంటాయి. అందుకే తులసి ఆకులను తినడం, తులసి కషాయం, తులసి టీ తాగడం... ఇలా ఏదో ఒక రూపంలో తులసిని తీసుకోవడం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవేమిటో తెలుసుకుందాం.



- ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున తులసి ఆకులను తినడం వల్ల చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.
- తులసి కషాయం తాగడం వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.
- తులసి ఆకులు తినడం వల్ల గుండె ఆరోగ్యంతో పాటు జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

సెలబ్ ఫిట్

నవయవ్వన సోయగం

తారాజువ్వలా వెండితెర మీదకు దూసుకువచ్చింది. సల్మాన్ లాంటి స్టార్ల సరసన అందంగా ఒదిగిపోయింది. నవయవ్వన కాంతితో యువతరం హృదయ స్పందనై వెలిగింది. పరిశ్రమలోకి వచ్చి పదిహేనేళ్లు దాటినా... నేటికీ అదే మైమరిపించే రూపు... చూపు తిప్పుకోనివ్వని నాజూకు... జాక్వెలిన్ ఫెర్నాండెజ్.



స్వదేశం శ్రీలంక. పుట్టింది బహ్రైన్‌లో. డిగ్రీ... ఆస్ట్రేలియాలోని సిడ్నీ విశ్వవిద్యాలయంలో. ఆమె తండ్రి ఎల్రాయ్ ఫెర్నాండెజ్‌ది శ్రీలంక. తల్లి కిమ్‌ది మలేషియా, కెనడా మూలాలున్న కుటుంబం. శ్రీలంకలో సింహళీస్, తమిళుల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంతో జాక్వెలిన్ తండ్రి దేశం వదిలి బహ్రైన్‌కు వెళ్లి స్థిరపడ్డారు. అక్కడ ఎయిర్‌హోస్టెస్‌గా పని చేస్తున్న కిమ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పెరిగిన జాక్వెలిన్‌కు అక్క, ఇద్దరు అన్నలు. సిడ్నీ వర్సిటీ నుంచి మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పట్టా పొందిన ఆమె... కొంత కాలం టీవీ రిపోర్టర్‌గా పని చేసింది. గ్లామర్ ప్రపంచంలోకి రావాలన్న ఆసక్తితో మోడలింగ్ మొదలుపెట్టింది. 2006లో 'మిస్ యూనివర్స్ శ్రీలంక' కిరీటాన్ని దక్కించుకుని, తన దేశం నుంచి 'మిస్ యూనివర్స్'కు పోటీపడింది.

అలా వచ్చి...

మూడేళ్ల తరువాత ఓ మోడలింగ్ ప్రాజెక్ట్ కోసం భారత్‌కు వచ్చిన జాక్వెలిన్... అదే సమయంలో నిర్వహించిన 'అలాదిన్' చిత్రం ఆడిషన్స్‌కు వెళ్లింది. దర్శకుడు సుజోయ్ ఘోష్‌ను ఆమె రూపం ఆకట్టుకుంది. ఇక అప్పటి నుంచి జాక్వెలిన్‌కు భారత్ మరో ఇల్లు అయింది. అలా 2009లో నటిగా తొలి అడుగు వేసిన జాక్వెలిన్... మహేష్‌భట్ 'మర్డర్2'తో మొదటి హిట్ అందుకుంది. సల్మాన్‌ఖాన్ సరసన తెలుగు చిత్రం 'కిక్' రీమేక్‌లో నటించింది. ఆమె కెరీర్‌లోనే భారీ కలెక్షన్లు రాబట్టిన సినిమా అది. తెలుగు, కన్నడల్లో పలు ప్రత్యేక గీతాల్లో మెరిసిన జాక్వెలిన్... ఈ పదిహేనేళ్లలో 35కు పైగా చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం ఆమె చేతులో రెండు ప్రాజెక్టులు ఉన్నాయి. నటి కావాలన్నది చిన్ననాటి కోరిక. హాలీవుడ్ తారగా వెలిగిపోవాలని కలలు కనేదట. జయాపజయాలతో సంబంధం లేకుండా దూసుకుపోతున్న ఆమె జీవితాన్ని 2021లో మనీ లాండరింగ్ కేసు కుదిపేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సుఖేష్ చంద్రశేఖర్ నుంచి ఖరీదైన బహుమతులు అందుకుందన్నది జాక్వెలిన్‌పై ఆరోపణ. ఇది ఆమె కెరీర్‌నే కాదు, జీవితాన్ని కూడా ఎంతో ప్రభావితం చేసింది. కానీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా తిరిగి నిలబడేందుకు ప్రయత్నిస్తోంది. ఇలాంటి ఒత్తిడుల నుంచి తనను రక్షిస్తున్నది, ఆరోగ్యంగా ఉంచుతున్నది ఫిట్‌నెస్ అంటుంది జాక్వెలిన్.

- తెల్లవారుజామును ఐదు గంటలకే జాక్వెలిన్ దినచర్య మొదలవుతుంది.
- ఉదయం లేవగానే తేనె, నిమ్మ రసం కలిపిన గ్లాసుడు గోరువెచ్చని నీరు
- బ్రేక్‌ఫాస్ట్‌లో ఉడకబెట్టిన గుడ్లు, తాజా పండ్లు, గ్రీన్ టీ.
- మధ్యాహ్న భోజనంలో పప్పుతో బ్రౌన్ రైస్, వెజిటబుల్, ఫ్రూట్ సలాడ్‌లు. వీటితోపాటు పిండి, పీచు పదార్థాలు, పోషక విలువలు పుష్కలంగా ఉండే క్వినోవా ఆమె మెనూలో తప్పనిసరి.
- అలాగే సలాడ్‌లు, వంటల్లో రెడ్, యల్లో క్యాప్సికమ్, చిలకడదుంపలు చేరతాయి.
- ఇంటర్మిటెన్ ఫాస్టింగ్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. తీపి పదార్థాలకు దూరంగా ఉంటుంది.
- రాత్రిపూట తేలికపాటి భోజనం. సాధ్యమైనంతవరకు రాత్రి ఏడు గంటలకల్లా డిన్నర్ ముగిస్తుంది.



ఆదివారమూ విరామం లేదు...

ఇతర తారలకు భిన్నంగా... జాక్వెలిన్ రోజూ కంటే ఆదివారం వ్యాయామాల కోసం మరింత ఎక్కువ సమయం కేటాయిస్తుందిట. "యోగా, వెయిట్ ట్రైనింగ్, డ్యాన్స్‌లు కలగలిపి ఆదివారం నా వర్కవుట్ రెండు నుంచి మూడు గంటలపాటు తీవ్రంగా సాగుతుంది. కొంతమంది అంటుంటారు... 'నాక్కూడా నీలాంటి దృఢమైన ఆకృతి కావాల'ని. ఇది ఒక్క రోజులో వచ్చింది కాదు. కొన్నేళ్లుగా ఇదే రూపాన్ని కాపాడుకొంటూ వస్తున్నా. క్రమం తప్పని ఆహార నియమాలు పాటిస్తున్నా. నా రూపు అథ్లెట్లను తలపించాలని కోరుకొంటాను. ఎప్పుడూ దృఢంగా, ఉల్లాసంగా, చురుగ్గా ఉండటానికి ప్రయత్నిస్తాను. అవసరమైనప్పుడు కావల్సినంత విశ్రాంతి తీసుకొంటాను" అంటున్న ఈ ముద్దుగుమ్మ తరచూ తన ఫిట్‌నెస్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి, అభిమానులకు ప్రేరణ కలిగిస్తుంటుంది. ఇన్‌స్టాలో ఏడు కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారంటే ఆమె క్రేజ్ ఏస్థాయిలో ఉందో వేరే చెప్పనక్కర్లేదు.

- జాక్వెలిన్ వ్యాయామాల్లో ప్రధానంగా యోగ ఉంటుంది.
- ఉదయం లేవగానే జాగింగ్, రన్నింగ్‌తో కూడిన కార్డియో తరువాత యోగా, పిలెట్స్, స్ట్రెంత్ ట్రైనింగ్
- రోజూ ఒకటే రకం వర్కవుట్స్‌తో ఆసక్తి తగ్గుతుంది. అందుకని తనను తాను ఉత్సాహపరుచుకోవడానికి ఎప్పటికప్పుడు కొత్త కొత్త లక్ష్యాలు నిర్దేశించుకొంటుంది.
- వ్యాయామాలను ఉత్సాహభరితంగా మార్చేందుకు పోల్‌డ్యాన్స్, ఏరియల్ సిల్క్ ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంది. పోల్ డ్యాన్స్ తనలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా నింపిందో, శరీరాన్ని మరింత దృఢంగా ఎలా మార్చిందో వివరిస్తూ ఆ మధ్య ఇన్‌స్టాలో ఒకపోస్టు పెట్టింది జాక్వెలిన్.

కాకర చేదు తగ్గాలంటే!

కాకరకాయలో ఎన్నో పోషకగుణాలు ఉన్నాయి. కానీ చేదుగా ఉంటుందని చాలామంది దానితో చేసే వంటలను ఇష్టపడరు. అయితే చిన్న చిన్న చిట్కాలు పాటించి కాకరకాయ చేదును తగ్గించవచ్చు. అవేంటో తెలుసుకుందాం!



- కాకరకాయపైన ఉండే గరుకు భాగాన్ని తొలగించేయాలి. దీని వల్ల సగం చేదు తగ్గుతుంది.
- కాకరకాయ ముక్కలకు ఉప్పు రాసి 20-30 నిమిషాల ఉంచి తరువాత ఆ ముక్కలను నీళ్లతో మూడు నాలుగు సార్లు శుభ్రంగా కడగాలి. దీని వల్ల చేదు కూడా తగ్గుతుంది.
- వేడి నీటిలో ఉప్పు వేసి అందులో కాకరముక్కలను నానబెట్టినా చేదును తగ్గించవచ్చు.
- కాకరకాయలో విత్తనాలు తీసివేయడం వల్ల కూడా చేదు తగ్గుతుంది.
- కాకర ముక్కలకు పెరుగు రాసి గంటసేపు పక్కన పెడితే చేదు చాలావరకూ తగ్గిపోతుంది.

స్పోర్ట్స్

మేమంతా మీ వెంటే...

త్రివిధ దళాలకు క్రీడాలోకం సెల్యూట్

న్యూఢిల్లీ: దేశం కోసం పోరాడుతున్న త్రివిధ దళాలకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. పోరాట యోధులకు యావత్ క్రీడాలోకం సెల్యూట్ కొడుతోంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, నీరజ్ చోప్రా, పీవీ సింధు తదితరులు సైనికులను ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

- దేశ రక్షణ కోసం సైన్యం తీసుకొనే ఏనిర్ణయాన్నైనా స్వాగతిస్తా. దేశ గౌరవాన్ని నిలబెట్టడడం కోసం మన యోధులు ముందుండి పోరాడుతున్నారు. ఈ సమయంలో ప్రతి భారతీయుడు బాధ్యతాయుతంగా మెలగాలి. తప్పుడు వార్తలను వ్యాప్తి చేయొద్దు. జైహింద్. - రోహిత్ శర్మ
- క్లిష్ట సమయాల్లో దేశాన్ని కాపాడుతున్న భద్రతా దళాలకు నా సెల్యూట్. వారి త్యాగాలకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. - విరాట్ కోహ్లీ
- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం కోసం పోరాడుతున్న ఆర్మీని చూసి గర్విస్తున్నాం. మనవంతుగా వారి సూచనలు పాటిస్తూ.. అందరం సురక్షితంగా ఉందాం. - నీరజ్ చోప్రా
- మీ ధైర్యం, క్రమశిక్షణ, త్యాగనిరతే మన దేశ ఆత్మ. మీ నిస్వార్థసేవను ఎప్పుడూ గుర్తు చేసుకొంటాం. దేశం మొత్తం మీవెనుకే. జైహింద్. - పీవీ సింధు
- యుద్ధాన్ని పాక్ కోరుకొంది. ఉగ్ర వనరులను కాపాడుకోవడానికి పాక్ ఉద్రిక్తతలు పెంచింది. వారి వాచాలత్వానికి మన బలగాలు ఎప్పటికీ మరచిపోలేని విధంగా గుణపాఠం చెప్పాయి. - వీరేంద్ర సెహ్వాగ్

టైటిల్ చేరువలో ఉన్నతి

తైపీ ఓపెన్ సెమీస్‌కు ఆయుష్


ఉన్నతి

తైపీ: భారత యువ షట్లర్లు ఆయుష్ శెట్టి, ఉన్నతి హుడా తైపీ ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో సింగిల్స్‌లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల క్వార్టర్‌ఫైనల్లో 20 ఏళ్ల ఆయుష్ 16-21, 21-19తో ఏడోసీడ్ బ్రియాన్ యాంగ్ (కెనడా)పై, మహిళల క్వార్టర్స్‌లో 17 ఏళ్ల ఉన్నతి 21-8, 19-21, 21-19తో స్థానిక షట్లర్ హంగ్ యి తింగ్‌పై గెలిచారు. ఫైనల్లో బెర్త్ కోసం టాప్‌సీడ్ టొమొక మియాజాకి (జపాన్)తో ఉన్నతి, టాప్‌సీడ్ చో తిన్ చెన్ (తైపీ)తో ఆయుష్ తలపడతారు

వినోదానికి విరామం

వారం పాటు ఐపీఎల్ వాయిదా

దేశ భద్రతే ముఖ్యమన్న బీసీసీఐ



న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. తాజా ఐపీఎల్ 18వ సీజన్‌ను వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. ఇరు దేశ సరిహద్దుల దగ్గర భీకర దాడులు సాగుతుండడంతో ఆటగాళ్ల భద్రత ముఖ్యమని బోర్డు భావిస్తోంది. గురువారం ధర్మశాల వేదికలో పంజాబ్-ఢిల్లీ జట్ల మధ్య మ్యాచ్‌ను అర్ధంతరంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. పొరుగు నగరాలపై పాక్ డ్రోన్ దాడులకు తెగబడడంతో ముందు జాగ్రత్తగా బ్లాక్‌అవుట్ ప్రకటించగా, స్టేడియంలోని ఫ్లడ్‌లైట్లు ఆగిపోయాయి. ఆ తర్వాత ఆటగాళ్లతో పాటు ప్రేక్షకులు కూడా మైదానం వీడాల్సి వచ్చింది. అదేరోజు బీసీసీఐ ఉన్నతాధికారులు సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. తిరిగి శుక్రవారం ఉదయం చైర్మన్ అరుణ్ ధూమల్ నేతృత్వంలో జరిగిన ఐపీఎల్ పాలకమండలి అత్యవసర భేటీలో లీగ్ వాయిదా నిర్ణయాన్ని తీసుకోవడం జరిగింది. 'ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని ఫ్రాంచైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. అందుకే ఈ విషయమై ఐపీఎల్ పాలకమండలిలో సుదీర్ఘంగా చర్చించాం. అలాగే ప్రసారకర్తలు, స్పాన్సరర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. వెంటనే వారం రోజుల పాటు ఐపీఎల్‌ను వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఇది కష్టసమయం. అందుకే దేశ ప్రయోజనాలకు బీసీసీఐ పూర్తి మద్దతు ప్రకటిస్తోంది. సాయుధ బలగాల ధైర్యం, నిస్వార్థ సేవకు మా సెల్యూట్' అని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నాడు. కొత్త షెడ్యూల్, వేదికలను సంబంధిత అధికారులు, ఫ్రాంచైజీలతో సంప్రదించాక, అప్పటి పరిస్థితులను అంచనా వేశాక ప్రకటిస్తామని చెప్పాడు. వాస్తవానికి ఈనెల 25న కోల్‌కతాలో జరిగే ఫైనల్‌తో ఐపీఎల్ ముగియాల్సి ఉండేది.

వారం తర్వాత జరిగేనా?

వాస్తవానికి ఐపీఎల్‌ను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు కథనాలు వచ్చాయి. కానీ కాసేపటికే వారంరోజుల వరకే అంటూ బోర్డు అధికారికంగా ప్రకటించింది. అయితే ఆ తర్వాతైనా మ్యాచ్‌లు జరుగుతాయా? అంటే సందేహమే. ఎందుకంటే విదేశీ ఆటగాళ్లు తిరిగి భారత్‌లో అడుగుపెట్టేందుకు వెనుకడుగు వేయవచ్చు. ఈ ఐపీఎల్‌లో ఇప్పటిదాకా లీగ్ దశలో 58 మ్యాచ్‌లు జరిగాయి. ఇంకా 16 మ్యాచ్ (12 లీగ్+4 నాకౌట్)లు మిగిలున్నాయి. వీటిని ఎలా షెడ్యూల్ చేస్తారనే సందేహం కూడా వ్యక్తమవుతోంది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పూర్తిగా సద్దుమణిగేదాకా మ్యాచ్‌లు జరగకపోవచ్చు. షెడ్యూల్ ప్రకారం మే 25న లీగ్ ఫైనల్ ముగిసిన వెంటనే టీమిండియా.. జూన్‌లో జరిగే 5 టెస్టుల కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లాలి. ఆ సిరీస్‌ను మార్చే వీలుండదు కాబట్టి ఆ తర్వాతే.. అంటే ఆగస్టులోనే మిగిలిన లీగ్ మ్యాచ్‌లను నిర్వహించవచ్చు. కానీ ఆ నెలలో ది హండ్రెడ్, కరీబియన్ ప్రీమియర్ లీగ్, ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా సిరీస్‌లున్నాయి. దీంతో విదేశీ ఆటగాళ్లకు ఇబ్బంది. ఇక సెప్టెంబరులో భారత్‌లో ఆసియా కప్ జరగాల్సి ఉన్నా.. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ టోర్నీ జరగకపోవచ్చు. కాబట్టి సెప్టెంబరులో ఐపీఎల్ మిగతా మ్యాచ్‌లను నిర్వహించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అప్పుడు కేవలం ఇంగ్లండ్-దక్షిణాఫ్రికా మధ్య పరిమిత ఓవర్ల సిరీస్ ఉంటుంది. ఐపీఎల్ కోసం ఆటగాళ్ల విడుదలపై బీసీసీఐ చర్చలు జరపవచ్చు.

ప్రత్యేక 'వందే భారత్' రైలులో ఢిల్లీకి..



ధర్మశాల విమానాశ్రయం మూసివేతతో అక్కడి నుంచి పంజాబ్, ఢిల్లీ జట్ల ఆటగాళ్ల తరలింపు మొదట సమస్యగా మారింది. చివరకు ప్రత్యేక రైలులో వీరందరినీ న్యూఢిల్లీకి పంపాలని నిర్ణయించారు. దీంతో శుక్రవారం ఉదయం ధర్మశాల నుంచి 40-50 వరకు చిన్నపాటి వాహనాల్లో ఆటగాళ్లు, కోచింగ్ స్టాఫ్, బ్రాడ్‌కాస్ట్ సిబ్బందిని కట్టుదిట్టమైన భద్రత మధ్య హోషియార్పూర్‌కు తరలించారు. అక్కడినుంచి జలంధర్ చేరాక.. ప్రత్యేక 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' రైలులో ప్రయాణించి అందరూ ఢిల్లీ చేరుకున్నారు.

భారత్‌ను వీడనున్న విదేశీ క్రికెటర్లు

భారత్-పాక్ మధ్య యుద్ధం సాగుతుండడంతో ఐపీఎల్, పీఎస్ఎల్‌లోని తమ ఆటగాళ్ల భద్రతపై దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ఆటగాళ్ల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈమేరకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులకు లేఖలు రాశాయి. ఇక ఐపీఎల్ వాయిదా పడడంతో ఫారిన్ ప్లేయర్లు తమ స్వదేశాలకు వెళ్లనున్నారు. ఇందుకు బీసీసీఐ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుత పరిణామాలతో వారు కాస్త ఆందోళనగా ఉన్నట్టు ఓ ఫ్రాంచైజీ అధికారి తెలిపాడు. మరోవైపు స్వదేశీ ఆటగాళ్లు కూడా తమ స్వస్థలాలకు వెళ్లారు.

సెమీస్‌లో దీపిక, సుశాంత్

ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-2

షాంఘై: ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-2 పోటీల్లో భారత సీనియర్ దీపికా కుమారి, పార్థ్ సుశాంత్ సాలుంఖే రికర్వ్ ఈవెంట్ వ్యక్తిగత విభాగాల్లో సెమీఫైనల్స్‌కు చేరారు. మహిళల క్వార్టర్స్‌లో దీపిక 6-4తో విక్టోరియా సెబాస్టియన్ (ఫ్రాన్స్)పై, పురుషుల్లో పార్థ్ సుశాంత్ 6-2తో కిమ్ డే జోంగ్ (కొరియా)పై నెగ్గారు. ఇక, కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ సెమీస్‌లో భారత ద్వయం మధుర/అభిషేక్ వర్మ 156-158తో బ్రిటన్ జోడీ చేతిలో ఓడింది. దీంతో భారత జంట కాంస్య పతక కోసం మలేసియా జోడీతో తలపడనుంది.

టికెట్ డబ్బులు వాపస్

ఐపీఎల్ అర్ధంతరంగా వాయిదా పడిన నేపథ్యంలో.. ఇప్పటికే కొన్ని మ్యాచ్‌లకు టిక్కెట్లు కొనుగోలు చేసిన అభిమానులకు ఫ్రాంచైజీలు డబ్బులను తిరిగి చెల్లిస్తున్నాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం బెంగళూరులో లఖ్‌నవూ, బెంగళూరు.. శనివారం హైదరాబాద్‌లో సన్‌రైజర్స్, కోల్‌కతా జట్ల మధ్య మ్యాచ్‌లు జరగాల్సింది. కానీ, ఐపీఎల్ వాయిదాతో ఇప్పటికే టిక్కెట్లు బుక్ చేసుకున్న వాళ్లకు రీఫండ్ చేయనున్నట్టు సన్‌రైజర్స్ యాజమాన్యం ప్రకటించింది.

పాక్‌కు యూఏఈ షాక్!

మ్యాచ్‌ల ఆతిథ్యానికి నో?

పీఎస్ఎల్‌ను వాయిదా వేసిన పీసీబీ

దుబాయ్: భారత్‌తో యుద్ధం ప్రభావం పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)పైనా పడింది. స్వదేశీ, విదేశీ క్రికెటర్లు పోటీపడుతున్న ఈ లీగ్‌ను ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్టు పాక్ క్రికెట్ బోర్డు శుక్రవారం రాత్రి ప్రకటించింది. దేశ ప్రధాని షాబాజ్ షరీఫ్ ఆదేశాల మేరకు పీఎస్ఎల్‌ను వాయిదా వేయాలని నిర్ణయించుకున్నామని పీసీబీ తెలిపింది. అయితే, అంతకుముందు ఉదయం.. లీగ్‌లో మిగిలిన మ్యాచ్‌లను యూఏఈలో నిర్వహించనున్నట్టు పీసీబీ వెల్లడించింది. కానీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా విదేశీ క్రికెటర్లు లీగ్‌లో కొనసాగేందుకు విముఖత చూపడం, స్వదేశాలకు తరలించాలని కోరడంతో వాయిదా నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మరోవైపు, పీఎస్ఎల్ మ్యాచ్‌ల ఆతిథ్యానికి యూఏఈ క్రికెట్ బోర్డు (ఈసీబీ) కూడా విముఖత వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. యూఏఈలో ఇండో-పాక్ క్రికెట్ అభిమానులు భారీ సంఖ్యలో ఉంటారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పీఎస్ఎల్‌ను నిర్వహిస్తే ఫ్యాన్స్ మధ్య ఘర్షణలు, శాంతి భద్రతల సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని ఈసీబీ భావిస్తోందట. పైగా బీసీసీఐతో ఈసీబీకి బలమైన సంబంధాలు ఉండడంతో.. పీఎస్ఎల్‌కు నో చెప్పాలని అనుకొంటుందని సమాచారం.

'నీరజ్ చోప్రా క్లాసిక్' ఈవెంట్ వాయిదా



న్యూఢిల్లీ: దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో స్టార్ జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ మాజీ చాంపియన్ నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్ నిరవధికంగా వాయిదా పడింది. స్వయంగా నీరజ్ నిర్వహిస్తున్న ఈ జావెలిన్ త్రో మెగా ఈవెంట్ షెడ్యూల్ ప్రకారం ఈనెల 24న బెంగళూరు జరగాల్సి ఉంది. అయితే, ప్రస్తుత పరిణామాల దృష్ట్యా టోర్నీని కొన్నిరోజుల పాటు వాయిదా వేస్తున్నట్టు నీరజ్ సోషల్ మీడియాలో వెల్లడించాడు. ఈవెంట్‌ను ఎప్పుడు నిర్వహిస్తామన్నది త్వరలోనే వెల్లడిస్తామన్నాడు.

గోవాకు కాదు.. ముంబైకే ఆడతా

జైస్వాల్ యూటర్న్



ముంబై: యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ మనసు మార్చుకున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో ఇక గోవాకు ఆడబోతున్నట్టు గత నెలలో అతడు సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇంతలోనే ఏమైందో కానీ తిరిగి పాత జట్టు ముంబై తరఫున బరిలోకి దిగాలనుకుంటున్నట్టు శుక్రవారం ప్రకటించాడు. అంతేకాకుండా నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) కోసం రాసిన లేఖను కూడా వెనక్కి తీసుకున్నాడు. 'వచ్చే దేశవాళీ సీజన్‌లో గోవాకు ఆడాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నా. అందుకే ఇక నుంచి నన్ను ముంబై క్రికెటర్‌గానే పరిగణించాలని ఎంసీఏను కోరుతున్నా. ఇప్పటివరకైతే బీసీసీఐకి, గోవా క్రికెట్ సంఘానికి గానీ ఎన్‌ఓసీని సమర్పించలేదు' అని జైస్వాల్ పేర్కొన్నాడు. గత సీజన్‌లో ముంబై కెప్టెన్ రహానెతో విభేదాల నేపథ్యంలో జైస్వాల్ జట్టు మారాలని భావించినట్టు కథనాలు వచ్చాయి.

బాంబులు పడతాయేమోనని..



న్యూఢిల్లీ: ఇండో-పాక్ సరిహద్దు ఉద్రిక్తతలతో ధర్మశాలలో గురువారం పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను అర్ధంతరంగా మధ్యలోనే నిలిపివేశారు. దీంతో స్టేడియం భద్రతా సిబ్బంది సూచనతో ఆటగాళ్లు, ప్రేక్షకులు సహా అంతా స్టేడియం నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఓ జట్టు చీర్‌గాళ్ తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ఇక్కడంతా భయంగా ఉంది. మ్యాచ్ మధ్యలోనే అందరినీ పంపించివేశారు. చాలామంది.. బాంబులు పడతాయేమోనని అరుచుకుంటూ వెళ్లిపోయారు. అయినా, నేను ఏడవడం లేదు. కానీ, షాక్‌లో ఉన్నా. అయితే, భద్రతపరంగా ఐపీఎల్ ప్రతినిధులు సరైన చర్యలే తీసుకున్నారు' అని ఆ వీడియోలో చీర్‌గాళ్ వ్యాఖ్యలు చేసింది.

బిజినెస్

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,587 కోట్లు

క్యూ4లో 21 శాతం వృద్ధి

ఒక్కో షేరుకు రూ.8 డివిడెండ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 21 శాతం వృద్ధి చెంది రూ.1,587 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.1,307 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా 20 శాతం వృద్ధితో రూ.7,083 కోట్ల నుంచి రూ.8,506 కోట్లకు చేరుకుంది. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.32,553.50 కోట్ల ఆదాయంపై రూ.5,655 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

మార్చి త్రైమాసికంలో కంపెనీ వ్యాపారాలు రెండంకెల వృద్ధిని నమోదు చేయటంతో అమ్మకాలు, లాభాలు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయని డాక్టర్ రెడ్డీస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌ఓ) ఎంవీ నరసింహం చెప్పారు. కొత్త ఉత్పత్తుల విడుదల, అమెరికా మార్కెట్లో కీలక ఉత్పత్తుల నుంచి రెవెన్యూలు పెరగటం సహా కొనుగోలు చేసిన నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్‌ఆర్‌టీ) వ్యాపారాన్ని ఇంటిగ్రేట్ చేయటం కూడా ఎంతగానో కలిసి వచ్చిందని ఆయన తెలిపారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.8 తుది డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

అమెరికా ఆదాయంలో 9 శాతం వృద్ధి

మార్చి త్రైమాసికంలో అమెరికా రెవెన్యూ 9 శాతం వృద్ధి చెంది రూ.3,560 కోట్లుగా ఉన్నట్టు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి అమెరికా ఆదాయం 12 శాతం వృద్ధితో రూ.14,520 కోట్లకు చేరుకున్నట్లు కంపెనీ పేర్కొంది. అమెరికా మార్కెట్లోకి కొత్త ఔషధాలను విడుదల చేయటంతో ఆదాయాలు గణనీయంగా పెరిగాయని తెలిపింది. క్యూ4లో 7 ఔషధాలను విడుదల చేయగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 18 ఔషధాలను విడుదల చేసినట్లు నరసింహం తెలిపారు. కాగా క్యూ4లో యూరప్ మార్కెట్ ఆదాయం 145 శాతం పెరగగా, భారత్, వర్ధమాన దేశాల ఆదాయం 16 శాతం చొప్పున పెరిగాయని పేర్కొంది.

అవసరమైతే కంపెనీలను కొంటాం: ఫార్మా దిగుమతులపై అమెరికా సుంకాల నేపథ్యంలో అక్కడి మార్కెట్లో తయారీని చేపట్టేందుకు కంపెనీలను కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు డాక్టర్ రెడ్డీస్ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ తెలిపారు. కంపెనీకి అమెరికా ఎంతో కీలకమైన మార్కెట్ అని, అక్కడి కస్టమర్లతో ఈ విషయంపై కలిసి పని చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టారిఫ్‌ల భారం తగ్గించుకునేందుకు భారత్ నుంచి అమెరికాకు ప్లాంట్లను తరలించే యోచనేదీ లేదని ఎరెజ్ స్పష్టం చేశారు.

ఎస్ఎంబీసీకి యెస్ బ్యాంక్‌లో 20% వాటా

ఎస్‌బీఐ సహా 8 బ్యాంకుల నుంచి రూ.13,483 కోట్లకు కొనుగోలు

దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇదే అతిపెద్ద విదేశీ పెట్టుబడి

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ యెస్ బ్యాంక్‌లో 20 శాతం వాటాను జపాన్‌కు చెందిన సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ) రూ.13,483 కోట్లకు కొనుగోలు చేసింది. దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇప్పటివరకిదే అతిపెద్ద విదేశీ పెట్టుబడి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ సహా 8 బ్యాంకులు కలిసి యెస్ బ్యాంక్‌లోని తమ వాటాలను ఎస్ఎంబీసీకి విక్రయించాయి. అందులో ఎస్‌బీఐ 13.19 శాతం వాటాను రూ.8,889 కోట్లకు విక్రయించగా.. యాక్సిస్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లు కలిసి మొత్తం 6.81 శాతం వాటాను రూ.4,594 కోట్లకు విక్రయించాయి. ఈ డీల్ పూర్తయిన తర్వాత యెస్ బ్యాంక్‌లో ఎస్ఎంబీసీ అతిపెద్ద వాటాదారుగా అవతరించనుంది. ఆర్‌బీఐ, సీసీఐ వంటి నియంత్రణ మండళ్లతో పాటు చట్టపరమైన అనుమతులకు లోబడి ఈ ఒప్పందం పూర్తి కానుంది. ఇందుకు ఏడాది పట్టవచ్చని ఎస్‌బీఐ పేర్కొంది. ఎస్ఎంబీసీ వాటా కొనుగోలు వార్తల నేపథ్యంలో యెస్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 9.77 శాతం ఎగబాకి రూ.20 వద్ద ముగిసింది.

2020లో యెస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐ పెట్టుబడులు

ఆర్థికంగా దివాలా తీసిన యెస్ బ్యాంక్‌ను తిరిగి నిలబెట్టేందుకు 2020 మార్చిలో ఆర్‌బీఐ పునర్నిర్మాణ ప్రణాళికను ప్రకటించింది. అందులో భాగంగా ఎస్‌బీఐ సహా 8 బ్యాంకులు కలిసి యెస్ బ్యాంక్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా వాటాలు దక్కించుకున్నాయి. ఈ మార్చి 31 నాటికి యెస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐ 23.97 శాతం వాటా కలిగి ఉండగా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.75 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 2.39 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.21 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.01 శాతం, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ 0.92 శాతం, ఫెడరల్ బ్యాంక్ 0.76 శాతం, బంధన్ బ్యాంక్ 0.70 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఎస్ఎంబీసీకి 13.19 శాతం వాటా విక్రయ అనంతరం యెస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐ 10.78 శాతం వాటా కలిగి ఉండనుంది.



మళ్లీ వృద్ధి పథంలోకి..

ఎస్‌బీఐ సహా ఇతర బ్యాంకులు పెట్టుబడులతో ఆదుకోవడంతో యెస్ బ్యాంక్ వేగంగా కోలుకుని మళ్లీ వృద్ధి పథంలోకి అడుగు పెట్టింది. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ స్టాండ్‌ఎలోన్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 63 శాతం వృద్ధితో రూ.738 కోట్లకు చేరుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ రూ.2,406 కోట్ల లాభం ప్రకటించింది. 2023-24తో పోలిస్తే లాభం దాదాపు రెట్టింపైంది.

జపాన్‌లో రెండో అతిపెద్ద బ్యాంక్ ఎస్ఎంబీసీ

సుమిటోమో మిత్సుయి ఫైనాన్షియల్ గ్రూప్ (ఎస్ఎంఎఫ్‌జీ) పూర్తి అనుబంధ విభాగమే ఎస్ఎంబీసీ. గత ఏడాది చివరి నాటికి 2 లక్షల కోట్ల డాలర్ల (రూ.170 లక్షల కోట్ల పైమాటే) ఆస్తులు కలిగిన ఎస్ఎంఎఫ్‌జీ.. జపాన్‌లో రెండో అతిపెద్ద బ్యాంకింగ్ గ్రూప్‌గా కొనసాగుతోంది. కాగా, దేశంలోని అగ్రగామి విదేశీ బ్యాంక్‌ల్లో ఎస్ఎంబీసీ ఒకటి. అంతే కాదు, ఎస్ఎంఎఫ్‌జీ పూర్తి అనుబంధ విభాగమైన ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ దేశంలోని అతిపెద్ద ఎన్‌బీఎఫ్‌సీల్లో ఒకటి కూడా.

అమ్మకాలు కంటిన్యూ..

- సెన్సెక్స్ 880 పాయింట్లు డౌన్
- 2 రోజుల్లో రూ.7 లక్షల కోట్లు ఉఫ్

ముంబై: భారత్-పాకిస్థాన్ మధ్య పోరు తీవ్రతరమవడంతో అప్రమత్తమైన ఈక్విటీ మదుపరులు వరుసగా రెండో రోజూ అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో మన స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం ఒక శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ 880.34 పాయింట్లు కోల్పోయి 79,454.47 స్థాయికి జారుకుంది. నిఫ్టీ 265.80 పాయింట్లు క్షీణించి 24,008 వద్ద స్థిరపడింది. గడిచిన రెండు సెషన్లలో సెన్సెక్స్ 1,292.31 పాయింట్లు (1.60 శాతం) నష్టపోగా.. ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.09 లక్షల కోట్లు తగ్గి రూ.416.40 లక్షల కోట్లకు (4.86 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 26 నష్టపోయాయి.

రక్షణ రంగ షేర్లు జూమ్: పాక్‌తో పోరు నేపథ్యంలో దేశీయ రక్షణ రంగానికి చెందిన ముఖ్యంగా డ్రోన్ కంపెనీల షేర్లు భారీగా లాభపడ్డాయి. బీఎస్ఈలో పారస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీ స్టాక్ 7.18 శాతం పుంజుకోగా.. భారత్ డైనమిక్స్ 5.34 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 2.92 శాతం, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ 1.84 శాతం, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ 1.38 శాతం పెరిగాయి. డ్రోన్ తయారీదారుల్లో ఐడియాఫోర్జ్ టెక్నాలజీ షేరు ఏకంగా 20 శాతం ఎగబాకింది. డ్రోనాచార్య ఏరియల్ ఇన్నోవేషన్ 4.99 శాతం లాభపడింది.

బీఓఐ లాభంలో 82 % వృద్ధి

ముంబై: బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ).. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.2,626 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం ఏకంగా 82 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం 2 శాతం వృద్ధి చెంది రూ.6,063 కోట్లకు చేరుకోగా ఇతర ఆదాయం 96 శాతం పెరిగి రూ.3,428 కోట్లుగా నమోదైంది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 12-13 శాతం రుణ వృద్ధి, 11-12 శాతం డిపాజిట్లలో వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ రజనీష్ కర్నాటక్ తెలిపారు.

పీఎస్‌బీల లాభాల్లో సరికొత్త రికార్డు

- 2024-25లో రూ.1.78 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరానికి (2024-25) గాను దేశంలోని డజను ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల మొత్తం వార్షిక లాభం సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.1.78 లక్షల కోట్లకు చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఈ 12 పీఎస్‌బీల మొత్తం లాభం రూ.1.41 లక్షల కోట్లుగా నమోదైంది. అంటే, 2023-24తో పోలిస్తే 2024-25లో ప్రాఫిట్ రూ.37,100 కోట్లు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరానికి నమోదైన పీఎస్‌బీల మొత్తం లాభం రూ.1,78,364 కోట్లలో 40 శాతం వాటా భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ)దే. గతసారి ఎస్‌బీఐ వార్షిక లాభం రూ.70,901 కోట్లుగా నమోదైంది. 2023-24లో నమోదైన రూ.61,077 కోట్లతో పోలిస్తే 16 శాతం అధికం. కాగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) లాభం అన్నిటికంటే అత్యధికంగా 102 శాతం వృద్ధి చెంది రూ.16,630 కోట్లకు చేరింది.

ఇక వాట్సాప్ బాట్ ద్వారా ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపులు

న్యూఢిల్లీ: భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) "వాట్సాప్ బాట్" ద్వారా ప్రీమియం చెల్లింపునకు మరో ఆన్‌లైన్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఎల్ఐసీ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న యూజర్లు 8976862090 నంబర్‌కు వాట్సాప్ చేయడం ద్వారా తమ పాలసీల్లో చెల్లింపు బకాయిలను గుర్తించి వాట్సాప్ బాట్ ద్వారా యూపీఐ/నెట్‌బ్యాంకింగ్/కార్డులను ఉపయోగించి చెల్లింపులు చేయవచ్చని ఎల్ఐసీ తెలిపింది. ఏయే పాలసీలకు ప్రీమియం చెల్లింపు బకాయి ఉందో గుర్తించడం, చెల్లించడం, రసీదు పొందడం అన్నీ వాట్సాప్ బాట్ ద్వారానే నిర్వహించుకోవచ్చని పేర్కొంది. ఈ సదుపాయం వల్ల కస్టమర్లు ఎక్కడ నుంచైనా ప్రీమియం చెల్లింపులు చేయవచ్చని ఎల్ఐసీ ఎండీ సిద్ధార్థ మొహంతి తెలిపారు.

మెర్సిడెస్ బెంజ్ కార్ల ధర పెంపు

న్యూఢిల్లీ: ఈ ఏడాది రెండు విడతలుగా తమ కార్ల ధర రూ.90000 నుంచి రూ.12.2 లక్షల మధ్యలో పెంచనున్నట్టు మెర్సిడెస్ బెంజ్ తెలిపింది. ఫారెక్స్ ఆటుపోట్ల ప్రభావాన్ని పాక్షికంగా తగ్గించుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలియచేసింది. జూన్, సెప్టెంబరు నెలల్లో ధరల సవరణ ఉంటుందని పేర్కొంది. సీ-క్లాస్ కార్ల ధర కనిష్ఠంగా రూ.90 వేలు, మేబాక్ ఎస్ 680 ధర గరిష్ఠంగా రూ.12.2 లక్షలు పెరుగుతాయని తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

10వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	500
వరంగల్	497	గోదావరి	500
చిత్తూరు	573	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	124
వరంగల్	125	గుంటూరు	127
కరీంనగర్	125	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	112
కర్నూలు	125	నెల్లూరు	117
విశాఖపట్నం	121	అనంతపురం	117
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,350 ▼	90,150 ▼	1,10,000 ▼
విజయవాడ	99,600 ▼	95,500 ▼	98,000 ▼
విశాఖపట్నం	99,680 ▼	90,150 ▼	1,11,000 ▲
రాజమండ్రి	98,350 ▼	90,150 ▲	99,000 ▼
ప్రొద్దుటూరు	97,500 ▼	89,650 ▼	98,300 ▲
ముంబై	96,416 ▼	88,317 ▼	95,726 ▲

పాక్‌కు ఐఎంఎఫ్ రుణం

» 100 కోట్ల డాలర్ల తక్షణ విడుదలకు ఓకే

» తీవ్రంగా అభ్యంతరం తెలిపిన భారత్



న్యూఢిల్లీ, ఇస్లామాబాద్, మే 9: అంతర్జాతీయ రుణ సంస్థల నుంచి తీసుకున్న అప్పులను చెల్లించకుండా.. ఆ డబ్బుతో సీమాంతర ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్థాన్‌కు కొత్తగా రుణం ఇవ్వొద్దంటూ భారత్ తీవ్రస్థాయిలో అభ్యంతరం చెప్పినా ఫలితం లేకపోయింది. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ (ఈఎఫ్ఎఫ్) కింద.. దాయాది దేశానికి 100 కోట్ల డాలర్ల నిధులు (మన కరెన్సీలో దాదాపు రూ.8540 కోట్లు. పాకిస్థాన్ కరెన్సీలో దాదాపు రూ.28 వేల కోట్లు) తక్షణం ఇవ్వడానికి 'అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)' ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం ధ్రువీకరించింది. పాకిస్థాన్‌కు ఈఎఫ్ఎఫ్ కింద ఇవ్వదలచిన 700 కోట్ల డాలర్లలో 100 కోట్ల డాలర్ల విడుదల, కొత్త అప్పు కింద మరో 130 కోట్ల డాలర్లు.. మొత్తం కలిపి 230 కోట్ల డాలర్ల రుణం ఇచ్చే ప్రతిపాదనలను పరిశీలించేందుకు ఐఎంఎఫ్ శుక్రవారం బోర్డు మీటింగ్ నిర్వహించింది. అయితే.. పాక్‌కు రుణ ప్రతిపాదనను భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. పాకిస్థాన్‌కు ఆర్థిక సాయం అందిస్తే ఆ డబ్బును ఉగ్రవాదుల కోసమే ఉపయోగిస్తుందని ఆందోళన వెలిబుచ్చింది. సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడుతున్న పాకిస్థాన్‌కు రుణమిస్తే.. అంతర్జాతీయ సమాజానికి తప్పుడు సంకేతం పంపినట్టవుతుందని, రుణసంస్థల ప్రతిష్ఠను సైతం అది దెబ్బతీస్తుందని అభిప్రాయపడింది. పాకిస్థాన్ చాలాకాలంగా ఐఎంఎఫ్ నుంచి అప్పులు తీసుకుంటూనే ఉందని.. గడిచిన 35 సంవత్సరాల్లో 28 సార్లు పాక్ అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి రుణాలు తీసుకుందని.. గడిచిన ఐదేళ్లలో నాలుగు ఐఎంఎఫ్ ప్రోగ్రామ్‌లు పాక్‌లో అమలయ్యాయని గుర్తుచేసింది. కానీ, ఆ రుణాలు ఇచ్చే సమయంలో ఐఎంఎఫ్ పెట్టే షరతులకు కట్టుబడి ఉండడంలో, వాటిని అమలు చేయడంలో మాత్రం పాక్‌కు మంచి రికార్డు లేదని ధ్వజమెత్తింది. అలా పేరుకుపోయిన బకాయిల కారణంగా.. పాక్‌కు ఐఎంఎఫ్ మళ్లీ మళ్లీ రుణాలు ఇవ్వక తప్పని స్థితి నెలకొందని ఆవేదన వెలిబుచ్చింది. గతంలో తీసుకున్న అప్పులను పాక్ సక్రమంగా వినియోగించి ఉంటే ఆదేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండేదని.. ఇప్పుడిలా ఉద్దీపన ప్యాకేజీ కోసం ఐఎంఎఫ్‌ను ఆశ్రయించాల్సిన పనే ఉండేది కాదని స్పష్టం చేసింది. "ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ రుణసంస్థల నుంచి నిధులు వస్తూ ఉంటే.. పాక్ వాటిని సైన్యానికి, ప్రభుత్వ ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదుల కోసం వినియోగిస్తుంది" అని హెచ్చరించింది. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణాల విషయంలో రాజకీయ జోక్యం ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యాపించి ఉందని వ్యాఖ్యానించింది. పాక్‌కు రుణాలు ఇచ్చే విషయంలో ఐఎంఎఫ్ కేవలం విధానపరమైన, సాంకేతిక అంశాలనే పరిగణనలోకి తీసుకుంటోందని ఆక్షేపించిన భారత్.. అంతర్జాతీయ రుణ సంస్థలు అప్పులు ఇవ్వడానికి అనుసరించే విధానాల్లో నైతిక విలువలను సైతం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. ఈ కారణాలతో.. పాక్‌కు రుణంపై ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌లో నిర్వహించిన ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది.

పాక్ మద్దతుగా సోషల్ మీడియా పోస్టులు

» పుణె, భీవండీలో ఇద్దరు విద్యార్థులు అరెస్ట్

పుణె, మే 9: పాకిస్థాన్ మద్దతుగా సోషల్‌మీడియాలో పోస్టులు చేసిన ఇద్దరు విద్యార్థులను రెండు వేర్వేరు ఘటనల్లో శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పుణెలోని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 'పాకిస్థాన్ జిందాబాద్' అంటూ నినాదాలు పోస్ట్ చేసిందన్న ఆరోపణలతో కొంధ్వా పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కాగా థానే జిల్లాలోని భీవండిలో జరిగిన మరో ఘటనలో కూడా 18 ఏళ్ల యువకుడిని ఇవే ఆరోపణలతో అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

డ్రోన్లతో పాక్ కుట్రలు

కశ్మీర్‌లోని లేహ్ నుంచి గుజరాత్‌లోని సర్‌క్రీక్ వరకూ 36 నగరాల్లోని సైనిక శిబిరాలే లక్ష్యం

» 300-400 డ్రోన్లతో దాడికి యత్నం

» డ్రోన్లలో అత్యధికం కూల్చేశాం..

» విలేకరులతో విక్రమ్ మిస్రి, సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్

న్యూఢిల్లీ, మే 9: "అటు లేహ్ నుంచి ఇటు సర్‌క్రీక్ వరకూ జమ్ము కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో 36 నగరాలు, పట్టణాల్లోని భారత సైనిక శిబిరాలపై దాడికి గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాకిస్థాన్ 300-400 టర్కీ డ్రోన్లతో విఫల యత్నం చేసింది. లద్దాఖ్‌లోని సియాచిన్ బేస్ క్యాంప్; గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలోనూ ఈ డ్రోన్లు కనిపించాయి. ఈ రెండు ప్రాంతాల మధ్య దాదాపు 1400 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అంటే.. పాకిస్థాన్ ఏ స్థాయిలో డ్రోన్లతో దాడి చేసిందో అర్థం చేసుకోవచ్చు. వాటిలో 50 డ్రోన్లను మన ఎయిర్ డిఫెన్స్ గన్స్ కూల్చేశాయి. రేడియో ఫ్రీక్వెన్సీలను జామ్ చేయడం ద్వారా మరో 20 డ్రోన్లను పనికిరాకుండా చేశాయి. అయితే, వీటిలో అత్యధిక డ్రోన్లలో ఎటువంటి ఆయుధాలూ లేవు. బహుశా.. భారత రక్షణ వ్యవస్థను పరీక్షించడానికే వీటిని ప్రయోగించి ఉండవచ్చు" అని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి వెల్లడించారు. చాలా డ్రోన్లలో కెమెరాలు బిగించి ఉన్నాయని, వాటితో చిత్రీకరించిన ఫుటేజీని నిఘా సమాచారాన్ని పాకిస్థాన్‌లోని క్షేత్ర స్థాయి స్టేషన్లకు పంపించడానికే వాటిని బిగించి ఉంటారని అభిప్రాయపడ్డారు. తమ గగనతల దాడులకు పౌర విమానాలను అడ్డుగా పెట్టుకుందని, గగనతలాన్ని తెరిచి ఉంచిందని తెలిపారు. అంతర్జాతీయ సరిహద్దు వద్ద అంతర్జాతీయ పౌర విమానాలు తిరుగుతూ ఉంటాయని, వాటిపై నిఘా ఉండదని, ఇటువంటి పరిస్థితుల్లో పాకిస్థాన్ తమ గగనతలాన్ని అడ్డుగా పెట్టుకోవడం మిగిలిన పౌర విమానాలకు ఏమాత్రం సురక్షితం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో విమానాల కదలికలకు సంబంధించిన స్క్రీన్ షాట్లను ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం రాత్రి కూడా పాకిస్థాన్ పలు డ్రోన్లతో దాడులు చేసిందని, మరీ ముఖ్యంగా ప్రార్థన స్థలాలను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. తప్పంతా భారతీయ సైన్యానిదేనంటూ ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించడానికి దుష్ట పన్నాగాలను పన్నుతోందని మండిపడ్డారు. అమృత్‌సర్‌లోని గురుద్వారాపై దాడి చేసిన పాకిస్థాన్.. ఆ తప్పును మన భద్రతా దళాలపై నెట్టేయడాన్ని గుర్తు చేశారు. తన సొంత నగరాలపై భారత్ దాడి చేసుకుంటుందనే అపరిపక్వ అంచనాల్లో పాకిస్థాన్ ఉందని, అటు వంటివన్నీ పాకిస్థాన్ అలవాట్లని దుయ్యబట్టారు. భారత సైనిక స్థావరాలు, పౌర ఆవాసాలపై పాకిస్థాన్ దాడులు చేయడం రెచ్చగొట్టే చర్యలేనని మండిపడ్డారు. చాలా డ్రోన్లను కూల్చేశామని, నిర్వీర్యం చేశామని, వాటి శిథిలాలపై దర్యాప్తు సాగుతోందని, ప్రాథమిక వివరాల ప్రకారం టర్కీ తయారు చేసిన ఆసిస్ గార్డ్ సోంగార్ డ్రోన్లుగా గుర్తించారని కల్నల్ సోఫియా ఖురేషీ వివరించారు. సైనిక స్థావరాలపై దాడులు చేస్తే భారత్ నుంచి తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని పాకిస్థాన్‌కు తెలుసునని, అందుకే, ప్రతి దాడులు చేయకుండా పౌర విమానాలను అడ్డుగా పెట్టుకుందని ఆరోపించారు. భటిండాపై సాయుధ యూఏవీ దాడిని కూడా అడ్డుకున్నామని తెలిపారు. పాకిస్థాన్ వందలాది డ్రోన్లను ప్రయోగించిందని, వాటన్నిటినీ మన వాయు రక్షణ వ్యవస్థ అడ్డుకోవడమో, కూల్చడమో చేసినా.. ఈ చర్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని యధేచ్ఛగా ఉల్లంఘించడమేనని తప్పుబట్టారు. అలాగే, చిన్న చిన్న ఆయుధాలతోనూ కాల్పులు జరిపిందని, జమ్ము కశ్మీరులో నియంత్రణ రేఖ వెంబడి గుళ్ల వర్షం కురిపించిందని, ఈ ఘటనల్లో ఓ జవాను సహా 16 మంది చనిపోయారని వెల్లడించారు. ఇందుకు బదులుగా భారత బలగాలు వందలాది పాక్ డ్రోన్లు, క్షిపణులను కూల్చేయడమే కాకుండా ఆ దేశ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాయని తెలిపారు. కూల్చేసిన డ్రోన్లు, క్షిపణుల శిథిలాలను సేకరించామని, వాటిని విశ్లేషించి.. భారత్‌లో ఉగ్రవాద దాడుల వెనక పాకిస్థాన్ ఉందనే ఆధారాలకు వీటిని కూడా జత చేస్తామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన కొన్ని శిథిలాలు పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో దొరికాయన్నారు. పాకిస్థాన్ భారీ ఎత్తున డ్రోన్లతో దాడి చేసింది మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను పరీక్షించడం కోసమేనని వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ చెప్పారు. భారత సైన్యం కూడా సాయుధ డ్రోన్లతో నాలుగు పాక్ వాయు రక్షణ వ్యవస్థలపై దాడి చేసిందని, వాటిలో ఒకటి ఎయిర్ డిఫెన్స్ రాడార్‌ను ధ్వంసం చేసిందని వివరించారు. అంతర్జాతీయ విమానాల రక్షణ కోసం భారత వాయు సేన నియంత్రణ పాటించిందని తెలిపారు.



సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్, విక్రమ్ మిస్రి

గగనతలంపై భారత్ పట్టు

పాకిస్థాన్ డ్రోన్లను కూల్చేయడం ద్వారా గగనతలంపై భారత్ తన పట్టును నిలుపుకొందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గగనతంలో తనను తాను కాపాడుకోవడమే కాకుండా దానిపై ఆధిపత్యం కూడా సాధించగలదని తాజా ఘటనతో రుజువైందని వివరించాయి.

బలూచిస్థాన్ రెబెల్స్ వశం!

పాక్ సైన్యంపై వరుసగా తిరుగుబాటుదారుల దాడులు

కీలక నగరం క్వెట్టా సహా చాలా భాగం మూడు రెబెల్ గ్రూపుల స్వాధీనం!

మరోవైపు దాడులకు దిగిన టీటీపీ

20 మంది పాకిస్థాన్ సైనికులు హతం

న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న బలూచిస్థాన్ తిరుగుబాటుదారులు ఆ ప్రాంతాన్ని తమ వశం చేసుకున్నారు. ఓవైపు భారత్‌పై డ్రోన్లు, క్షిపణి దాడులకు పాక్ తెగబడుతున్న సమయంలో.. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) సహా మూడు తిరుగుబాటు గ్రూపులు అక్కడి పాక్ సైనిక స్థావరాలపై దాడులకు దిగాయి. క్వెట్టాలోని ఫైజాబాద్ ప్రాంతంలో పాక్ దళాలు, తిరుగుబాటుదారుల మధ్య తీవ్ర స్థాయిలో కాల్పులు జరిగాయి. సిబ్బిలోని మిలటరీ క్యాంపుపై తిరుగుబాటుదారులు గ్రనేడ్లతో దాడికి దిగారు. పాకిస్థాన్ ఆర్మీని తరిమికొడుతూ, అక్కడి కీలక నగరం క్వెట్టా సహా చాలా ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఆరు ప్రాంతాల్లో పాక్ దళాలపై ఐఈడీలు, గ్రనేడ్లు, ఆటోమేటిక్ ఆయుధాలతో దాడులు చేశామని బీఎల్ఏ అధికార ప్రతినిధి జియాంద్ బలూచ్ ప్రకటించారు. మరోవైపు క్వెట్టాలో, ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, ఇతర ప్రాంతాల్లో పాకిస్థాన్ జెండాలను తొలగించి.. బలూచిస్థాన్ జెండాలను ఎగురవేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

దెబ్బ మీద దెబ్బ

పాకిస్థాన్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. తెహ్రిక్ ఈ తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) తీవ్రవాదులు చేసిన దాడిలో పాకిస్థాన్‌కు చెందిన 20 మంది సైనికులు హతమయ్యారు. పాకిస్థాన్, దక్షిణ వజీరిస్థాన్‌లోని షకాయి సబ్ డివిజన్‌లో ఉన్న ఓ మిలటరీ ఔట్‌పోస్టుపై గురువారం అర్ధరాత్రి తర్వాత ఈ దాడి జరిగినట్టు రిపబ్లిక్ వరల్డ్ సంస్థ ఓ కథనంలో పేర్కొంది. లేజర్ రైఫిల్స్ ఉపయోగించి టీటీపీ చేసిన తొలి దాడిలో ఆరుగురు పాక్ సైనికులు మరణించారు. మిలటరీ ఔట్‌పోస్టు రక్షణకు బయలుదేరిన రెండు సైనిక వాహనాలపైనా టీటీపీ దాడి చేసింది. మొత్తంగా 20 మంది పాక్ సైనికులు మరణించారని, ఐదుగురు గాయపడ్డారని టీటీపీ ప్రకటించింది.

సీఏ పరీక్షలు వాయిదా!

న్యూఢిల్లీ, మే 9: దేశవ్యాప్తంగా సీఏ పరీక్షలు వాయిదా పడ్డాయి. భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా పరీక్షలు వాయిదా వేయాలని నిర్ణయించినట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) అధికారికంగా ప్రకటించింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సీఏ పరీక్షలు మే 2 నుంచి 14 వరకు జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా నిర్దేశించిన తేదీలలో అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. అయితే మే 9 నుంచి 14 వరకు జరగాల్సిన విగిలిన సీఏ ఇంటర్మీడియట్, ఫైనల్, పోస్ట్ క్వాలిఫికేషన్ పరీక్షలు వాయిదా పడ్డాయని.. పరీక్షల కొత్త షెడ్యూలును త్వరలో వెల్లడిస్తామని ఐసీఏఐ పేర్కొంది. ఈ పరీక్షలకు హాజరుకావాల్సిన అభ్యర్థులు మరిన్ని వివరాలను ఐసీఏఐ అధికారిక వెబ్‌సైట్ icai.orgలో చూసుకోచ్చని తెలిపింది.


భారత్- నేపాల్ సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం

పిథోరాగఢ్, మే 9: భారత్- పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో భారత్- నేపాల్ సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. నేపాల్‌తో సరిహద్దును పంచుకుంటున్న ఉత్తరాఖండ్‌లోని పిథోరాగఢ్, చంపావత్ జిల్లాల్లో గస్తీని ముమ్మరం చేశారు. సరిహద్దుల్లోని ప్రధాన వంతెనల వద్ద విస్తృత తనిఖీలు చేస్తున్నామని, గస్తీ బృందాల సంఖ్యను కూడా పెంచామని పిథోరాగఢ్ ఎస్పీ రేఖ యాదవ్ తెలిపారు. అన్ని చెక్ పోస్టులను అప్రమత్తం చేశామని, దేశంలోకి అనుమానాస్పద వ్యక్తులు చొరబడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నైని సైని విమానాశ్రయంలో కూడా అదనపు భద్రతా సిబ్బందిని మోహరించడంతో పాటు విమానాశ్రయంలోకి ప్రవేశించే ప్రతిఒక్కరి కదలికలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని రేఖ యాదవ్ పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సైనికుల ఫొటోలు, వీడియోలు తీయొద్దు



రాజమౌళి

భారత్ - పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కొందరు సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తున్నారు. ఈ క్రమంలో దర్శకుడు రాజమౌళి స్పందించారు. పాజిటివ్‌గా, అప్రమత్తంగా ఉంటే విజయం మనదేనని, సాయుధ దళాలని మెచ్చుకోవాల్సిందే అని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 'ఒకవేళ భారత సైనిక చర్యలను చూస్తే ఫొటోలు, వీడియోలు తీయొద్దు. వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయొద్దు. అలా చేస్తే శత్రువుకు సాయం చేసినట్టే. అనధికార ప్రకటనలు, అసత్య ప్రచారం నమ్మకండి' అని పేర్కొన్నారు.

వేడుక వాయిదా



కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోన్న పాన్ ఇండియా చిత్రం 'థగ్ లైఫ్'. జూన్ 5న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఈనెల 16న ఆడియో లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించాలని చిత్రబృందం భావించింది. అయితే, ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో ఏర్పడిన ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో వేడకను వాయిదా వేసినట్టు చిత్రబృందం తెలిపింది. ఈ మేరకు కమల్‌హాసన్ 'ఆర్ట్ కెన్ వెయిట్ - ఇండియా కమ్స్ ఫస్ట్' అంటూ ఓ ప్రకటన విడుదల చేశారు.

భైరవం రాక ఖరారు




బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న యాక్షన్ థ్రిలర్ చిత్రం 'భైరవం'. అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్ళై కథానాయికలు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పవర్‌ఫుల్ పోస్టర్లు, యాక్షన్‌తో నిండిన టీజర్, రెండు సూపర్ హిట్ పాటలతో సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా మేకర్స్ ఈ చిత్రాన్ని మే 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. హరి కె వేదాంతం సినిమాటోగ్రఫీ, శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు.

అందర్నీ ఆకట్టుకుంటుంది



మంగపుత్ర కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'వృశ్చికం'. శివరామ్ నిర్మిస్తున్నారు. యశ్విక కథానాయిక. గురువారం ఈ సినిమాను ప్రారంభించారు. ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. నటుడు కోసూరి సుబ్రమణ్యం కెమెరా స్విచ్చాన్ చేయగా, సుప్రీంకోర్టు అడ్వకేట్ హబీబ్ సుల్తానా క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా నటుడు, దర్శకుడు మంగపుత్ర మాట్లాడుతూ "మంచి నిర్మాణ విలువలతో, ఉన్నతమైన సాంకేతికతతో తెరకెక్కుతోందీ చిత్రం. అందర్నీ ఆకట్టుకుంటుంది" అని తెలిపారు.

పవర్‌ఫుల్ లుక్



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రవి కిరణ్ కోలా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. త్వరలో చిత్రీకరణ ప్రారంభించనున్నారు. 'ఎస్‌వీసీ 59' వర్కింగ్ టైటిల్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. శుక్రవారం విజయ్ దేవరకొండ పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్ర బృందం కొత్త పోస్టర్‌ను పంచుకుంది. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రమిది.

ధ్యానముద్రలో...

అలాగే రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా మరో చిత్రం రూపుదిద్దుకుంటోంది. 'వీడీ 14' వర్కింగ్ టైటిల్. రష్మిక మందన్న కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్, టీ సిరీస్ నిర్మిస్తున్నాయి. బ్రిటిష్ కాలం నాటి నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ధ్యానముద్రలో ఉన్న విజయ్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. త్వరలో చిత్రీకరణ ప్రారంభించనున్నారు.

సైనికులకు సాయంగా నిలుస్తాం

అల్లు అరవింద్



'సైనికులు దేశం కోసం పోరాడుతుంటే మేం సినిమా సెలబ్రేషన్స్ చేసుకోవడం సరికాదు అనిపించింది. అందుకే 'సింగిల్' సినిమా వసూళ్లలో కొంత భాగాన్ని మన కోసం పోరాడుతున్న సైనికులకు అందజేస్తాం. మేం ఊహించిన దానికి మించి ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. శ్రీ విష్ణు కథానాయకుడిగా కార్తీక్ రాజు దర్శకత్వం వహించిన 'సింగిల్' చిత్రం ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శుక్రవారం మీడియాతో ముచ్చటించింది. అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఒక ఆహ్లాదకరమైన సినిమాను ఇవ్వాలని ప్రయత్నించాం. ప్రేక్షకులు సినిమాను అద్భుతంగా ఆస్వాదిస్తున్నారు. 'సింగిల్'తో గీతా ఆర్ట్స్ హ్యాట్రిక్ విజయాన్ని అందుకొంది' అన్నారు. శ్రీ విష్ణు మాట్లాడుతూ 'యుద్ధం వస్తుందని అనుకోలేదు. అందుకే ముందు ప్రకటించిన తేదీకే సింగిల్ సినిమాను విడుదల చేశాం. అన్ని ఏరియాల నుంచి మంచి స్పందన వస్తోంది. బాగా నవ్వుకున్నామని ప్రేక్షకులు చెప్పడం సంతోషాన్నిచ్చింది' అని తెలిపారు. 'సింగిల్‌'కు బ్లాక్‌బస్టర్ రెస్పాన్స్ వస్తోంది, ఈ అవకాశం ఇచ్చిన అల్లు అరవింద్ గారికి, మా నిర్మాతలకు ధన్యవాదాలు' అని కార్తీక్‌రాజు అన్నారు.

మీ వెంట మేమున్నాం



పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని ప్రదర్శిస్తూ జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో దాడులకు తెగబడడం, వీటిని భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టడం తెలిసిందే. ఈ క్రమంలో పలువురు సినీ ప్రముఖులు భారత సైన్యంపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ధైర్యంగా ముందుకు సాగండి.. మీ వెంట మేమున్నాం అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మరోవైపు సాయుధ దళాలకు సాయం చేసేందుకు విజయ్ దేవరకొండ ముందుకొచ్చారు. తన రౌడీ బ్రాండ్ దుస్తులు వారికి అందించనున్నట్లు ప్రకటించారు.

ఉగ్రవాదం నుంచి మనల్ని రక్షించుకునేందుకు చేసే పోరాటం యుద్ధం కాదు. ఈ పోరాటానికి మద్దతిచ్చే వారిని యుద్ధాన్ని కాంక్షించే వారిగా పేర్కొనొద్దు. దేశ భద్రత, న్యాయం కోసం ఆరాటపడే పౌరులు వారు. దూకుడు ధోరణి, అత్యవసర ఆత్మరక్షణకు మధ్య చాలా నైతిక భేదం ఉంటుంది. కుట్రపూరితంగా జరిగిన ఉగ్రవాద చర్యలో అమాయకుల ప్రాణాలు కోల్పోయినప్పుడు, దానికి ప్రతీకారం తీర్చుకోవడం బాధ్యతే అవుతుంది తప్ప అవకాశం కాదు. శాంతిని కోరుకోవడమంటే జరిగిన హానిని మౌనంగా అంగీకరించడం కాదు

- రష్మిక మందన్న

భారత సైన్యానికి మరింత శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. మన రక్షణ దళాలు ధైర్యంగా సాగుతూ, శత్రువుల గుండెల్లో భయాన్ని నింపాలి.

- సాయి దుర్గాతేజ్




దీన్ని వాళ్లు ప్రారంభించారు. మనం ముగిస్తాం. భారత సాయుధ దళాల కోసం ఎప్పుడూ ప్రార్థిస్తూనే ఉంటాం

- మంచు విష్ణు

శత్రుదేశం జమ్మూను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజలంతా జాగ్రత్తగా ఉండండి


- కంగనా రనౌత్



జాతీయ రక్షణ నిధి కోసం ఎన్టీఆర్ తొలి అడుగు

సరిగ్గా అరవై ఏళ్ల క్రితం అంటే 1965లో మనదేశంపై పాకిస్థాన్ తొలిసారిగా దాడి చేసిన తరుణంలో తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి మొదట స్పందించిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జాతీయ రక్షణ నిధి కోసం విరాళాలు సేకరిస్తామని ఆనాటి పత్రికల ద్వారా ప్రకటించి మిగిలిన వారిలో స్ఫూర్తి నింపారు. చిత్ర పరిశ్రమలోని తన సహచర నటీనటులను సంప్రదించి, ఆంధ్రప్రదేశ్ ప్రజారక్షణ కమిటీ సహాయంతో మే 16, 17, 18 తేదీల్లో విజయవాడ, హైదరాబాద్, కర్నూలు పట్టణాల్లో ఎన్టీఆర్ సారథ్యంలో నటీనటులు వినోద ప్రదర్శనలు నిర్వహించి, విరాళాలు సేకరించారు.





ఎన్టీఆర్‌తో పాటు ఎస్వీ రంగారావు, జగ్గయ్య, కాంతారావు, గుమ్మడి, రాజనాల, సత్యనారాయణ, పద్మనాభం, సావిత్రి, జమున, రాజసులోచన, కన్నాంబ, లక్ష్మీరాజ్యం, రేలంగి, గిరిజ.. వంటి ప్రముఖ తారలు విరాళాల సేకరణలో ఉత్సాహంతో పాల్గొన్నారు. వినోద ప్రదర్శనలతో అలరించారు. అప్పటివరకూ తెర మీద మాత్రమే కనిపించే తమ అభిమాన తారలు ఇలా తమ ఊరికి వచ్చి విరాళాలు సేకరించడం, వినోద ప్రదర్శనలు ఇవ్వడంతో జనం ఆనందానికి అవధులు లేవు. అందుకే తారలకు విరాళాలు అందివ్వడానికి పోటీ పడేవారు. ఆ రోజుల్లోనే మొత్తం ఎనిమిది లక్షల రూపాయలు వసూలు చేసి నాటి ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రికి అందజేశారు ఎన్టీఆర్.

అదే స్ఫూర్తితో 1969లో తుపాను బాధితుల కోసం వారం రోజుల పాటు భిక్షా యాత్ర నిర్వహించారు ఎన్టీఆర్. ఆ రోజుల్లో ఆర్టిస్టులు, ఇతరులు కలిపి మొత్తం 180 మంది ఎన్టీఆర్ వెనుక నడవడం విశేషం. అలాగే 1977లో దివిసీమ ఉప్పెన వల్ల భారీగా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగినప్పుడు తను సోదరుడిగా భావించే అక్కినేని నాగేశ్వరరావుతో కలసి విరాళాలు సేకరించి, వినోద ప్రదర్శనలు ఇచ్చి రూ 15 లక్షల రూపాయలు వసూలు చేసి, ప్రభుత్వానికి అందజేశారు ఎన్టీఆర్. అలా ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొని తను రాజకీయాల్లోకి ప్రవేశించడానికి చాలా ముందుగానే ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకొన్నారు ఎన్టీఆర్.





సింధు జలాలపై మేమేం చేయలేం!

» కేవలం సహాయకులం మాత్రమే: ప్రపంచ బ్యాంకు చీఫ్

» పాక్‌కు మరోసారి గట్టి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, మే 9: సింధు జలాల విషయంలో పాకిస్థాన్‌కు మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌ను అష్టదిగ్బంధనం చేసిన భారత ప్రభుత్వం కీలకమైన సింధు జలాల ఒప్పందం అమలును నిలిపివేసిన విషయం తెలిసిందే. దీనిని ప్రపంచ దేశాల దృష్టికి తీసుకువెళ్లి.. భారత్‌ను బూచిగా చూపించే ప్రయత్నం చేసిన దాయాది దేశానికి భారీ షాక్ తగిలింది. ముఖ్యంగా సింధు జలాల విషయంలో ఇరు దేశాలకు మధ్యవర్తిగా ఉన్న ప్రపంచ బ్యాంకు ఈ విషయంలో జోక్యం చేసుకునేది లేదని తెగేసి చెప్పింది. శుక్రవారం ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా స్పందిస్తూ.. సింధు జలాల ఒప్పందంపై తామేమీ చేయలేమని తేల్చి చెప్పారు. తాము కేవలం సహాయకులుగా మాత్రమే ఉంటామన్నారు. ఈ విషయంలో తాము ఎలాంటి పాత్రనూ పోషించలేమని స్పష్టం చేశారు. "సింధు జలాల విషయంలో ప్రపంచ బ్యాంకు జోక్యం చేసుకుని ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందనే అంశంపై మీడియాలో అనేక కథనాలు వస్తున్నాయి. కానీ, ఇవన్నీ ఊహాజనితాలు. దీనిలో మా పాత్ర ఏమీ ఉండదు. కేవలం సహాయకులం మాత్రమే." అని అజయ్ పేర్కొన్నారు.

నాలుగు రాష్ట్రాలకు సింధు జలాల మళ్లింపు!

» రాజస్థాన్, హరియాణా, ఢిల్లీ, హిమాచల్ అవసరాలకు వాడుకోవాలని కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, మే 9: నాలుగు రాష్ట్రాల అవసరాలు తీర్చుకునేందుకు సింధు నదీ జలాలను మళ్లించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రాజస్థాన్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ అవసరాలకు సింధు జలాలను వినియోగించుకోవాలని, దీని అమలుకు అవసరమైన మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు కేంద్ర జలశక్తి శాఖ పనిచేస్తోందని ఏఎన్ఐ వర్గాలు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌తో సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే చుక్క నీటిని కూడా పాకిస్థాన్‌కు పోనివ్వకూడదని కేంద్రం భావిస్తోంది. సింధు జలాల వినియోగంపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గంట పాటు జరిగిన ఈ సమావేశంలో జలాల మళ్లింపుపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిసింది.

స్వదేశంలో భద్రతకే మొగ్గు కానీ పాక్‌కు మద్దతు


» తుర్కియే ద్వంద్వ ప్రమాణాలను ప్రశ్నించిన ఒవైసీ



న్యూఢిల్లీ, మే 9: సొంతగడ్డపై దేశ భద్రతకు ప్రాధాన్యమిస్తున్న తుర్కియే అంతర్జాతీయ ఉగ్రవాదానికి నెలవుగా మారిన పాకిస్థాన్‌కు ఎలా తిరుగులేని మద్దతునిస్తుందని హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. 'మనం తుర్కియేను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. తన సొంతగడ్డపై ఉగ్రవాద సంస్థ కుర్దిష్ గ్రూపుపై బాంబుల వర్షం కురిపిస్తుంది. ఇరాక్‌లోనూ ఉగ్రవాదులపై బాంబులు వేయడానికి వెనుకంజ వేయదు. తాజాగా సిరియాలోని ఉగ్రవాద శిబిరాలపై బాంబులేస్తుంది. విదేశీ గడ్డపై ఉగ్రవాదులను అంతమొందిస్తారు. కానీ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్పందిస్తున్న భారత్‌ను ఎలా ప్రశ్నిస్తారని ఆ దేశాన్ని నిలదీయాల్సిన అవసరం ఉంది..?' అని ఒవైసీ స్పష్టం చేశారు. తమ దేశ భద్రతకు ఉగ్రవాదులపై అవసరమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని గత డిసెంబర్‌లో తుర్కియే మంత్రి హకన్ ఫిదాన్ పేర్కొన్నారు.

పహల్గాం బాధితులకు న్యాయం: ఆర్‌ఎస్‌ఎస్

» కేంద్రం చేపడుతున్న చర్యలపై మోహన్ భాగవత్ హర్షం



న్యూఢిల్లీ, మే 9: ఆపరేషన్ సిందూర్‌పై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్పందించింది. పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం, భారత సైన్యం చేపడుతోన్న చర్యలను ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ప్రశంసించారు. పహల్గాం బాధితులకు న్యాయం లభించినట్లైందని వ్యాఖ్యానించారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల పీచమణచడం దేశ భద్రతకు అవసరమని చెప్పారు. కర్ణాటక బెళగావిలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కీలక సమయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా కేంద్ర ప్రభుత్వానికి, సైన్యానికి అండగా నిలుస్తున్నారని చెప్పారు. సమాజంలో ఐక్యతను దెబ్బతీసేందుకు యత్నిస్తున్న వారిపై అప్రమత్తంగా ఉండాలని మోహన్ భాగవత్ సూచించారు. సైన్యానికి, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించేందుకు సన్నద్ధంగా ఉండాలని ఆయన దేశ పౌరులకు పిలుపునిచ్చారు.

పాక్ ప్రధాని పిరికిపంద

మోదీ పేరు పలికేందుకే షెహబాజ్ వణుకుతున్నారు

పాక్ విపక్ష ఎంపీ షాహిద్ ధ్వజం

న్యూఢిల్లీ, మే 9: భారత్‌తో ఉద్రిక్తతల వేళ పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీ అట్టుడికింది. ఆపరేషన్ సిందూర్‌తో పాటు పాక్‌లోని అనేక ప్రాంతాల్లో డ్రోన్లతో భారత్ దాడులు చేసిన నేపథ్యంలో విపక్షాలు ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై విమర్శలు ఎక్కుపెట్టాయి. ప్రధాని షెహబాజ్ పిరికిపంద అని ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పీటీఐ ఎంపీ షాహిద్ అహ్మద్ ఖట్టర్ విమర్శించారు. భారత ప్రధాని మోదీ పేరు పలికేందుకే షెహబాజ్ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా టిప్పు సుల్తాన్ కొటేషన్‌ను ఆయన ఉటంకించారు. సింహాల సైన్యాన్ని నక్క నడిపిస్తే అవి యుద్ధంలో పోరాడలేక ఓడిపోతాయన్నారు. సరిహద్దుల్లో ఉన్న పాక్ సైనికులు ధైర్యంగా పోరాడాలనుకున్నా దేశ ప్రధానికే ధైర్యం లేనప్పుడు ఎలా పోరాడగలరని ఆయన ప్రశ్నించారు. పిరికిపందలా ఉన్న ప్రధాని సరిహద్దుల్లో ఉన్న సైనికులకు ఏం ఆదేశాలు ఇవ్వగలరని షెహబాజ్‌ను ఉద్దేశించి షాహిద్ వ్యాఖ్యానించారు. కాగా, భారత డ్రోన్లను ఎందుకు కూల్చలేకపోయారంటూ నేషనల్ అసెంబ్లీలో విపక్ష సభ్యులడిగిన ప్రశ్నలకు పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ సమాధానమిచ్చారు. తమ గగనతల రక్షణ వ్యవస్థల లొకేషన్ల వివరాలు తెలియకూడదనే వ్యూహాత్మకంగా భారత డ్రోన్లను కూల్చలేదన్నారు. అంతే తప్ప సామర్థ్యం లేక కాదన్నారు. మదర్సాల్లోని విద్యార్థులను మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ద్వితీయ శ్రేణి రక్షణ దళాలుగా పేర్కొన్నారు. భారత్‌తో ఉద్రిక్తతలు పెరిగితే పరిస్థితులను బట్టి మదర్సా విద్యార్థులను వంద శాతం వాడుకుంటామన్నారు. మదర్సా విద్యార్థులను భారత్‌కు వ్యతిరేకంగా వాడుకుంటామంటూ పాక్ మంత్రి ఒకరు నేషనల్ అసెంబ్లీలో బహిరంగంగా అంగీకరించడం ఇదే ప్రథమం.

టర్కీ షూటౌట్!

(మొదటిపేజీ తరువాయి)

తాము కూల్చివేశామని భారత ఆర్మీ, వైమానిక దళ ప్రతినిధులు శుక్రవారం వెల్లడించారు. ఈ డ్రోన్ దాడులు ఆసరాగా భారత్‌లోకి టెర్రరిస్టులు చొరబడేలా పాక్ ప్రయత్నించిందని తెలిపారు. ఇప్పటివరకూ పాక్ వాడిన డ్రోన్లలో అత్యధికం తుర్కియే నుంచి దిగుమతి చేసుకున్న అసిస్‌గార్డ్ సోంగర్ డ్రోన్లు అని వారు చెప్పారు. ఈ డ్రోన్లతోపాటు అనేక క్షిపణుల్ని, ఎగిరే బాంబుల్ని పాక్ భారత్‌పైకి గురిపెట్టింది. ఈ ఆయుధాల వివరాల్ని పరిశీలిస్తే

అసిస్‌గార్డ్ సోంగర్ డ్రోన్లు



5కిలోమీటర్ల రేంజ్ కలిగిన ఈ డ్రోన్లు అత్యంత ప్రమాదకరమైనవి. వీటిని 2020 నుంచి తుర్కియే సైన్యం వాడుతోంది. ఈ డ్రోన్లు సుమారు 3 కిలోమీటర్ల ఎత్తు వరకూ ఎగురుతాయి. అంతేకాదు దీనికి అమర్చిన తుపాకీ ద్వారా గాలిలో నుంచి బులెట్ల వర్షం కురిపిస్తాయి. ఒక్కో డ్రోన్‌లో 200 బులెట్లు ఫైర్ చేయగల గన్ అమర్చుతారు. ఈ ఫైరింగ్‌ను ఆపరేటర్ కంట్రోల్ చేయవచ్చు. లేదంటే దానంతట అదే ఫైర్ చేసేలా కూడా ఏర్పాటు చేయవచ్చు. అంటే ఒక్కో డ్రోన్ అనేకమందిని చంపగలుగుతుంది. 2024లో దీనిని అప్‌గ్రేడ్ చేసి గ్రెనేడ్‌ను కూడా ఫైర్ చేసే సామర్థ్యం కల్పించారు.

షాహార్ డ్రోన్

300 కిలోమీటర్లకు పైగా రేంజ్ కలిగిన డ్రోన్ ఇది. నిఘాకు, దాడులకు దీనిని ఉపయోగించవచ్చు.

ఎగిరే బాంబులు

చైనా నుంచి, టర్కీ నుంచి దిగుమతి చేసుకున్న ఈ లాయిటరింగ్ మ్యూనిషన్లను ఎయిర్‌బేస్‌లు, రాడార్ల మీదికి ప్రయోగించవచ్చు.

అబ్దాలీ బాలిస్టిక్ క్షిపణి

200 కిలోమీటర్ల రేంజ్ కలిగిన ఈ క్షిపణితో మిలిటరీ రవాణా కేంద్రాలు, ఆయుధాగారాలపై దాడి చేయవచ్చు.

బాబర్ క్రూజ్ క్షిపణి

ధ్వని కంటే తక్కువ వేగంతో భూమికి సమాంతరంగా ప్రయాణిస్తూ రాడార్లకు దొరకకుండా ప్రయాణించే సామర్థ్యం ఉంది. 900 కిలోమీటర్ల రేంజ్ ఉండడంతో సరిహద్దుకు దూరంగా ఉన్న లక్ష్యాలపైకి దీనిని ప్రయోగించవచ్చు.

నాసర్ బాలిస్టిక్ క్షిపణి

సుమారు 70 కిలోమీటర్ల రేంజ్ కలిగిన టాక్టికల్ క్షిపణి. అణు దాడులకు, మామూలు దాడులకు కూడా దీనిని వాడవచ్చు. సరిహద్దు సమీపంలోని స్థావరాలపై వీటితో దాడులు చేస్తున్నట్టు సమాచారం.

బురాక్ అన్‌మ్యాన్డ్ కాంబాట్ వెహికిల్

పాకిస్థాన్ దేశీయంగా తయారుచేసింది. వెయ్యి కిలోమీటర్ల రేంజ్ కలిగిన ఈ డ్రోన్ లేజర్ గైడెడ్ క్షిపణులతో కచ్చితత్వంతో దాడి చేయగలదు.

ఇలాంటి ఆయుధాలతో పాక్ భారత సైన్యంపై, సైనిక స్థావరాలపై దాడులు చేసినా భారత్ వాటిని చాలా సమర్థంగా అడ్డుకుంది. సాధారణంగా ఏ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ అయినా శత్రువులు ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లు అన్నింటినీ అడ్డుకోవడం అసాధ్యం. 80 శాతం ఆయుధాల్ని అడ్డుకోగలిగితే ఆ వ్యవస్థలు చాలా గొప్పగా పనిచేస్తున్నట్లు లెక్క. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇజ్రాయెలీ ఐరన్ డోమ్ వ్యవస్థ కూడా 90 శాతం టార్గెట్లనే అడ్డుకోగలుగుతోంది. కానీ తాజా ఘర్షణల్లో భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ 90 శాతానికి మించి టార్గెట్లను ధ్వంసం చేసినట్లు చెబుతున్నారు. భారత ఎయిర్ డిఫెన్స్‌లో రష్యన్ ఎస్-400, స్వదేశీ ఆకాశ్ క్షిపణులు ప్రధాన పాత్ర పోషించాయి. తాజాగా పాకిస్థాన్‌కు చెందిన జేఎఫ్ 17 విమానాన్ని కూల్చింది కూడా మన ఆకాశ్ క్షిపణే. ఇవి కాకుండా భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తయారు చేసిన డ్రోన్ జామింగ్ వ్యవస్థలు, లేజర్ వ్యవస్థలు, స్పైడర్, బరాక్-8, ఎంఆర్‌శామ్, క్యూఆర్‌శామ్ వంటి క్షిపణులు కూడా కీలక పాత్ర వహించినట్లు సమాచారం. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఉంటే సరిపోదు. వాటిని ఎక్కడ మోహరించాలి అనే విషయంలో చాలా జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలి. భారత సైన్యం వాటిని సరైన ప్రదేశాల్లో మోహరించడం వల్లే ఎక్కువ టార్గెట్లను ధ్వంసం చేయగలిగింది. అలాగే ఈ వ్యవస్థల్ని ఉపయోగించడంలో సైన్యానికి నిరంతర శిక్షణ, అప్రమత్తత అవసరం. అంతేకాదు... వివిధ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఒకదానితో ఒకటి సమన్వయంతో పనిచేయాలి. ఒక వ్యవస్థకు అందిన సమాచారాన్ని సకాలంలో మరో వ్యవస్థతో పంచుకోవాలి. ఇవన్నీ సమర్థంగా చేయడంలో భారత సైన్యం విజయవంతమైంది.

అయితే భారత ఎయిర్ డిఫెన్స్‌ను దెబ్బతీయడానికి పాక్ మరో ఎత్తుగడ వేసింది. పెద్దసంఖ్యలో పనికిరాని చౌకబారు క్షిపణుల్ని, ఆయుధాల్లేని డ్రోన్లను కూడా భారత్‌పైకి ప్రయోగించింది. వీటి వల్ల పెద్దగా నష్టం లేకపోయినా మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్ని అయోమయంలోకి నెట్టడానికి ఇవి ఉపయోగపడతాయి. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు వీటిని కూల్చే పనిలో ఉన్నప్పుడు ఇతర డ్రోన్లు, క్షిపణులు దాడులు చేసేస్తాయి. ఇలాంటి ఎత్తుగడల్ని కూడా భారత సైన్యం తిప్పికొట్టగలిగింది. తుర్కియే డ్రోన్లలో చాలావాటిని యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్స్‌తోను, మరికొన్నింటిని ఎలక్ట్రానిక్ వ్యవస్థలతోను అడ్డుకుంది. మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలన్నింటినీ సమన్వయం చేయగలిగే ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ భారత్ స్వీయ రక్షణ వ్యూహంలో ప్రధానమైనది. వివిధ రేంజ్‌లు కలిగి, వివిధ ఎత్తుల నుంచి దాడి చేసే క్షిపణులు, డ్రోన్లు, ఎగిరే బాంబులను ఆపాలంటే అంచెలంచెలు కలిగిన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. వివిధ రాడార్లు, సెన్సర్లు, కమాండ్ పోస్టుల మధ్య అనుసంధానం ఏర్పరచుకోవాలి. యుద్ధాల్లో డ్రోన్లను పెద్ద సంఖ్యలో ఉపయోగించడం అనే ధోరణి ఇటీవలే మొదలైంది. మూడేళ్లకు పైగా జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో డ్రోన్లు అతి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆ యుద్ధం నుంచి పాఠాలు నేర్చుకుని వాటిని అతి త్వరగా, సమర్థంగా ఆచరణలో పెట్టడం వల్లే భారత్ పాక్ ఆకాశ దాడులను అద్భుతంగా తిప్పికొడుతోందని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి

రాఫెల్స్ కూల్చివేత వార్తల్లో నిజమెంత?

మూడు భారత్ రాఫెల్ విమానాలను కూల్చివేసినట్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రకటించారు. అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్టుగా "ఇవిగో రాఫెల్ విమాన శకలాలు" అంటూ పాకిస్థాన్ న్యూస్ వెబ్‌సైట్లు ఫొటోలు, వీడియోలతో సహా వార్తలు ఇచ్చా యి. భారత్-పాక్ సరిహద్దులో ఒక రాఫెల్ విమానం కూలిపోయిన మాట నిజమేనని ఫ్రాన్స్‌కు చెందిన ఒక ఇంటెలిజెన్స్ అధికారి ధ్రువీకరించినట్లు సీఎన్ఎన్ తెలిపింది. దీనితో పాక్ మీడియా ఇచ్చిన ఫేక్ వార్తలకు మరింత బలం చేకూరింది. కానీ దీనిపై లోతుగా ఆరా తీయగా ఆ ఫ్రెంచ్ అధికారి భారత్‌కు చెందిన ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక వెబ్‌సైట్‌లో వచ్చిన వార్త ఆధారంగా అలా చెప్పినట్లు స్పష్టమైంది. దీనిపై ఆ పత్రికను సంప్రదించగా తాము పొరపాటున



తప్పుడు వార్త ఇచ్చామని, దానిని తమ వెబ్‌సైట్ నుంచి తొలగించామని సమాధానం ఇచ్చారు. ఒక విరాజ్ విమానం డ్రాప్ ట్యాంక్ తాలూకు శకలాలను తాము విమాన శకలాలుగా పొరబడినట్లు తెలిపారు. (డ్రాప్ ట్యాంక్ అంటే.. యుద్ధ విమానాలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వచ్చినప్పుడు వాటి కింది భాగంలో తాత్కాలికంగా అమర్చే ఇంధన ట్యాంకులు. యుద్ధ విమానాలు వేగంగా ప్రయాణించాలని అనుకున్నప్పుడు, బరువు తగ్గించుకోవాలనుకున్నప్పుడు ఈ డ్రాప్ ట్యాంకుల్ని కిందికి జార విడిచి వెళ్లిపోతాయి) ఈ డ్రాప్ ట్యాంకుపై ఫ్రెంచ్ అక్షరాలు ఉండడంతో దానిని రాఫెల్ విమానంగా ఆ పత్రిక పొరపాటుపడిందని సమాచారం. ఇక పాక్‌కు చెందిన యుద్ధ విమానం ఒకటి భారత రాఫెల్ విమానాన్ని కూల్చివేసిందంటూ ఒక వీడియోను పాక్ మీడియా చూపుతోంది. అయితే ఆ వీడియో 2025 ఏప్రిల్‌లో పొలాల్లో కూలిపోయిన పాక్ మిరాజ్ విమానం తాలూకుదని ఫ్యాక్ట్ చెక్‌లో వెల్లడైంది. భారత్‌కు చెందిన ఒక డ్రోన్‌ను కూల్చివేసినట్లు పాక్ ఆర్మీ సోషల్ మీడియా ద్వారా ప్రకటిస్తూ ఒక ఫొటో పోస్టు చేసింది. అయితే ఈ ఫొటోలో ఉన్నది రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో 2022లో కూలిన ఇరాన్ డ్రోన్ తాలూకుదని బయటపడింది.

పాక్ ఆకాశ నేత్రం నేలమట్టం

'అవాక్స్'ను కూల్చివేసిన భారత సైన్యం

వైమానిక రాడార్ వ్యవస్థకు కోలుకోలేని దెబ్బ

న్యూఢిల్లీ, మే 9: భారత్‌లోని 15 నగరాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో పాకిస్థాన్ చేసిన దాడి ప్రయత్నాలను భారత సైన్యం సమర్థవంతంగా భగ్నం చేసింది. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను ధ్వంసం చేయడమే కాకుండా.. ఆ దేశానికి అత్యంత కీలకమైన ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (అవాక్స్)ను కూడా కూల్చివేసింది. ఆకాశ నేత్రంగా పిలిచే అవాక్స్ అనేది ఒక వైమానిక రాడార్ వ్యవస్థ. రాత్రివేళ దాడి కోసం పాక్ దీన్ని యాక్టివేట్ చేసింది. ముందే గుర్తించిన భారత్... పంజాబ్ ప్రావిన్స్‌లో దాన్ని కూల్చివేసింది. ఇది పాక్‌కు కోలుకోలేని ఎదురుదెబ్బే. ఎందుకంటే ఈ విమానం ఓ సాధారణ రాడార్ కాదు. శత్రు విమానాలు, క్షిపణుల కదలికలపై నిఘా పెట్టి, కీలక సమాచారం అందించే ఆకాశ నేత్రం. ఇలాంటి వ్యవస్థ నాశనం కావడమంటే పాక్ వైమానిక వ్యూహం అర్ధంతరంగా నిలిచిపోవడమే. పాకిస్థాన్ వద్ద మొత్తం 9 అవాక్స్ విమానాలున్నాయి.



అవాక్స్ ఏం చేస్తుంది..?

అవాక్స్ అంటే ఒక ఎగిరే రాడార్ స్టేషన్. దీన్ని విమానంపైన అమర్చుతారు. ఇది దూరం నుంచి వచ్చే వైమానిక, ఉపరితల దాడులను గుర్తిస్తుంది.

- అవాక్స్‌లో ఉన్న ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు దాడి జరిగే ప్రమాదాన్ని గుర్తించి కమాండ్ సెంటర్లకు సమాచారం అందిస్తాయి.
- శత్రువులు.. విమానాలు, డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించినప్పుడు అవి గ్రౌండ్ స్టేషన్ రాడార్ల పరిధిలోకి ప్రవేశించకముందే అవాక్స్ గుర్తిస్తుంది.
- 360 డిగ్రీల మేరకు నిఘా చేయగల అవాక్స్ రాడార్ పరిధి 350 నుంచి 400 కిలోమీటర్లు.
- అవాక్స్‌ను పర్యవేక్షించేందుకు, కమ్యూనికేషన్ చేసేందుకు 5-6 మంది ఆపరేటర్లు ఉంటారు. ఇది గాల్లో ఉన్నప్పుడు 20-25 లక్ష్యాలను పర్యవేక్షించి.. యుద్ధ విమానాలకు సూచనలు ఇవ్వగలదు.
- అవాక్స్ వ్యవస్థలో సురక్షితమైన ఉపగ్రహ కమ్యూనికేషన్, ఎన్‌క్రిప్టెడ్ డేటా వంటి అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయి.
- ఇది యుద్ధ విమానాలు, భూ ఆధారిత రాడార్లు, ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థలు, నౌకలకు సమాచారం అందిస్తుంది


భారత సైన్యం దాడులతో

కరాచీ పోర్టు బాగా దెబ్బతింది!

» పోర్ట్ ట్రస్ట్ అధికారిక 'ఎక్స్'లో పోస్ట్

» తర్వాత మాటమార్చి మరో పోస్ట్

» తమ ఖాతా హ్యాకయ్యిందని.. పోర్ట్ సురక్షితంగానే ఉందని వివరణ



కరాచీ పోర్టు(ఫైల్)

న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్‌కు వాణిజ్యపరంగా అత్యంత కీలకమైన కరాచీ ఓడరేవుపై భారత నౌకాదళం దాడి చేసిందా? అంటే.. చేసిందని, భారత్ దాడుల కారణంగా గణనీయమైన డ్యామేజ్ జరిగిందని సాక్షాత్తూ కరాచీ పోర్ట్ ట్రస్టే తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించింది! కరాచీ పోర్టుపై భారత నేవీ ఐఎన్ఎస్ విక్రాంత్ బ్యాటిల్ గ్రూప్ నుంచి బ్రహ్మోస్ క్షిపణుల వర్షం కురిపించిందంటూ గురువారం రాత్రి వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ వార్తలను ఖండిస్తూ కరాచీ పోర్ట్ ట్రస్ట్ తొలుత శుక్రవారం ఉదయం 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టింది. పోర్టుపై దాడి జరిగిందంటూ మీడియాలో వచ్చిన కథనాలన్నీ పూర్తిగా అసత్యాలని, ఆధారాల్లేని కథనాలని కొట్టిపారేసింది. పోర్టులో ఓడల రాకపోకలు, కార్గో హ్యాండ్లింగ్ ఎప్పటిలాగానే జరుగుతున్నట్టు వెల్లడించింది. కానీ, ఆ తర్వాత గంటకే మాట మార్చి.. భారత దాడుల కారణంగా పోర్టు ఆస్తులకు ఆమోదయోగ్యం కానంత హాని జరిగిందని.. ఈ నేపథ్యంలో అత్యవసర స్పందన చర్యలు చేపట్టామని.. పునరుద్ధరణపై తరచుగా అప్‌డేట్లు ఇస్తామని పేర్కొంది. ఈ నష్టం నుంచి తాము కోలుకుంటామని ధీమా వ్యక్తం చేసింది. మళ్లీ కొద్దిసేపటికే.. తమ 'ఎక్స్' ఖాతా హ్యాక్ అయ్యిందంటూ అదే అధికారిక ఖాతాలో మరో పోస్టు పెట్టింది. "కరాచీ పోర్ట్ సురక్షితంగా, భద్రంగా ఉంది" అని అందులో వివరించింది. మరోవైపు.. పాక్ ఆర్థిక శాఖ కూడా 'అంతర్జాతీయ భాగస్వాములందరూ తమను రుణాలిచ్చి ఆదుకోవాల'ని కోరుతూ తన 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్టు పెట్టింది. భారత్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించడంలో సహకరించాలని అందులో విజ్ఞప్తి చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే.. తమ ఎక్స్ ఖాతా హ్యాక్ అయిందంటూ మరో పోస్టు పెట్టింది. రుణమిచ్చి ఆదుకోవాలంటూ అంతకుముందు పెట్టిన పోస్టు తమది కాదని అందులో పేర్కొంది.

పాక్‌కు అమెరికా ఝలక్!

తాజా సంక్షోభంలో జోక్యం చేసుకోం.. చేతులెత్తేసిన ట్రంప్ యంత్రాంగం

» ఆయుధాలు వదిలేయాలని ఎవరినీ కోరం

» తేల్చిచెప్పిన ఉపాధ్యక్షుడు వాన్స్



న్యూయార్క్/న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్ పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పుడు, భారత్ నుంచి దానికి ప్రమాదం పొంచి ఉన్నప్పుడల్లా రంగంలోకి దిగి ఆదుకునే మిత్ర దేశమైన అమెరికా.. తొలిసారి ఆ దేశానికి మొండి చేయి చూపింది. పహల్గాంలో ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను పొట్టనపెట్టుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన భారత్.. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీవోకే)లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా పాక్ డ్రోన్లతో భారత స్థావరాలపై దాడికి ప్రయత్నించి చావుదెబ్బ తిన్నది. భారత బలగాలు... చైనా నుంచి పాక్ దిగుమతి చేసుకున్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలన్నిటినీ ధ్వంసం చేశాయి. కరాచీపై బ్రహ్మోస్ క్షిపణులతో దాడిచేశాయి. భారత్ ప్రతిస్పందన ఇంత తీవ్రంగా ఉంటుందని పాకిస్థాన్, చైనా, తుర్కియేతో పాటు అమెరికా కూడా ఊహించలేదు. ఉగ్రస్థావరాలపై ఇండియా చేసిన దాడులను సమర్థించిన అధ్యక్షుడు ట్రంప్.. కవ్వింపులకు దిగవద్దని పాక్‌ను ముందే హెచ్చరించారు. అయినా 15 భారతీయ నగరాలను డ్రోన్లు, రాకెట్లతో ధ్వంసం చేయడానికి పాక్ సైన్యం ప్రయత్నించింది. వాటిని సమర్థంగా అడ్డుకుని నాశనం చేసిన భారత్.. నిర్ణయాత్మక దాడులకు సర్వసన్నద్ధంగా ఉంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో గురువారం పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్‌కు ఫోన్ చేసి ఉద్రిక్తతలు పెంచవద్దని సూచించారు. అయినా పరిస్థితుల్లో మార్పు లేకపోవడం, భారత్‌పై డ్రోన్ దాడులను పాక్ కొనసాగించడంతో.. అమెరికా ప్రభుత్వం ఇండియాకే సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సంక్షోభంలో జోక్యం చేసుకోబోమని ఉపాధ్యక్షుడు జేమ్స్ వాన్స్ శుక్రవారం తేల్చి చెప్పారు. ఆయన 'ఫాక్స్ న్యూస్'తో మాట్లాడుతూ.. దౌత్యం ద్వారా ఉద్రిక్తతలు చల్లార్చేందుకు ప్రోత్సహిస్తామని.. కానీ సైనికంగా తలదూర్చబోమని స్పష్టం చేశారు. ఆయుధాలు వదిలేయాలని ఎవరినీ కోరబోమని, దౌత్య చర్చలతోనే ఉద్రిక్తతలు చల్లార్చుకోవాలని సూచించారు. పాక్‌కు దన్నుగా నిలిచేది లేదని అమెరికా బహిరంగంగా ప్రకటించడంతో పాక్ ప్రధాని షెహబాజ్‌కు, ఆర్మీ చీఫ్ మునీర్‌కు ఏమీ పాలుపోవడం లేదు. పైగా ఎప్పుడూ అండగా నిలిచే సౌదీ అరేబియా, యూఏఈ కూడా భారత్‌కే మద్దతిస్తున్నాయి. ఇప్పుడు పాక్‌కు మిగిలింది తుర్కియే, చైనా, అజర్‌బైజాన్ మాత్రమే. తాజా సంక్షోభంలో తుర్కియే డ్రోన్లు, రాకెట్లు.. చైనా హెచ్‌క్యూ 9, ఎల్‌వై 80 వంటి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను భారత్ నిర్వీర్యం చేసింది. పాక్‌తో కలిసి తాను అభివృద్ధి చేసిన జేఎఫ్-17 ఫైటర్లను సైతం నేలకూల్చడం చైనాకు మింగుడుపడడం లేదు. సంక్షోభం తీవ్ర రూపం దాల్చితే పై మూడు దేశాలు మున్ముందు మరింత సాయం అందించడం అనుమానమేనని దౌత్యవేత్తలు అంటున్నారు.

సంక్షోభాన్ని త్వరగా ముగించేలా చర్యలు తీసుకోవాలి

భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ ట్రంప్ సూచన

వాషింగ్టన్ : భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తగ్గేలా త్వరగా చర్యలు తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరుకుంటున్నట్లు వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు. రెండు దేశాల నేతలతో ట్రంప్‌నకు సత్సంబంధాలున్నాయని ఆమె గుర్తు చేశారు. సంక్షోభాన్ని పరిష్కరించేందుకు విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఇప్పటికే భారత్-పాక్ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని లీవిట్ తెలిపారు.





పాకిస్థాన్‌లోని ధంధర్ రేంజర్స్ పోస్టును ధ్వంసం చేస్తున్న దృశ్యం

జమ్మూలో చొరబాటుకు ఉగ్రవాదుల యత్నం

» ఏడుగురిని హతమార్చిన బీఎస్ఎఫ్

న్యూఢిల్లీ/జమ్మూ, మే 9: దేశంలోకి ఉగ్రవాదుల చొరబాటు యత్నాలను బీఎస్ఎఫ్ భగ్నంచేసింది. భారత్-పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ముష్కరుల ప్రయత్నాలను అడ్డుకుని ఏడుగురిని హతమార్చడమే కాకుండా ఒక రేంజర్స్ పోస్టును ధ్వంసం చేసినట్టు శుక్రవారం బీఎస్ఎఫ్ పేర్కొంది. సాంబ జిల్లాలో గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఉగ్రవాదులకు సంబంధించిన పెద్ద గ్రూప్‌ను గుర్తించామని, అనంతరం వారి చొరబాటు చర్యలను అడ్డుకుని ఏడుగురిని మట్టుబెట్టినట్టు తెలిపింది. అలాగే పాకిస్థాన్‌లోని ధంధర్ పోస్టును ధ్వంసం చేసినట్టు పేర్కొంది. ఈ చొరబాటు యత్నానికి పాకిస్థాన్ రేంజర్స్ పోస్టు నుంచి కాల్పుల మద్దతు ఉన్నట్టు వెల్లడించింది.

రంగంలోకి ప్రాదేశిక సైన్యం!

అవసరమైతే పిలిపించాలన్న కేంద్రం.. ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారాల అప్పగింత

టెరిటోరియల్ ఆర్మీలో 50 వేల మంది సిబ్బంది.. వీరిలో క్రీడాకారులు, రాజకీయ నేతలు కూడా

న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అవసరమైతే ప్రాదేశిక సైన్యం (టెరిటోరియల్ ఆర్మీ)ని కూడా రంగంలోకి దించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రాదేశిక సైన్యంలోని అధికారులను, నమోదు చేసుకున్న సిబ్బందిని పిలవాల్సిందిగా ఆర్మీ చీఫ్‌కు సూచించింది. ఇప్పటికే డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసిన పాక్‌ను భారత్ సమర్థంగా అడ్డుకున్న విషయం తెలిసిందే. పాక్ చేసిన ఆ రెండు ప్రయత్నాలు విఫలం కావడంతో ఆ దేశం మరో కుతంత్రానికి తెర తీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో దాడులు చేసి భారత్‌ను ఇబ్బంది పెట్టేలా పాక్ పన్నాగం పన్నుతోంది. పాక్‌కు ఆ అవకాశం ఇవ్వకుండా భారత ఆర్మీని మరింత దృఢంగా తయారు చేసేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భారత ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారాలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందు కూడా ప్రాదేశిక సైన్యం సిబ్బంది పలు సందర్భాల్లో యుద్ధాల్లో పాల్గొన్నారు. 1962లో చైనాతో, 1965, 1971లో పాకిస్థాన్‌తో యుద్ధాల్లో ప్రాదేశిక సైన్యం.. భారత ఆర్మీతో కలిసి పని చేసింది. ప్రకృతి వైపరీత్యాల్లోనూ వీరు సేవలందించారు.

ప్రాదేశిక సైన్యం అంటే?

ప్రాదేశిక సైన్యం అనేది భారత సైన్యానికి రిజర్వ్ ఫోర్స్. దేశంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు భారత ఆర్మీకి సహకారం అందించేందుకు ఈ సైన్యం సిద్ధంగా ఉంటుంది. వీరంతా రెగ్యులర్ ఆర్మీలో భాగమే అయినా.. నిరంతరం సైన్యంతో ఉండరు. యుద్ధంలో అవసరమైన సందర్భాల్లో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రంగంలోకి దిగుతారు. వీరంతా బయట ఇతర ఉద్యోగాలు, స్వయం ఉపాధి పొందుతూనే స్వచ్ఛందంగా సైన్యంతో పనిచేస్తుంటారు. ప్రాదేశిక సైన్యం రెండు యూనిట్లుగా ఉంది. మొదటిది.. ప్రభుత్వరంగ సంస్థలు, భారత రైల్వే, మాజీ సైనికోద్యోగులతో కూడిన డిపార్ట్‌మెంటల్ యూనిట్. రెండోది.. సాధారణ పౌరులతో కూడిన నాన్ డిపార్ట్‌మెంటల్ యూనిట్. శారీరకంగా, మానసికంగా తగిన ఫిట్‌నెస్ ఉన్నవారినే ఈ సైన్యంలోకి తీసుకుంటారు. ఇందులోని సిబ్బంది, అధికారులకు రెగ్యులర్ ఆర్మీ తరహాలోనే శిక్షణ ఇస్తారు. కనీసం ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారికి పింఛనుతోపాటు ఇతర ప్రయోజనాలు అందజేస్తారు. ప్రస్తుతం 32 బెటాలియన్లలో దాదాపు 50 వేల మంది ఈ ఆర్మీలో ఉన్నట్లు సమాచారం. పలువురు పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు కూడా వీరిలో ఉంటారు. మలయాళ నటుడు మోహన్‌లాల్, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎం.ఎస్.ధోనీ, దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్, రాజకీయ పార్టీల నేతలు సచిన్ పైలట్, అనురాగ్ ఠాకూర్, అభినవ్ బింద్రా తదితరులు ప్రాదేశిక సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ హోదా కలిగి ఉన్నారు.

ఉద్రిక్తంగానే..!



శ్రీనగర్‌లో బ్లాక్‌అవుట్ ప్రకటించడంతో చీకట్లో వీధులు

(మొదటిపేజీ తరువాయి)

స్థావరమే లక్ష్యంగా చేసిన దాడిని భారత్ సమర్థంగా అడ్డుకుంది. అయితే, అవంతిపుర వైమానిక స్థావరం చుట్టుపక్కల పేలుళ్లు వినిపించాయి. పాకిస్థాన్ డ్రోన్లను గగనతలంలోనే పేల్చేయడంతో బారాముల్లాలో ఆకాశం అరుణ వర్ణాన్ని తలపించింది. పాక్ డ్రోన్ బాంబు దాడిలో పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌కు చెందిన కుటుంబంలోని ముగ్గురు శుక్రవారం రాత్రి గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. జమ్ము కశ్మీరులోని జమ్ము, సాంబ, రాజౌరి; పంజాబ్‌లోని పఠాన్‌కోట; అమృత్‌సర్, రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌ల్లో డ్రోన్ దాడులు జరిగాయి. కుప్వారా, సాంబ, పూంచ్, యురి, నౌగమ్ హండ్వారాల్లో నియంత్రణ రేఖ వెంట భారీగా శతఘ్ని గుళ్ల వర్షం కురిపించింది. అలాగే, జమ్ము, పఠాన్ కోట్‌ల్లో రెండో రోజూ సైరన్లు వినిపించాయి. చిమ్మ చీకట్లు నెలకొన్నాయి. అమృత్‌సర్‌లో భారీగా కాల్పులు జరిగినట్లు తెలిసింది. డ్రోన్లు తిరగడం కనిపించింది. జమ్ము, కశ్మీర్, పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, జైసల్మేర్‌ల్లో పేలుళ్లు వినిపించాయి. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్, తరణ్ తరణ్ వాసులు కూడా తమకు పేలుళ్లు వినిపించాయని చెప్పారు. వరుసగా రెండో రోజు కూడా జైసల్మేర్‌లో డ్రోన్ దాడులను మన దళాలు అడ్డుకున్నాయి. ఇక, భారీ పేలుళ్లు తనకూ వినిపించాయని జమ్ము కశ్మీరు సీఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. "అప్పుడప్పుడు భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయి. అవి భారీ శతఘ్నులు కావచ్చు. ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా.. ఎవరూ వీధుల్లో తిరగొద్దు. మరికొన్ని గంటలపాటు ఇళ్లల్లోనే ఉండండి. వదంతులను నమ్మొద్దు" అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అలాగే, ఇళ్లల్లో లైట్లను ఆర్పేయాలంటూ మసీదుల్లోని లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రకటిస్తున్నారు. మరోవైపు, జమ్ము, సాంబ జిల్లాల్లోని సుచేత్‌గఢ్, రామ్‌గఢ్ సెక్టార్లలో చొరబాట్లకు అనుకూలంగా భారీగా గుళ్ల వర్షం మొదలైంది. ప్రస్తుత పరిస్థితిపై తమలో భయాందోళనలు నెలకొన్నాయని, అయినా, పాకిస్థాన్ కుట్రలను మన సైన్యం తిప్పికొడుతుందన్న భరోసా ఉందని పఠాన్‌కోట్‌లో స్థానికులు చెప్పారు.

అమృత్‌సర్‌లో లోహ శకలాలు

అమృత్‌సర్‌లోని జెథువాల్ గ్రామంలో స్థానికులు లోహ శకలాలను గుర్తించారు. అవి క్షిపణి భాగాలుగా అనుమానిస్తున్నారు. స్థానిక పోలీసులు దానిపై సైన్యానికి సమాచారమిచ్చారు. దర్యాప్తు తర్వాతే వివరాలు వెల్లడవుతాయని వారు వివరించారు. అలాగే, కచ్ జిల్లాలోని మారుమూల ఖావ్‌డా గ్రామంలోనూ డ్రోన్ శకలాలను గుర్తించారు. అలాగే, పాకిస్థాన్‌కు చెందిన పలు సైనిక పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయి. సంబంధిత వీడియోను భారత సైన్యం విడుదల చేసింది. రాజస్థాన్ జైసల్మేర్ జిల్లాలోని కిషన్‌ఘాట్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం బాంబులా ఉన్న దాన్ని గుర్తించారు. ముందు జాగ్రత్త చర్యగా ఆ ప్రాంతాన్ని దిగ్బంధించారు. ఆర్మీ నుంచి నిపుణులు వచ్చి దానిని పరిశీలిస్తున్నారు.



ఆ ఇద్దర్నీ అప్పగించండి!

» మసూద్ అజర్, హఫీజ్ సయీద్‌ను అప్పగించాల్సిందిగా భారత్ డిమాండ్?

» అధికార వర్గాలను ఉటంకిస్తూ న్యూస్18 కథనం

న్యూఢిల్లీ, మే 9: ఉద్రిక్తతలను వీలైనంత త్వరగా తగ్గించాల్సిన బాధ్యత పాక్ మీదే ఉందని, లేనిపక్షంలో భారీ మూల్యం చెల్లించక తప్పదనిని కేంద్రంలో అత్యున్నత స్థాయి అధికార వర్గాలు హెచ్చరించాయి. అంతేకాదు.. భారత్‌లో దాడులకు పాల్పడిన ఉగ్రవాద సంస్థలు జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజర్, లష్కరే తాయిబా వ్యవస్థాపకుడు సయీద్‌ను తమకు అప్పగించాల్సిందిగా కూడా ఇస్లామాబాద్‌ను భారత్ డిమాండ్ చేసినట్టు ఆ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఆ వర్గాలను ఉటంకిస్తూ న్యూస్18 వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. "పాకిస్థాన్ ఈ సమస్యకు అసలు కారణంపై దృష్టి సారించాలి. వారి గడ్డపై ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలి" అని అధికార వర్గాలు పేర్కొన్నట్టు అందులో వెల్లడించింది. మసూద్ అజర్, హఫీజ్ సయీద్‌ను అప్పగిస్తే పాక్‌కు ఈ యుద్ధాన్ని తప్పించుకోవడానికి ఒక దారి దొరికినట్టవుతుందని.. అదే సమయంలో, పాకిస్థాన్ ఉగ్రవాదుల స్వర్గధామమన్న అపప్రథను తొలగించుకునే అవకాశం కూడా కలుగుతుందని ఆ వర్గాలు అభిప్రాయపడ్డాయి.



త్రివిధ దళాధిపతులతో రాజ్‌నాథ్ భేటీ

న్యూఢిల్లీ, మే 9: సరిహద్దు రాష్ట్రాల్లో గురువారం రాత్రి పాకిస్థాన్ దాడులను భారత సైన్యం తిప్పికొట్టిన వేళ.. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శుక్రవారం త్రివిధ దళాధిపతులతో కీలక సమావేశం నిర్వహించారు. సీడీఎస్ అనిల్‌చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి హాజరు కాగా.. దేశ భద్రతపై రాజ్‌నాథ్ సమీక్షించారు. పాక్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితులను అంచనా వేయడం, తదుపరి చర్యలకు ప్రణాళిక రూపొందించడంపై ఇందులో చర్చించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి రాజ్‌నాథ్ శుక్రవారం పట్నాలో పర్యటించాల్సి ఉండగా.. రద్దు చేసుకుని ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోభాల్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరళ్లు, హోంశాఖ అధికారులతో తన నివాసంలో సమావేశమయ్యారు. దేశంలోని అన్ని కీలకమైన సంస్థలు, విమానాశ్రయాలు, విద్యుత్తు ప్లాంట్లు, పరిశోధన సంస్థల వద్ద భద్రత పెంచాలని ఆదేశించారు.

సైన్యం కదలికలపై ప్రత్యక్ష ప్రసారాలొద్దు

» మీడియా సంస్థలకు రక్షణ శాఖ సూచన

న్యూఢిల్లీ/అల్వాల్, మే 9 (ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ కార్యకలాపాలు, భద్రతా దళాల కదలికలపై ప్రత్యక్ష ప్రసారాల విషయంలో మీడియా సంయమనం పాటించాలని రక్షణ శాఖ సూచించింది. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో ఓ పోస్టు చేసింది. సైన్యానికి సంబంధించిన సున్నిత సమాచారాన్ని ముందస్తుగా బహిర్గతం చేయడం వల్ల కార్యాచరణ ప్రభావం దెబ్బతినడంతో పాటు వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లవచ్చు. కార్గిల్ యుద్ధం, 26/11 దాడులు, కాందహార్ హైజాక్ ఘటనల వేళ ముందస్తు మీడియా నివేదికలే ప్రమాదాలకు దారితీశాయి. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్(సవరణ) చట్ట నిబంధనల మేరకు ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు జరుగుతున్నప్పుడు సంబంధిత అధికారులే వివరాలు వెల్లడిస్తారు. మీడియా బాధ్యతాయుతంగా ఉండాలని కోరుతున్నాం' అని పేర్కొంది.

భద్రతపై ప్రధాని ఉన్నతస్థాయి సమావేశం

» త్రివిధ దళాధిపతులు, రాజ్‌నాథ్‌తో భేటీ

» మాజీ అధికారులతో కీలక చర్చలు

న్యూఢిల్లీ, మే 9: పాక్‌తో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం రక్షణశాఖకు సంబంధించి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోభాల్, సీడీఎస్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు.. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠితో ప్రధాని భేటీ అయ్యారు. దేశ భద్రత సన్నద్ధతపై ఆరా తీశారు. భవిష్యత్తు కార్యాచరణపైనా వారితో చర్చించినట్లు సమాచారం. అంతకుముందు త్రివిధ దళాల మాజీ అధ్యక్షులు, వాటిలో పనిచేసి రిటైరయిన పలువురు సీనియర్ అధికారులతో ప్రధాని మోదీ మాట్లాడారు. వారితో కీలక విషయాలపై చర్చించారు. మరోవైపు గుజరాత్ ముఖ్యమంత్రికి ప్రధాని ఫోన్ చేశారు. సరిహద్దుల్లో ఉద్రిక్తత నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల దృష్ట్యా గుజరాత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా బాణసంచా, డ్రోన్లపై నిషేధం విధిస్తున్నట్లు ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి ప్రకటించారు.



త్రివిధ దళాధిపతులతో నిర్వహించిన సమావేశంలో ప్రధాని మోదీ, రాజ్‌నాథ్

ఏ పరిస్థితులకైనా సిద్ధం!





పాక్ దాడిలో గాయపడిన చిన్నారిని పరామర్శిస్తున్న జమ్మూకశ్మీర్ ఎల్జీ మనోజ్ సిన్హా, ఢిల్లీలో ఓ భవనంపై సైరన్

(మొదటిపేజీ తరువాయి)

డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. కీలక సంస్థల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు కీలక స్థావరాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీగా ఉండే మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, మాల్స్, పార్కులు, మెట్రో స్టేషన్లలో నిఘాను; వీవీఐపీల నివాస ప్రాంతాల్లో భద్రతను పెంచారు. పర్యాటక ప్రదేశాలు, కేంద్ర కార్యాలయాల వద్ద దుకాణాలను మూసివేయించారు. "సైరన్లను అమర్చుతున్నాం. ఎత్తయిన భవనాలపై ఏర్పాటు చేసి, వీటి పనితీరును పరిశీలిస్తున్నాం. ఢిల్లీలోని 11జిల్లాల పరిధిలో 10 సైరన్లు ఏర్పాటు చేశాం" అని అధికారులు వెల్లడించారు. ఇవి శబ్దం చేసినప్పుడు ఎలా స్పందించాలనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మరోవైపు దేశవ్యాప్తంగా ఆస్పత్రుల సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఢిల్లీలోని ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్, రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది సెలవులను రద్దు చేశారు. అత్యవసర సేవల నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు.

పలు రాష్ట్రాల్లో ఉద్యోగుల సెలవులు రద్దు

ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దయ్యాయి. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేలా వైద్య, విపత్తు నిర్వహణ విభాగాల సంసిద్ధతను సమీక్షిస్తున్నారు. బ్లాక్ అవుట్ విషయంలో ప్రజలకు సూచనలు చేశారు. ఢిల్లీ విమానాశ్రయంలో రెండ్రోజుల్లో 228 విమానాలు రద్దయ్యాయి. శుక్రవారం ఒక్క రోజే 138విమానాలు రద్దయ్యాయి. మరోవైపు.. శ్రీనగర్, చండీగఢ్ సహా ఈశాన్య, పశ్చిమ భారతదేశంలోని 24 విమానాశ్రయాలను ఈ నెల 15వరకు మూసివేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా అన్ని ఎయిర్‌పోర్టుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సరిహద్దు జిల్లాలకు పాక్ నుంచి దాడుల ముప్పు పొంచి ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. చండీగఢ్‌లో శుక్రవారం ఉదయం నుంచి మరోసారి సైరన్ల మోత వినిపించడం ప్రజలను ఆందోళనకు గురిచేసింది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఓ హోటల్ వద్ద పాక్ డ్రోన్ శకలాలు లభ్యమయ్యాయి. బీఎస్ఎఫ్ క్యాంప్‌ను లక్ష్యంగా చేసుకొని డ్రోన్‌ను పంపగా.. బలగాలు కూల్చేశాయి.

జమ్మూ నుంచి ఢిల్లీకి 3 ప్రత్యేక రైళ్లు

జమ్మూలోనూ శుక్రవారం ఉదయం సైరన్లు మోగాయి. తెల్లవారుజామున పేలుడు శబ్దాలు వినిపించినట్లు తెలుస్తోంది. దీంతో నగరాన్ని బ్లాక్‌అవుట్ చేశారు. శ్రీనగర్‌లోనూ లైట్లు ఆర్పేసి ఇళ్లలోనే ఉన్నట్లు స్థానికులు తెలిపారు. దాడుల నేపథ్యంలో స్థానికులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. జమ్మూ, ఉధంపూర్ నుంచి ఢిల్లీకి మూడు ప్రత్యేక రైళ్లను నడిపే యోచనలో ఉన్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. కాగా, దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అన్ని ప్రధాన స్టేషన్లకు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేసినట్లు సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాలకు రైళ్లు యథావిధిగా నడుస్తున్నాయని.. ఆ యాత్రాంతాలకు అత్యవసరమైతేనే వెళ్లాలని, లేకుంటే రద్దు చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

గుజరాత్ సీఎంకు మోదీ ఫోన్

సరిహద్దుల్లో ఉద్రిక్తతల వేళ భద్రతా సన్నద్ధతపై ప్రధాని మోదీ ఆరా తీశారు. గుజరాత్ ముఖ్యమంత్రికి ఫోన్ చేసి, ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సున్నిత ప్రాంతాలైన కచ్, బనస్కంతా, పటాన్, జామ్‌నగర్‌లో పౌరుల భద్రత కోసం చేపడుతున్న చర్యల గురించి అడిగారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో గుజరాత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా బాణసంచా, డ్రోన్లపై నిషేధం విధిస్తున్నట్లు ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి ప్రకటించారు.

పాక్ కాల్పులతో బారాముల్లాలో ధ్వంసమైన ఇల్లు



నిత్యావసరాలకు ఎలాంటి కొరత లేదు

» దేశంలో అవసరానికి మించి ఆహార ధాన్యాల నిల్వలున్నాయి

» ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం: కేంద్ర మంత్రి ప్రహ్లాద్

న్యూఢిల్లీ, మే 9: సరిహద్దు రాష్ట్రాల్లో హడావుడిగా నిత్యావసరాలు కొని నిల్వ చేసుకుండటంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. దేశంలో పప్పులు, కూరగాయలు సహా ఎలాంటి నిత్యావసరాలకు కూడా కొరత లేదని.. సరిపడా నిల్వలు ఉన్నాయని ప్రకటించింది. జనం ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భారీగా సరుకులు నిల్వ చేసుకుని, కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "దేశంలో నిత్యావసరాల కొరత తలెత్తుతోందంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దు. దేశంలో అవసరానికి మించి ఆహార పదార్థాల నిల్వలు ఉన్నాయి. ట్రేడర్లు, హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు ప్రభుత్వానికి సహకరించాలి. భారీగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే.. కఠిన చర్యలు చేపడతాం. ధరలనూ నిత్యం పర్యవేక్షిస్తున్నాం.." అని తెలిపారు. దీనికి సంబంధించి వివిధ రాష్ట్రాల్లో ఆహార, నిత్యావసర సరుకుల సరఫరా, నిల్వలపై రాష్ట్రాల కార్యదర్శులు, సరుకుల ఉత్పత్తిదారులతో కేంద్ర ప్రభుత్వం సమావేశాలు నిర్వహిస్తోందని వెల్లడించారు. కాగా, సరిహద్దు రాష్ట్రాల్లో జనం పెట్రోల్ బంకులకు పోటెత్తడం, వంటగ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకుంటుండటంపై ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ స్పందించాయి. "దేశవ్యాప్తంగా గణనీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు ఉన్నాయి. ఎలాంటి ఆటంకం లేకుండా సరఫరా జరుగుతోంది. ఎవరూ హడావుడి కొనుగోళ్లు, నిల్వ చేసుకోవడం వంటివి చేయవద్దు.." అని పేర్కొన్నాయి. మరోవైపు.. పౌర రక్షణ విభాగాలకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసుకునే అధికారం ఇవ్వాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. మరోవైపు.. మొబైల్ సేవలకు ఎలాంటి ఆటంకం తలెత్తవద్దన్న కేంద్రం సూచన మేరకు టెలికం కంపెనీలు చర్యలు చేపట్టాయి. ప్రతి సంస్థ జాతీయ స్థాయిలో కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయడం, ఒక నోడల్ అధికారిని నియమించడం, విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు సర్వీసులకు ఆటంకం కలగకుండా టవర్ల వద్ద జనరేటర్ల కోసం సరిపడా డీజిల్ నిల్వ ఉంచడం వంటి చర్యలు చేపట్టాయి. మరోవైపు ఏటీఎంలలో నగదు రావడం లేదని, కొరత ఏర్పడిందన్న ప్రచారాన్ని ఎస్‌బీఐ, పీఎన్‌బీసహా జాతీయ బ్యాంకులన్నీ ఖండించాయి. దేశంలోని అన్ని బ్యాంకులు, ఏటీఎంల్లో సరిపడా నగదు ఉందని స్పష్టం చేశాయి.

చార్మినార్‌కు 400 ఏళ్లా?

మా దేశ చరిత్ర కంటే ఎక్కువ

నా కాళ్లు నిలవడం లేదు.. చార్మినార్ చూసి లాడ్ బజార్‌లో తిరుగుతా

- ఇక్కడి బిర్యానీ అద్భుతం..
- మిస్ కెనడా వరల్డ్ ఎమ్మా మోరిసన్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



హైదరాబాద్, మే 9, (ఆంధ్రజ్యోతి): మిస్ కెనడా వరల్డ్ కిరీటం గెలుచుకున్న ఆ దేశ తొలి ఆదివాసీ తెగ మహిళ. ఎందరో శ్వేతవర్ణ భామలతో పోటీపడి గెలిచిన భూమిబిడ్డ. కేవలం 1,900 మంది జనాభా ఉన్న గ్రామంలో పుట్టారు. అందాల పోటీలని కాకుండా.. ఈ పోటీల్లోనూ ఒక అర్థం, పరమార్థం ఉందనే ఆలోచనతో ఆ వైపు మళ్లారు. మిస్ వరల్డ్ పోటీల్లో కెనడా తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు హైదరాబాద్ వచ్చారు. శుక్రవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: హైదరాబాద్ ఎలా ఉంది?

ఎమ్మా మోరిసన్: అద్భుతంగా ఉంది. కెనడా నుంచి ఇక్కడికి రావడానికి 27 గంటలు పట్టింది. రెండు విమానాలు మారాను. కానీ ఇక్కడికి వచ్చాక.. సొంత ప్రదేశం, సొంతిల్లు వంటి అనుభూతి పొందా. మా తండ్రితో కలిసి ఇక్కడికి వచ్చా. అద్భుత స్వాగతం లభించింది.

అందాల పోటీల్లో పాల్గొనాలనే ఆలోచన ఎలా వచ్చింది?

మాదొక చిన్న గ్రామం. చిన్నప్పుడు పాఠశాలకు వెళ్లడం. చుట్టుపక్కల ఉండే గుట్టలు, కొండలు ఎక్కడం, ఆటలాడడం, చేపలు పట్టడం, సాయంత్రానికి మురికిగా తయారవడమే పని. 2017లో ఒకాయన నన్ను కలిసి.. అందాల పోటీల్లో పాల్గొంటావా? అని అడిగారు. అప్పటికి అందాల పోటీలంటే నాకున్న అభిప్రాయం వేరు. అందుకే కాదని చెప్పాను. తర్వాత అధ్యయనం చేస్తే.. ఈ పోటీలకు అందమొక్కటే కాదు.. అంతః సౌందర్యం, అనేక మందికి సేవ చేసే అవకాశం, మనం ఎంచుకునే ప్రాజెక్టుకు నిధుల సేకరణ వంటివన్నీ ఉంటాయని తెలిసింది. అందాల పోటీలపై ఆసక్తి కలిగింది. మిస్ ఒంటారియో, మిస్ టీనేజ్ కెనడా, మిస్ కెనడా వరల్డ్ పోటీల్లో గెలిచా.

మీ బ్యూటీ విత్ ఏ పర్పస్ ప్రాజెక్టు ఏంటి?

మా అమ్మమ్మ నేర్పించినదే నా ప్రాజెక్టు అయింది. అదే 'రీ కనెక్టింగ్ విత్ రిబ్బన్ స్కర్ట్స్'. మా జాతి సంస్కృతికి, సంప్రదాయానికి అది చిహ్నం. అందులోని అల్లికలు మా మధ్య ఐకమత్యానికి ప్రతీక. స్కర్ట్ దారాల అల్లిక వెనుక అనేక కథలు. మహిళలను సంఘటితం చేసే ప్రత్యేకతలు. ఈ స్కర్ట్‌ల అల్లికలు, ఇతర సాయాల కోసం 10 వేల డాలర్ల నిధులు సేకరించా.

అందాల పోటీల్లో మీకు ఎప్పుడైనా కష్టంగా అనిపించిందా?

మిస్ కెనడా వరల్డ్ పోటీల్లో పాల్గొన్నప్పుడు తోటి పోటీదారులు వెకిలిగా మాట్లాడారు. 'ఆదిమ తెగ నుంచి వచ్చిందట. చారిటీ చెక్కులపై సంతకం కాలి బొటనవేలితో పెడుతుందా?' అని వెక్కిరించారు. బాధగా అనిపించింది. ఇక ఈ పోటీల కోసం కుటుంబం నుంచి దూరంగా ఉండటం ఇబ్బంది. కానీ నేనో పెద్ద లక్ష్యం వైపు వెళ్తున్నానని వారికి తెలుసు.

నేటి తరం మహిళలకు మీరిచ్చే సందేశమేంటి?

నేనే ఒక సందేశం. నేనే ఒక సాక్ష్యం. ఏ నేపథ్యం లేకుండా వచ్చాను. మిస్ కెనడా వరల్డ్‌గా ఎంపికయ్యాను. అనుకుంటే ఏదైనా సాధించవచ్చు. నేర్పు, ఓర్పు, హార్డ్ వర్క్ ఉంటే చాలు. కలలు నెరవేరుతాయి.

హైదరాబాద్‌లో ఏమేం చూడాలనుకుంటున్నారు?

చార్మినార్‌ను చూడాలి అనుకుంటున్నా. అది ఎన్ని వందల ఏళ్ల నుంచి ఉంది? (400 ఏళ్లని చెప్పడంతో..) ఓహ్ నా కాళ్లు నిలవడం లేదు. 400 ఏళ్లా? మా దేశ చరిత్ర కంటే ఎక్కువ అది. చార్మినార్ చూసి లాడ్ బజార్‌లో తిరుగుతా. చారిత్రక ప్రదేశాలతోపాటు ఇక్కడ నైట్ పబ్‌కు వెళ్తా.

భారత సంస్కృతి, సంప్రదాయాలపై మీ అభిప్రాయం?

భారతీయులు ఎవరినైనా చూడగానే నవ్వుతూ పలకరిస్తారు. సానుకూల దృక్పథంతో ఉంటారు. అందుకే నాకు భారత్ అంటే ఇష్టం. కెనడాలోనూ భారత సంస్కృతి ఉంది. మా ఊరిలో హోలీ సంబరాల్లో పాల్గొన్నా.

ఈసారి మిస్ వరల్డ్‌లో ప్రధాన పోటీలేంటి?

'బ్యూటీ విత్ ఏ పర్పస్' ప్రధాన పోటీ. ఎంపికైన ప్రాజెక్టుకు సంబంధించి బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ చేయాలి. అదే విధంగా స్పోర్ట్స్ ఫిట్‌నెస్ ఈవెంట్ ఉంటుంది. అమెరికా, యూరోప్, ఆసియా, ఆఫ్రికా దేశాల పోటీదారులందరితో ఫిట్‌నెస్, వాకింగ్, రన్నింగ్ పోటీలు ఉంటాయి.

మీకు నచ్చిన హైదరాబాదీ వంటకం?

చికెన్ బిర్యానీ. చాలా ఘాటుగా ఉంది. కెనడాలో ఇంత ఘాటైన ఆహారం ఉండదు. ఇక భోజనం అనంతరం తీపి పదార్థాలు బాగున్నాయి. టేబుళ్ల నిండా పెడుతున్నారు. ముట్టుకుంటే అందం పోతుందేమో అన్నంతగా అలంకరించి ఇస్తున్నారు.

మిస్‌వరల్డ్ పోటీలకు 5 వేల మందితో భద్రత

(మొదటి పేజీ తరువాయి)

పర్యవేక్షిస్తున్నారు. ఇక శనివారం గచ్చిబౌలి స్టేడియంలో పోటీల ప్రారంభ వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని పోలీసు బలగాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి. గ్రేహౌండ్స్, ఆక్టోపస్, క్విక్ రియాక్షన్ టీమ్స్‌ను ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లతోపాటు వేదిక వద్ద మోహరిస్తున్నారు. మొత్తం మూడంచెల భద్రతావలయంలో పోటీలు జరుగుతాయని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

హోటల్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్..

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే పోటీదారులకు బస ఏర్పాటుచేసిన హోటల్‌లోనే పోలీసులు కూడా "మల్టీ ఏజెన్సీ కమాండ్ కంట్రోల్ సెంటర్"ను ఏర్పాటు చేశారు. ఇందులో సివిల్ పోలీస్, ట్రాఫిక్, అగ్నిమాపక శాఖ, ఫుడ్ సేఫ్టీ, పోలీసు ఐటీ విభాగం సహా పలు విభాగాలు ఉన్నాయి. ప్రత్యేకంగా కొన్ని స్క్రీన్‌లు ఏర్పాటుచేశారు. ఎప్పటికప్పుడు రోడ్లపై ట్రాఫిక్‌తోపాటు, వేదిక వరకు వెళ్లే మార్గంతోపాటు, హోటల్‌ల్ పోటీదారులు ఉండే ఫ్లోర్‌లలోని సీసీ కెమెరాలను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పోలీసు ఐటీ విభాగం కీలకంగా ఉండగా, దాదాపు 40 మంది వివిధ పనుల బాధ్యతలను చూస్తున్నారు. మరోవైపు హోటల్‌తో పాటు గచ్చిబౌలి ప్రాంతంలో డ్రోన్లను వినియోగించేందుకు అవకాశం లేకుండా "నో డ్రోన్" జోన్‌గా ప్రకటించారు. హోటల్ దగ్గర మహిళా పోలీసులకే డ్యూటీలు వేశారు. హోటల్‌తో పాటు పరిసర ప్రాంతంలో కలిపి దాదాపు 2వేల మంది పోలీసులు డ్యూటీల్లో ఉండనున్నారు. ఆక్టోపస్‌లో రెండు టీమ్‌లను ఏర్పాటుచేశారు. డాగ్ స్క్వాడ్ కూడా హోటల్ దగ్గర ఉంది. హోటల్ దగ్గర బందోబస్తును సైబరాబాద్ స్పెషల్‌బ్రాంచ్ డీసీపీ సాయిశ్రీ పర్యవేక్షిస్తున్నారు.

మూడంచెల భద్రత..

ప్రపంచంలోని 120 దేశాలకు చెందినవారు మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పరిణామాలతో పాకిస్థాన్ ఇటువైపు కన్నువేసి ఉండవచ్చనే అనుమానాలు ఇప్పటికే నిఘా వర్గాలను వెంటాడుతున్నాయి. అయినా.. భద్రతా చర్యల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ టీమ్స్‌ను రంగంలో దించారు. అనుమానాస్పద ప్రాంతాలపై కన్నేసి ఉంచారు. గచ్చిబౌలి స్టేడియానికి అతిథులు చేరుకునే వరకు అడుగడుగునా సాయుధ పోలీసులను మోహరిస్తున్నారు. మిస్‌వరల్డ్ పోటీదారులు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల పోలీసు అధికారులకు డీజీపీ జితేందర్ ఇప్పటికే పూర్తిస్థాయి బ్రీఫింగ్ ఇచ్చారు. పోటీలు షెడ్యూలు ప్రకారం జరుగుతాయని, మిస్‌వరల్డ్ పోటీదారుల పర్యటనలు యథావిధిగా ఉంటాయని, అతిథుల సంఖ్య మాత్రం పరిమితం కావచ్చని సీనియర్ పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.



ప్రస్తుత ప్రపంచ సుందరి క్రిస్టినాకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న అధికారులు

వైభవంగా ప్రారంభ వేడుకల నిర్వహణ

సంస్కృతి, సౌందర్యం మేళవింపుగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్‌వరల్డ్-2025 పోటీలు శనివారం ప్రారంభం కానున్నాయి. పోటీల ప్రారంభ వేడుకలను శనివారం గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర కళారూపాలన్నింటినీ సమ్మిళితం చేసి.. అందాల పోటీల వేదికగా తెలంగాణ ఖ్యాతిని, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పనున్నారు. ప్రారంభ వేడుకల సందర్భంగా ప్రముఖ గాయకుడు, శిక్షకుడు కొమండూరి రామాచారి 50 మంది శిష్య బృందంతో తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపిస్తారు. ఆ తరువాత కాకతీయుల కాలం నుంచి పేరొందిన పేరిణి నాట్య ప్రదర్శన 250 మంది కళాకారిణులతో ఏర్పాటు చేశారు. కళాకారులంతా కలిసి మిస్‌వరల్డ్ లోగో ఆకృతిని తమ విన్యాసాల ద్వారా ప్రదర్శించనున్నారు.

పాసుల కోసం 7వేల దరఖాస్తులు

మిస్ వరల్డ్ పోటీలను చూసేందుకు జనం ఆసక్తి కనబరుస్తున్నారు. పోటీల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. వాటిని చూసేందుకు పర్యాటక శాఖ ఉచితంగానే కొన్ని పాసులను ఇవ్వనున్నట్టు తెలిపింది. పాసుల కోసం రెండు రోజుల క్రితం ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రకటించింది. ఇందులో ఇప్పటివరకు దాదాపు 7వేల మందికి పైగా పాసుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంకా చాలా మంది పాసుల కోసం వెబ్‌సైట్ ఓపెన్ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి పాసులు ఇచ్చాక మళ్లీ పది రోజుల్లో సైట్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని పర్యాటక శాఖ పేర్కొంది.

అందాల భామలు.. బిర్యానీ, పలావ్‌లు!

- వారు ఘాటైన వంటకాలను ఇష్టపడుతున్నారు
- పులుసు, వేపుడు అడిగి మరీ తింటున్నారు
- 'మిస్ వరల్డ్' చెఫ్‌లతో 'ఆంధ్రజ్యోతి' ముచ్చట

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ దేశాల అందాల భామలు బిర్యానీ, పలావ్‌లను ఇష్టంగా తింటున్నారు. వీటితోపాటు ఘాటైన వంటకాలకూ జైకొడుతున్నారు. కొన్ని రకాల వేపుడు (ఫ్రై), పులుసును అడిగి మరీ తింటున్నారు. మిస్ వరల్డ్ పోటీలో ఉన్న 109 దేశాల సుందరీమణులకు వంట చేసిపెడుతున్న ప్రముఖ చెఫ్‌లు ప్రియాంక, ఉదయ్ ఈ విశేషాలు వెల్లడించారు. మిస్ వరల్డ్ పోటీదారులకు హైదరాబాద్ హైటెక్‌సిటీలోని ఓ స్టార్ హోటల్‌లో బస ఏర్పాటు చేశారు. ఆ హోటల్‌లో ఈ క్రమంలోనే ఆ హోటల్ వంటవాళ్ల (చెఫ్‌ల)తో 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించింది. అందాల భామలకు వారి దేశాల వంటలతోపాటు తెలంగాణ ప్రత్యేక వంటలనూ రుచి చూపిస్తున్నామని ప్రియాంక, ఉదయ్ తెలిపారు.



చెఫ్ ప్రియాంక



చెఫ్ ఉదయ్

"అందాల పోటీల కోసం వివిధ దేశాల నుంచి వచ్చిన వారందరికీ మంచి ఆహారం సిద్ధం చేస్తున్నాం. ప్రతిరోజూ కొన్ని ప్రత్యేక వంటలు అందిస్తూ, అందులో తెలంగాణ రుచులు ఉండేలా చూస్తున్నాం. వారు పులుసు, వేపుళ్లు ఇష్టపడుతున్నారు. బిర్యానీని అడిగి మరీ తింటున్నారు. రోజూ ఎన్ని వంటలు మారినా.. హైదరాబాద్ బిర్యానీ మాత్రం కచ్చితంగా ఉంటోంది. మటన్ కర్రీ, పుట్టగొడుగులు, బంగాళదుంపల వేపుడు కూడా చేసి పెడుతున్నాం. ఏయే దేశాల వారికి ఆ దేశ వంటలను కూడా అందుబాటులో ఉంచుతున్నాం. మొత్తంగా 60శాతం బయటి దేశాల ఆహారమైతే, 40 శాతం భారతీయ వంటకాలు ఉంటున్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన చంపారన్ రామ్‌పూరి థార్ కుర్మా, బిహారీ వంటకం అహునామీట్‌తోపాటు రాజస్థాన్, ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వంటలను సిద్ధం చేస్తున్నాం. రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నాం. 'అతిథి దేవో భవ' అన్న సూక్తిని అమలు చేస్తున్నాం.." అని తెలిపారు. ఇక మిస్ వరల్డ్ పోటీదారులకు భోజనాల తయారీ కోసం తమ దగ్గర 100 మంది చెఫ్‌లు, 500 మంది సహాయకులు ఉన్నారని హోటల్ జనరల్ మేనేజర్ కుమ్రా చెప్పారు. పోటీలకు వచ్చేవారి వివరాలు తెలుసుకుని, 45 రోజుల ముందునుంచే ప్రత్యేక వంటల కోసం ఏర్పాట్లు చేసుకున్నామని తెలిపారు. కొన్ని రకాల ప్రత్యేక వంటల కోసం ఐదుగురు అంతర్జాతీయ చెఫ్‌లు కూడా వచ్చారని పేర్కొన్నారు.

డ్రగ్స్ కేసులో మహిళా వైద్యురాలి అరెస్టు

రాయదుర్గం/హైదరాబాద్ సిటీ, మే9 (ఆంధ్రజ్యోతి): ముంబై స్మగ్లర్ నుంచి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న ఒక మహిళా వైద్యురాలిని రాయదుర్గం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆమెకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న స్మగ్లర్‌నూ అదుపులోకి తీసుకుని.. వారి నుంచి రూ.5 లక్షల విలువ చేసే 53 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. షేక్‌పేట్‌లోని అపర్ణ వన్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వైద్యురాలు చిగురుపాటి నమ్రత (34).. కొంతకాలం నుంచి ముంబైలోని వంశ్ టక్కర్ అనే స్మగ్లర్ నుంచి కొకైన్ కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల తనకు డ్రగ్స్ పంపాలని కోరుతూ.. వంశ్ టక్కర్‌కు రూ.5 లక్షలు ఆన్‌లైన్ ద్వారా పంపారు. వంశ్ తన అనుచరుడైన బాలకృష్ణ రామ్‌ప్యార్ (38)కు 53 గ్రాముల కొకైన్ ఇచ్చి హైదరాబాద్‌కు పంపాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు.. గురువారం సాయంత్రం 5గంటల సమయంలో నమ్రతకు బాలకృష్ణ కొకైన్ అందజేస్తుండగా పట్టుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని 53 గ్రాముల కొకైన్‌తోపాటు రూ. 10 వేల నగదు, 2 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

త్వరలో 5 వేల మంది సర్వేయర్ల నియామకం

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముందుకుపోతున్న ప్రభుత్వం.. సర్వే విభాగాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5 వేల మంది లైసెన్స్ సర్వేయర్లను నియమిస్తున్నట్లు చెప్పారు. సచివాలయంలో శుక్రవారం సర్వే విభాగంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సర్వేయర్ల నియామకం కోసం మే 5వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైందని, ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తుకు చివరి గడువు అని చెప్పారు. మీ సేవ కేంద్రాల నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని అక్కడే సమర్పించాల్సి ఉంటుందన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు 50 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు శిక్షణ ఫీజు నిమిత్తం ఓసీలు రూ.10 వేలు, బీసీలు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ2500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

గన్‌పార్క్, మే 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద పాత్రికేయులకు, వృత్తి నిర్వహణలో మృతిచెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలతోపాటు నిరుపేద జర్నలిస్టులకు శుక్రవారం నాంపల్లి ప్రెస్ అకాడమీ కార్యాలయంలో పింఛను, ఎక్స్‌గ్రేషియాకు సంబంధించిన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మండల కేంద్రాలు, నియోజకవర్గాల స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. మీడియా అకాడమీ భవనానికి ఈ నెలాఖరు లోపు మరమ్మతులు చేస్తామన్నారు.



హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ 'జనతా కీ కహానీ మేరీ ఆత్మకథ' పుస్తకాన్ని ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ శుక్రవారం ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఉన్నవారికి ఎదురయ్యే సవాళ్లను బండారు దత్తాత్రేయ ఆత్మకథ వివరిస్తుందని అన్నారు. ఈ పుస్తకావిష్కరణలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. బండారు దత్తాత్రేయ జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కుల, మతాలకు అతీతంగా ప్రజలు దత్తాత్రేయని అభిమానిస్తారని చెప్పారు.

దక్షిణాది రాష్ట్రాలకు 33% సీట్లివ్వాలి!

నియోజకవర్గాల పునర్విభజన అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను శిక్షించేలా ఉండొద్దు

- జనాభా ప్రాతిపదికన పునర్విభజనతో మా రాష్ట్రాలకు తీరని అన్యాయం
- 'ది హిందూ హడిల్ 2025'లో రేవంత్

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు తాము వ్యతిరేకం కాదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. కానీ, దక్షిణాది రాష్ట్రాలకు తప్పనిసరిగా 33 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు జనాభా ప్రాతిపదికన పునర్విభజన ప్రక్రియ చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కుటుంబ నియంత్రణను పక్కాగా అమలు చేసిన రాష్ట్రాలను శిక్షించేలా పునర్విభజన ప్రక్రియ ఉండకూడదని చెప్పారు. జనాభా ప్రాతిపదికన ఈ ప్రక్రియ చేపడితే దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల మధ్య అంతరం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సామాజిక, రాజకీయ న్యాయానికి సంబంధించిన అంశమని, అందుకే దీనిపై విస్తృత చర్చ జరగాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలతో సంప్రదింపులు జరిపి, పునర్విభజన ప్రక్రియకు ప్రాతిపదికను ఖరారు చేయాలని చెప్పారు. అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలన్నదే తమ డిమాండ్ అన్నారు. బెంగళూరులో శుక్రవారం హిందూ పత్రిక నిర్వహించిన 'ది హిందూ హడిల్-2025' కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి జూమ్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిగిన వివిధ ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. విభజన ప్రక్రియ వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను శిక్షించేలా ఉండకూడదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి పన్నుల రూపంలో పెద్దమొత్తంలో సొమ్ము అందజేస్తుండగా.. తిరిగి వచ్చేది మాత్రం బీమారు రాష్ట్రాల కంటే అతి తక్కువగా ఉంటోందని ఆరోపించారు. అందుకే తమ రాష్ట్రాలకు 33 శాతం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



'ది హిందూ హడిల్-2025' కార్యక్రమంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

తెలంగాణ విధానాలు దేశానికే ఆదర్శం..

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు, అనుసరిస్తున్న విధానాలు దేశానికి దిశానిర్దేశం చేస్తున్నాయని సీఎం రేవంత్ చెప్పారు. సామాజిక న్యాయంతో పాటు ఇతర అంశాల్లో తెలంగాణ నమూనాను కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరించాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య ఉద్యోగ, రాజకీయ సర్వే దేశానికే మోడల్‌గా నిలిచిందని చెప్పారు. ఈ సర్వే కేవలం బీసీల కోసమే చేసింది కాదని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకూ ఉపయోగపడుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ముందడుగు వేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ నమూనాను అమలు చేయాలని చెప్పారు. తెలంగాణలోని వేర్వేరు గురుకుల పాఠశాలల్లో ప్రత్యేకంగా సాగుతున్న విద్యను సమీకృతం చేయడం ద్వారా పిల్లల్లో సామాజిక స్పృహ, ఐకమత్యం పెంపొందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయమన్నారు. భారత సైన్యానికి వందనాలు సెల్యూట్ చెబుతూ సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "మొదటగా నేను భారతీయ సైన్యానికి సెల్యూట్ చేస్తున్నా. దేశాన్ని రక్షించడంలో అహర్నిశలు కృషి చేస్తున్న సైన్యానికి మనమంతా మద్దతు తెలపాలి" అని పిలుపునిచ్చారు.

అగ్రగామి నగరాలతో పోటీ

ప్రపంచంలోని అగ్రగామి నగరాలతో పోటీ పడాలన్నదే తమ ఆలోచనని, అందులో భాగంగానే నెట్ జీరో సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని సీఎం చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఫ్యూచర్ సిటీకి రూపకల్పన చేశామన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను రద్దు చేశామని చెప్పారు. హైదరాబాద్ వెలుపల 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డును నిర్మించడమే కాకుండా తెలంగాణలో ప్రాంతాల వారీగా పారిశ్రామికీకరణకు సన్నద్ధమయ్యామని వివరించారు. డ్రైపోర్టు నిర్మాణం వంటి అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశామన్నారు. రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించామని చెప్పారు. ఇటీవల జపాన్ పర్యటన సందర్భంగా తెలుసుకున్న విషయాల మేరకు ఆ దేశానికి అవసరమైన మానవ వనరులను సమకూర్చడానికి వీలుగా తెలంగాణలో జపనీస్ భాషను నేర్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. "జనాభాలో దాదాపు 60% ఉన్న వ్యవసాయ కుటుంబాలకు అండగా ఉండేందుకు అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 25 లక్షలకు పైగా రైతులకు రూ.21,617 కోట్ల రుణమాఫీ చేశాం. ఏటా రూ.12 వేలు పెట్టుబడి రాయితీగా ఇస్తున్నాం. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం. స్వయం సహాయక సంఘాల మహిళలకు వెయ్యి మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి చేసే అవకాశం, పాఠశాలల నిర్వహణ, యూనిఫామ్ కుట్టడం వంటి బాధ్యతలు అప్పగించాం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం" అని వివరించారు. అన్ని కోణాల్లోనూ తెలంగాణ రైజింగ్ మొదలైందన్నారు.

మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలి: కవిత

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొంటే అందాల పోటీలు పెట్టారన్న అపవాదు తెలంగాణకు వస్తుందని.. ఐపీఎల్ మాదిరి వాయిదా వేయాలని సూచించారు. ఇది విజ్ఞత ప్రదర్శించాల్సిన సమయమని.. తప్పుడు సంకేతాలకు తావు ఇవ్వకూడదని అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా భారత సైన్యానికి సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు కవిత ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతి ర్యాలీ నిర్వహించింది.

రేపు ఈఏపీసెట్ ఫలితాలు

హైదరాబాద్ సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ ఈఏపీసెట్-2025 ఫలితాలు ఈ నెల 11న వెల్లడికానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 11 గంటలకు ఫలితాలను విడుదల చేయబోతున్నారని సెట్ కో కన్వీనర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఫలితాలకు సంబంధించిన ర్యాంకులు, మార్కుల జాబితాను అభ్యర్థుల రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్లకు ఎస్ఎంఎస్ రూపంలో పంపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే సబ్జెక్టుల వారీగా మార్కులు, ఇతర వివరాలు కోరుకునే అభ్యర్థులు ఈఏపీసెట్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

నేడు, రేపు పలు జిల్లాల్లో వర్షాలు

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో రెండు రోజులు వర్ష సూచనను హైదరాబాద్ వాతావరణ కేంద్రం జారీ చేసింది. శనివారం 12 జిల్లాలకు, ఆదివారం 18 జిల్లాలకు రెయిన్ అలెర్ట్‌ను జారీ చేసింది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇక శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 15 మండలాల్లోని కొన్ని చోట్ల 2 నుంచి 6 సెంటీమీటర్ల మధ్య, 35 మండలాల్లో ఒక సెంటీమీటరులోపు వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. మరోవైపు 14 జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లోనే 40-42 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, మిగిలిన అన్ని జిల్లాల్లోనూ 37-40 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు రికార్డయినట్లు తెలిపింది. శని, ఆదివారాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల్లోపే నమోదయ్యే అవకాశముంది.

సీఎంవో వ్యవహారాలన్నీ శేషాద్రికి!

రేవంత్‌రెడ్డి కార్యాలయంలో అధికారుల శాఖల మార్పు

హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయంలో పలువురు అధికారుల శాఖలను ప్రభుత్వం మార్చింది. సీఎం రేవంత్‌రెడ్డికి ముఖ్య కార్యదర్శిగా ఉన్న వి.శేషాద్రికి సాధారణ పరిపాలన శాఖతోపాటు శాంతిభద్రతలు, న్యాయశాఖ, హోం, ఆర్థికం, ప్రణాళిక, శాసన వ్యవహారాలు, భూ రెవెన్యూ, ఆహార పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, వ్యవసాయం, పశు సంవర్థకం, పాడి పరిశ్రమ అభివృద్ధి, సహకార, మార్కెటింగ్ శాఖలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. దీంతోపాటు సీఎంవోలోని ఇతర అధికారులు, సిబ్బంది విధుల సమన్వయం, పర్యవేక్షణ బాధ్యతలు కూడా శేషాద్రి నిర్వహించనున్నారు. సీఎంవోలో పనిచేసే అధికారులంతా కీలక అంశాలపై ఈయనతోనే చర్చించాల్సి ఉంటుంది. ఇక సీఎం మరో ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు.. రవాణాతోపాటు రోడ్లు, భవనాలు, గృహనిర్మాణం, దేవాదాయ శాఖ, సమాచార, పౌరసంబంధాలు, క్రీడలు, యువజన సర్వీసులు, సాంస్కృతిక, పర్యాటక శాఖలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. కాగా, సీఎం కార్యదర్శిగా ఉన్న కె.మాణిక్‌రాజ్.. మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ, నీటిపారుదల, రెవెన్యూ (వాణిజ్య పన్నులు, ప్రొహిబిషన్, ఎక్సైజ్), గనులు, భూగర్భ, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలు, విపత్తు నిర్వహణ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలు పర్యవేక్షించనున్నారు. సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డికి ఇంధనశాఖ, విద్యాశాఖ, పరిశ్రమలు, పెట్టుబడులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, కార్మిక, ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీలతోపాటు సీఎం భద్రత, అపాయింట్‌మెంట్లు, సీఎంవో అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించారు. ఇక సీఎం ఓఎస్డీగా ఉన్న వేముల శ్రీనివాసులు.. మహిళా, శిశు, వికలాంగ, వృద్ధుల సంక్షేమం బాధ్యతలు, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ బాధ్యతలను పర్యవేక్షించనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.